
# తిమ్మమ్మ

## బుర్రకథ

50684

ఎద్దుల నందిరెడ్డి



# తిమ్మమ్మ బుర్రకథ

రచయిత

ఎద్దుల నందిరెడ్డి, బి. ఏ., యల్ యస్. జి.
డిప్యూటి కలెక్టర్, రెవెన్యూ డిపార్టుమెంటు.

ప్రకాశకులు:

రఘునాధ & విష్ణుమూర్తి బ్రదర్స్,
గూటిబయలు గ్రామము మరియు పోస్టు
వయా గాండ్లపెంట–515 521
కదిరి తాలూకా, అనంతపురంజిల్లా.

ప్రథమ ముద్రణము: 1992 సం॥

ప్రతులు: 1000

పుస్తకములు దొరుకుచోటు:

రఘునాథ & విష్ణుమూర్తి బ్రదర్స్,
గూటిబయలు పోస్టు
వయా గాండ్లపెంట-515 521
కదిరి తాలూకా, అనంతపురంజిల్లా.


50684

ముద్రణ స్థలము:

విజయభారతి ప్రింటర్స్, మదనపల్లె-517 325

సర్వసామ్యసంకలితము: ప్రకాశకులవి

మూల్యము రూ. 15/-



శ్రీమన్ కృపాజలనిధే కృత సర్వలోక
సర్వజ్ఞ శక్త నతవత్సల సర్వశేషిన్।
స్వామిన్ సుశీల సులభాశ్రిత పారిజాత
శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే॥

"This book is published with the financial aid of Rs. 7,100/- from the T. T. D under the scheme of Aid to publish religious books."

ఈ పుస్తకము శ్రీ తిరుమల-తిరుపతి దేవస్థానమువారి ఆర్థిక సహాయముతో ప్రచురింపబడినది.

# కృతజ్ఞతలు

మా తండ్రిగారు శ్రీ ఎద్దుల గంగిరెడ్డిగారు వ్రాసియుండిన తిమ్మమ్మ బుర్రకథ యీ కథకు మూలము. మూలకథను, చాలా కాలముక్రితమువ్రాసి, కథకులకిచ్చి, జనసామాన్యముతో ప్రచారములో చేయించిన మా తండ్రిగారికి ఓం ప్రథంగా కృతజ్ఞతాపూర్వక వందనములు తెలుపవలసియున్నది.

ఈ పుస్తక ముద్రణకు ద్రవ్య సహాయముచేసిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువారికి సర్వదా ప్రణతులిడుతున్నాను.

ఈ పుస్తకమును ఆమూలాగ్రముగా చదివి, తగు సలహాలిచ్చి వారి అమూల్య అభిప్రాయములనిచ్చిన మిత్రులు మదనపల్లె బిసెంటు కళాశాల తెలుగు శాఖాధిపతి, శ్రీ మల్లెల గురవయ్యగారికి, తిరుపతి ఓరియంటల్ కళాశాల సంస్కృత శాఖాధ్యక్షులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారికి, శ్రీ ఎద్దుల శంకర నారాయణగారికి కృతజ్ఞతాభివందనములు.

చివరిగా, ఈ గ్రంథమును అనతికాలములో చక్కగా ముద్రించిన మదనపల్లె విజయభారతి ప్రింటర్సువారు, శ్రీ యస్. కృష్ణారెడ్డిగారికి కృతజ్ఞతలు తెలుపుచున్నాను.

—రచయిత

# అంకితము



భక్తి జ్ఞాన వైరాగ్యములను ఉగ్గుపాలతో
నూరిపోసి, ఇహపరాలను సాధించే హితకర
విద్యలను నేర్పించిన పూజ్యులు
మా తల్లి దండ్రులు,


**శ్రీ ఎద్దుల గంగిరెడ్డి, లక్ష్మమ్మ గార్లకు**

పూజ్యభావముతో అంకితము.



ఈశ్వరమలై పరిసరములు.

కమనీయమయిన తిమ్మమ్మ మఱ్ఱిమాను వృక్షము.



అల్లిబిల్లిగా అల్లుకొన్న తిమ్మమ్మ మఱ్ఱి
శాఖోపశాఖల మనోహర దృశ్యము.

ఓం శ్రీ గణేశాయనమః

# శ్రీ తిమ్మమాంబ చరిత్ర - బుర్రకథ

## [ ప్రథమ భాగము ]

మూలము : శ్రీ ఎద్దుల గంగిరెడ్డిగారు వ్రాసి యుండిన తిమ్మమ్మ బుర్ర కథ

రచయిత : శ్రీ ఎద్దుల నందిరెడ్డి, బి. ఎ., యల్. యల్. బి., డిప్యూటి కలెక్టరు.

## ముందు మాట

తిరుమలేశుని వరప్రసాదమున బుట్టిన తిమ్మమాంబ ఆంధ్ర రమణీ మణియే గాదు భారత నారీమణి. సీత, సుమతి, సావిత్రి, అనసూయాది భారతనారీమణుల స్థాయికి చెందినది. ఈమె 14వ శతాబ్దములో బుక్కపట్నము నందు బాలాజీ భక్తులయిన చిన్నక వెంకటప్ప, మంగమ్మయను పుణ్య దంపతుల నోముల పంటగా జన్మించినది. గుణ, రూప. లావణ్యవతిగా పెరిగి పెద్దదై, గూటిబయలు గంగరాజుల సంస్థానమునకు చెందిన బాలవీరయ్యను పరిణయమాడెను. పతివ్రతా తిలకమై, కుష్టువ్యాధి సంభవించిన భర్తకు అపర సుమతి వలె సేవలు జేసినది. తుదకు ఆ వ్యాధివలన కాలధర్మము చెందిన భర్తతో పాటు సహగమనము జేసినది.

సహగమన సమయమునందు తిమ్మమాంబ గుండమునకు ఈశాన్యదిశలో నాటిన మర్రి స్తంభము చిగురించి, దిన దిన ప్రవర్థమానమై, "ఇంతింతై వటుడింతయై" యన్నట్లు తిమ్మమ్మ మర్రిమానుగా వ్యవహరింపబడి "ఇంతింతై వటమింతయై పెరిగి ఎంతో పెద్దదై" అల్లిబిల్లిగా నల్లుకొన్న ఊడలతో, ఆకాశమును తాకే కొమ్మలతో వ్యాపించి, ఈనాడొక విశ్వ మహావృక్షమై సుమారారెకరములు సువిస్తరించి ప్రపంచ ప్రసిద్ధి చెంది "గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్" లో కూడా నమోదు కాబడి యుండుట మన ఆంధ్ర దేశమునకే కాక యావద్భారత దేశమునకునూ గర్వకారణమన వచ్చును.

ఈ అద్భుత వటవృక్షము అల్లిబిల్లిగా నల్లుకొన్న ఊడలతో ఆకాశమును దాకు శాఖోప శాఖలతో నందన వనముగా కనులకు పండుగ చేయుచున్నది. ఈ దేవతా వృక్షము ఒక వనదేవతగా, పూజించిన వారికి కల్పవృక్షముగా కోర్కెలీడేర్చుచున్నది. ఇమ్మహత్తర వృక్షము అనంతపురం జిల్లా కదిరి తాలూకా గూటిబయలు గ్రామములో నెలకొని యున్నది. ఆ తిమ్మమ్మ మర్రిమాను కథయే తిమ్మమాంబ కథ. కలకాలము అందరికి ప్రత్యక్షముగా కనిపించే కథ యిది.

పూర్వము నుండి తర తరాలుగా జనానుశ్రుతముగా వచ్చు నీ కథను మా తండ్రిగారు శ్రీ ఎద్దుల గంగిరెడ్డిగారు పెద్దల వలన వినియు, ప్రాత కాగితముల నుండి బట్టమీద వ్రాసియుండిన రెండు పుస్తకమునుండి ఎత్తి వ్రాసికొనియు సుమారు నలుబది సంవత్సరముల క్రితము బుర్రకథగా రచించి దాసర్లకు, జంగములకు, హరికథకులకు ఇచ్చి తిమ్మమాంబ కథను బహుళ ప్రచారము చేయుటకు నిర్విరామముగా పాటుపడిరి. ఆయన వ్రాసిన బుర్రకథ ఈనాడు ఆంధ్ర కర్ణాటక ప్రాంతములలో బహుళ ప్రజాదరణమును పొందియున్నది. శ్రీ గంగిరెడ్డిగారు ప్రస్తుతము తిమ్మమాంబ దేవస్థానమునకు ధర్మకర్త. నాలుగు దశాబ్దములుగా అనన్య సామాన్యమయిన వీరి కృషివల్లనే యీనాడు యీ కథ వెలువడియున్నదనిన అతిశయోక్తి కానేరదు.

ఈ విషయములో మా తండ్రిగారి అడుగు జాడలలో నడచిన నేను, బాల్యమునుండి గత మూడు నాలుగు దశాబ్దములుగా కృషి చేసి తిమ్మమాంబ కథతో సంబంధముగల ప్రాంతములను గూడ సందర్శించి అచ్చటి పెద్దలు, విజ్ఞుల వలన తత్కథా వివరములను పూర్తిగా దెలిసికొని తిమ్మమాంబ కథను విపులముగా వ్రాసి తిరుమల – తిరుపతి దేవస్థానము వారికి 1988వ సంవత్సరము నవంబరు 16వ తేదిన సమర్పించితిని. వారు నిపుణులయిన పండితులచే పరిశీలింపజేసి ప్రచురించుటకై పదివేల రూపాయలను మంజూరు చేసినారు. ఇట్లు సహకరించిన తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యము వారికి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ వెంకటపతిరాజు, ఐ.ఏ.యస్ గారికి కృతజ్ఞతాభివందనములు దెల్పుకొను చున్నాను.

ప్రభుత్వోద్యోగిగా వున్నందున సాహిత్యపరమయిన పనులన్నియూ దీర్ఘకాలమయిన సెలవులు పెట్టి వ్రాయవలసి వచ్చెను. తిమ్మమాంబ కథను పూర్తిగా, విపులముగా వచన రచన చేసిన తరువాత ప్రచారములోవున్న దేశింగురాజు కథ, కామమ్మ కథ, బాలనాగమ్మ కథ మున్నగు బుర్రకథల పుస్తకాలను గూడ పరిశీలించితిని. బుర్రకథను వ్రాయడానికి సాహిత్య పరిచయము, కొంత సంగీత జ్ఞానము శ్రావ్యంగా లయబద్ధముగా పాడగల గళము అవసరము. రచయితకు లోక వృత్తము దెలిసియుండుట లోకానుభవజ్ఞానము ముఖ్యముగా తన కథావస్తువులోని పాత్రలు ప్రాంతములను గూర్చిన సంపూర్ణమైన అవగాహన అవసరమని దెలిసికొంటిని. మా తండ్రిగారు వ్రాసిన బుర్రకథను గొంత సంస్కరించి, వీలయిన చోట్ల ఆ కథను యధాతధముగా స్వీకరించి మెరుగులు దిద్ది సులభము, సుందరము అగు జనసామాన్యుల బాషలో జనుల వాడుకలో నున్న జాతీయాలను చొప్పించి ఎంతో కృషి చేసి,

ఈ తిమ్మమ్మ బుర్రకథను వ్రాయగలిగితిని. మా తండ్రిగారు వ్రాసియుండిన బుర్రకథ లేకున్నచో ఈ బుర్రకథ వెలువడి యుండెడిది కాదు. ఆ కథ యుండడమువల్ల నాయీ ప్రయత్నమెంతో సులభ తరమయినది. ఈ బుర్రకథను మలచుకొన్నచో హరికథగా చెప్పుటకుకూడ వీలున్నది. ఇదే కథను సావధానముగ పండరి భజనవలె అడుగులు వేసికొనుచు పాడుకొనవచ్చును.

"పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట'' అని భాగవత రచనా సందర్భముగా శ్రీ పోతనామాత్యుడు తెలిపినట్లు ఈ కథను పలికించినది, మహిమాన్వితురాలైన తిమ్మమాంబయనియే నా విశ్వాసము. నిరంతర మా జగన్మాతయే నాకీరచనా వ్యాసంగములో దారిచూపినది నేను కేవలము నిమిత్తమాత్రుడనై ఈ రచన సాగించితిని, నాయీ కృషి సఫలమగుటకు మా తండ్రిగారు వ్రాసియుంచిన మూలకథ ఆ ఏడుకొండలవాని యనుగ్రహము తిమ్మమాంబ కృపయే గాని యప్యముగాదని విన్నవించు చున్నాను.

—రచయిత

వివరణ:- కథకులు
సందర్భానుసారంగ పాడు
కొనుటకుపయుక్తంగా వుండు మంగళం – మహత్
నని కొన్ని పాటలిందు పొందు
పరచడమైనది.

## పాట

### 1. కళ్యాణిరాగం ఆదితాళం (తిశ్రగతి)

1. తిమ్మమాంబ కథను వినుడు భక్తులార
అపర సుమతి అమ్మ కథ అయ్యలార ॥తి॥
2. తిరుమలేశు వరపుత్రి, తిరుమలమ్మ
తియ్యనైన చరితమిది అమ్మలార ॥తి॥
3. ఆదిశక్తి అమ్మయై అవతరించె
ధర్మ రక్షణార్థమై భువిజనించె ॥తి॥
4. ఒకే మాట ఒకే బాట ఒకటియే పని
అదే ధర్మ పథమూ—అదే అమ్మ మతము ॥తి॥
5. జనులమేలె తనమేలని తలచినాది
అందుకెన్నో పథకాలను వేసినాది ॥తి॥
6. మంచి పన్ను పనులనెన్నో చేసినాది
మంచి దారి జనులకెపుడు చూపినాది ॥తి॥
7. దాన ధర్మములను ఎన్నో చేసినాది
ధర్మ పథము జనులకెపుడు చూపినాది ॥తి॥
8. మర్రిమాను అమ్మగా నిలిచినాది
చల్లనమ్మ ఆమె కథను తెలిసినాది ॥తి॥

# పాట

## మోహనరాగం–ఆదితాళం

(నమో హిందూమాత–మాదిరి)

1. నమో తిమ్మమాంబ సుచరిత–నమో పరాశక్తి
తెలుగు వారికి ఆడబిడ్డవట
భరత మాతకు అనుగుబిడ్డవట
అన్ని దేశముల ఖ్యాతిగాంచిన
తిమ్మమ మర్రి దివ్యనిలయమట ॥న॥

2. ఈశ్వరమలలో చల్లని సీమల
కన్నుల పండుగ వ్యాపించిన నీ
మర్రిమాను మా కల్పవృక్షమట ॥న॥

3. గోకుల కృష్ణుని వేణువునెన్నో
మర్రిమానులో మ్రోగించినయటు
శుకపిక శారికలెన్నో పలుకగ
కోయిల పాటలు మారుమ్రోగెలే ॥న॥

4. నెమలులు కూసెను నాట్యములాడెను
ఈశ్వరమల వనసీమల యందున
స్వర్గసీమగా మారెను భువిలో ॥న॥

5. ప్రకృతి మాతకు పట్టుగొమ్మయట
స్వర్గసీమకు సన్నిధానమట
తిమ్మమాంబ నీ మర్రిమాను అట ॥న॥

6. కలకలాము మా కన్నుల చల్లని
వెన్నెలలెన్నో విరియించుము మా
తిమ్మమాంబనువు మర్రి మానుగ ॥న॥

7. మధురం మధురం మర్రినీడమట
మల్లెమాలలు చేకొనవమ్మా
మంజులవాణి మా తిమ్మమ్మ ॥న॥

8. మమ్ముచల్లగా కావుము అమ్మ
మంగళహారతులివిగో కొమ్మా
తిమ్మమాంబకివె జయ మంగళములు ॥న॥

# కథకులకు కొన్ని సూచనలు

భారతమును తెనిగించిన నన్నయామాత్యునికి పూర్వము నుండియు పద కవిత్వము, జానపద సాహిత్యమున్నట్లు పాల్కురికి సోమనాధుని కృతులదలిన ఆంధ్రవాఙ్మయ చరిత్రవలన విదితమగుచున్నది, బుర్రకథ జానపద సాహిత్యము సామాన్య జనుల కర్థమగు కథా సంవిధానము. ఏ కథనైనను ఒక నదీ ప్రవాహముతో బోల్చవచ్చును. ప్రవాహము తొలుత కొండచరియలో తిన్నగా ప్రారంభమై సెలయేరుగా మారి, కొండ కోనలలోగలగల ప్రవహించి మైదానములో మెల మెల్లగా సాగి, పంట పొలములను పండించుచు సాగరమును జేరుకొనును. అట్లే కథాగమనము గూడా తిన్నగా ప్రారంభమై. మలుపులు దిరుగుచు రాను రాను జనరంజకమగును. కథావధానము భావయుక్తముగా సాగవలెను. సామాన్య జనాదులకర్థమగు రీతిలో చెప్పవలెను, ఈ సందర్భములో దాసర్లను గమనించండి, వారిలో కొందరు బుర్రకథను చాల భావయుక్తముగా చెప్పగలరు. అందుకు కథకుడు మొదటి కథను అందులోని పాత్రల స్వభావాదులను బాగుగా అర్థము చేసికొనవలెను. మంచి కంఠము ఉచ్చారణ బాగుగా ఉన్నచో కథ రక్తికట్టును. దీనికి తోడు కథకుడు భావము, రాగము, తాళము, పల్లవి మున్నగు విషయములో శ్రద్ధ తీసికొని అన్నింటిని సమన్వయించుకొని కథ సాగించినచో కథాగమనము జోడు గుర్రములను బూచ్చిన రథమువలె గంభీరముగా సాగిపోవును.

ప్రధానముగా కథకుడు కథను సన్నివేశమునకు భావమునకును అనుగుణముగా నవరసములతో రంగరించి జనము నచ్చునట్లుగా నేర్పుతో, నయముగా, ప్రియముగా చెప్పవలెను, కథలో శ్రోతలను కవ్వించి, నవ్వించి నవ్వుల పూలు పూయించుటకు హాస్యము చాల అవసరము. సాధారణముగా ప్రతి కథయందును విధూషకుని పాత్ర కొంత యుండును గదా. అందుకే వలచినచోట్ల సందోర్భచితంగా, హాస్యోక్తులను, సంభాషణలను, పొందుపరచడమైనది. కథకులు సందర్భానుసారముగా ఈ సంభాషణల నాధారముగా గ్రహించి అచ్చటచ్చట క్లుప్తముగా హాస్యరసమును గూడా పోషింప వలసి యున్నది.

నదీ ప్రవాహము నేలను బట్టి ప్రవహించునట్లు కథావధానము సన్నివేశమును బట్టి అభినయముతో పాటు సాఫీగా నిధానముగా సాగవలెను, సంతోషముగా ఉల్లాసంగా కొంత చెప్పవలెను. ఉత్సాహముగా వుద్రేకముగాను చెప్పవలసి యుండును. యోచనతో శోకాలాపనతోను చెప్పవలెను. భావమునకు సన్నివేశమునకు దగినట్లు కథకుడు అంగాంగ ప్రదర్శనము లేక అభినయమును కూడా చేయవలెను. యుద్ధము జేయు సన్నివేశములో కథకుడు ముందుకు దుమికినట్లు చెప్పవలెను. తీవ్రముగా వుద్రేకముగా చెప్పునప్పుడు కథకుడు గూడ క్షణ క్షణము కదులుచు ముందు వెనుకలకు అడుగులు వేయుచు ఒక్కొక్కసారి సన్నివేశమును బట్టి చుర్రున వెనుకకు దిరుగుచు చెప్పవలెను.

కథకుడు ఆ విధముగా శ్రోతలను ఆకట్టుకొని కథలో లీనమై అనగా పాత్రలతో లీనమై చెప్పినప్పుడు శ్రోతలను బాగుగా రంజింప జేయగలడు. కథను రచయిత వ్రాసినది ఒక ఎత్తయినచో కథ అంతా కథకుడు చెప్పు విధానము తదవధానము పై ననే ఆధారపడియుండునని గమనింపవలెను. దీనికి కథకుడు కొంత సాధన చేయవలసియున్నది. కథకుడు పాత్రోచితముగ నటించుచు, లేక అభినయించుచు చెప్పుటయేగాక దైవికమయిన ఆరాధనా భావమును కలిగి యుండవలెను. తొలుత వినాయకుని చదువుల తల్లిని ప్రార్థించి కథకు అధిష్టాన దేవతయిన తిమ్మమాంబను ఉపాసన చేయవలెను. శ్రోతలలో గూడ అట్టి ఆరాధనాభావమును గలిగింప వలెను అప్పుడే కథ బాగుగా రాణించును. జనమును రంజింప జేయగలుగును. కథ జనరంజకమైనచో కథకుని పంట పండినట్లె. ఇట కథకులకు కొన్ని సూచనలే చెప్పబడినవి, తక్కిన వానిని కథకులే స్వీయానుభవముతో తెలిసికొనవలసిన అవసరమున్నదని విజ్ఞప్తి.

—రచయిత

## పాట

(చల్లని రాజా ఓ చందమామ మాదిరి)

రాగం—కర్ణాటక దేవగాంధారి—ఆది తాళం

చల్లని మాతా ఓ తిమ్మమాంబ!
కరుణించి, మమ్మేలు మా కన్నతల్లి, ఓ తిమ్మమాంబ।...........చ॥

1. వృక్ష సంపద సామ్రాజ్య, సామ్రాజ్ఞిగా
కల్ప వృక్షమ దేవతకు, తోబుట్టుగా
మిము పూజించెదమ్, మము పాలించుమా
ఓ చల్లని పచ్చని మా తిమ్మమాంబ ॥చ॥

2. వేనవేలుగ కొమ్మలు విడచేవమ్మా
అల్లి బిల్లిగ వూడలు నల్లేవులే.
ఆకాశముకెంతో పెరిగేవుగా
మా ఇలవేల్పువై, మము దయజూడుమా
ఓ చల్లని వెన్నెల మా తిమ్మమాంబ ॥చ॥

3. మిము జూచిన మా మది మునుముందుగా
మా నేత్రములెంతో వికసించుగా
తాప మడుగంటునే, కోర్కెలీదేరునే
నీ చల్లని నీడల మమ్మేలుమా ॥చ॥

4. ప్రతి నిత్యము పూజలు జరిపేమమ్మ
సిరి సంపదలు మాకు కురిపించుమా
మా కులదేవతా, మము కాపాడుమా
శుభదాయిని, చల్లని మా తిమ్మమాంబ చ॥

# మల్లెల మాటలు

మాన్య శ్రీ ఎద్దుల నందిరెడ్డిగారు ప్రస్తుతము చిత్తూరుజిల్లాతో డిప్యూటి కలెక్టరుగా ఉద్యోగ ధర్మమును అకుంఠిత దీక్షతో నిర్వహించుచు, సామాన్య ప్రజానీకముతో ఎంతో సన్నిహితముగా మెలగి సర్వవిధ సహకారములందించు చున్నారు. వీరు 1989వ సం॥ము నవంబరు నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో సుమారు రెండు మాసములు మదనపల్లె కళాశాలలోనే అహో· రాత్రములుండి సుంతయైన విశ్రాంతిలేక ఎన్నికలకు సంబంధించిన బాధ్యతలను కడు పటిష్ఠముగా ఎంతో ఓర్పుతో, నేర్పుతో నిర్వర్తించిరి. ఆ ఎన్నికల సందర్భముననే డా॥ కె. ఎం. కృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాలు ద్వారా వీరితో నాకు మైత్రి యేర్పడినది. సాహిత్య ప్రక్రియ యేదియైనను అది సామాజిక చైతన్యమునకు దోహదకారి కావలెనన్న వీరి ఆశయము – తదనుగుణముగా వీరు వ్రాసిన, వ్రాయుచున్న రచనలు నన్నెంతో ఆకట్టుకొన్నవి. ఎన్నుకొన్న యితి వృత్తము ప్రజా సామాన్యములో నేటికిని బహుళ ప్రచారమును పొంది అందరచేత కీర్తింపబడుచున్న ఒక పతివ్రతామ తల్లి కరుణామయ గాధ. ఆమెయే ఒక వటవృక్షమై దిన దిన ప్రవర్ధమానము చెందుచు తన చల్లని అనుగ్రహచ్ఛాయలతో ఆశ్రయించినవారినెల్ల అలరింపజేయు చున్నదని స్థానిక ప్రజల ప్రగాఢ విశ్వాసము, వటుడింతై అంతై తుదకు బ్రహ్మాండమెల్ల ఆవరించినట్లు తిమ్మమ్మ పేర ప్రచారములో నున్న మర్రిచెట్టును, ఎంతో విస్తరించి తన కీర్తిశాఖలను దిగంతములెల్ల ప్రసరింపజేసినది.

వట రూపమున నెలకొని విభిన్న ముఖముల నానాటికి విస్తరించుచు – ఎవ్వరెవ్వరేయే ఆశయములతో తన ఆశ్రయము కోరుదురో వారికాయా ఆశల నన్నింటిని ఫలింప జేసి నిత్యారాధ్య దేవతగ ప్రజల చేత ప్రస్తుతింపబడు తిమ్మమ్మ ప్రభావమును అనుభవజ్ఞులనుండి గ్రహించి ఆమోదించుట, భక్తి శ్రద్ధా విశ్వస పూర్ణులైన పాఠక మహాశయుల ప్రధమ కర్తవ్యము. వివేచన శీలులైన శ్రోతల వశ్యమనుష్ఠింపదగు పరమ ధర్మము.

మహనీయ పవిత్ర చరిత్రలను మాటి మాటికి మననము చేయువారి జన్మము ధన్యము, మాన్యము. విశ్వశ్రేయోబుద్ధియే లక్ష్యముగా – అందుకు తమ జీవితములే సాక్ష్యములుగా తమ సర్వస్వమును సమర్పించిన విముక్తాత్మలనుండి అద్వితీయ శక్తి అభివ్యాప్తమై, ఆశ్రయించినవారి ఆశయములను అవలీలగా తీర్చునను నభిప్రాయము సర్వమతములవారు, సర్వకాలాలలో అంగీకరించిన పరమ సత్యము.

ఎన్నడో జరిగిన ప్రసిద్ధ వృత్తాంతములను తరువాత తరములవారు పరంపరగా నొకరికొకరు తెలుపుకొనుట పరిపాటి, కర్ణాకర్ణికగా విన్న వృత్తాంతములలోని కొన్ని సంఘటనలు కాలక్రమమున మరుగున పడిపోవచ్చును. అట్టి సందర్భమున విషయ విస్మృతి కొఱకు తరువాత వచ్చిన కొందరు రచయితలు కొన్ని సంఘటనలను తమ ప్రతిభా విశేషములతో ప్రధానకథా పరిపోషకముగా అనుసంధింప వచ్చును. ఈ విధానమునసుసంధించు రచయిత ఎంతో ఔచిత్యమును పాటింప వలసియున్నది. ఊరక అతివేలములగా విస్తరించినందు వలన ఫలితములేదు. అనుకూల వాతావరణమును కల్పించి ఔచిత్యమును పోషించుచు, రసస్ఫూర్తిని నెలకొల్పుటయే సర్వ సమర్థుడైన రచయిత యొక్క ప్రధాన లక్ష్యము. ప్రస్తుతము అట్టి లక్ష్యమునకు శ్రీ ఎద్దుల నందిరెడ్డిగారి "తిమ్మమాంబ చరిత్రము-బుఱ్ఱకథ" ఒక ప్రత్యక్ష సాక్ష్యము. శ్రీ నందిరెడ్డిగారి తండ్రి శ్రీ ఎద్దుల గంగిరెడ్డిగారు కొన్ని తరములనుండి ప్రచారములోనున్న "తిమ్మమాంబ చరిత్రము"నకు తాను విన్నవికొన్ని పాత తాళపత్రుల నుండి ఏరుకొన్నవి కొన్ని జతచేర్చి సంగ్రహముగా బుఱ్ఱకథను పొందుపరచిరి. అదినేడు పలువురి కథకులకు జీవికగా ఏర్పడినది. తండ్రినుండి సంక్రమించిన ఈ విశిష్ట లక్షణమే మరికొన్ని తెమ్మలువైచి శ్రీ నందిరెడ్డిగారికి ఎంతో ప్రోత్సాహమొసగినది. "పుత్రాదిచ్ఛేత్పరాజయ" మన్న నానుడి వీరి విషయమున అన్వర్థమైనది.

శ్రీ నందిరెడ్డిగారు ఎంతో సామాజిక స్పృహగల రచయిత. ఎంతటి అభ్యుదయ భావములనైన హృదయమునకు హత్తుకొనునట్లు మహోద్వేగముతో వెల్లడింపగల సామర్థ్యము సాహిత్య ప్రక్రియలలో "బుఱ్ఱకథ"కు వలె మరే ప్రక్రియకు లేదనుట నిర్వివాదము. అల్లూరు సీతారామరాజు, భగత్‌సింగ్ వంటి విప్లవ వీరుల మహోన్నతాశయములను వీర రసస్ఫూర్తితో ప్రతిశ్రోత హృదయఫలకమున ప్రగాఢముగా ముద్రింపగల స్ఫూర్తి, తీవ్రత బుఱ్ఱకథలోనే కలదని అభ్యుదయవాదులందరూ గుర్తించిన పరమరహస్యము. కేవలము వీర రసమునేగాక కరుణరస పరిపోషణలో కూడ 'బుఱ్ఱకద' ఎంతో ప్రాచుర్యము వహించినదను విషయము మనము మరువరాదు. కరుణ రసాత్మకములైన మహాపతివ్రతల చరిత్రలెన్నో "బుఱ్ఱకద' ల రూపములో మొదటినుండి బహుళ ప్రచారమును గాంచి సర్వప్రజాదరణ పొందుచునే ఉన్నవి. శ్రీ నందిరెడ్డిగారు ప్రజల హృదయనాడిని బాగుగా పసిగట్టిన ధర్మ కర్మ పరతంత్రులైన మర్మజ్ఞులు. వృత్తి ధర్మమునుబట్టి సాంఘిక చైతన్యమునకై సదా ప్రయత్నించు హితమతులైన శ్రీ నందిరెడ్డిగారు సాంఘిక చరిత్రకు ప్రాధాన్యమిచ్చుచు తిమ్మమాంబ చరిత్రను ఇంతకు మునుపే చక్కని చారిత్రక సామాజిక ఇతివృత్తంగా రూపొందించిరి. నవల రూపములో చదువువారికన్న ఆమె చరిత్రమును "బుఱ్ఱకథ రూపములో విని తరించువారే అధికసంఖ్యలో నుందురని రచయిత గ్రహించి

తండ్రిగారు సంతరించిన గాథనే ఎంతో విస్తరించి అన్నిహంగులు సమకూర్చిరి. ఇట్టిహంగును కూర్చి విస్తరించుటలో ఎన్నో విషయములు చోటుచేసుకొన్నవి. అనేక సంప్రదాయములు, ఆచారములు కుటుంబపరిధిలో వివిధ వర్గములవారిలో నేర్పడు మంచిచెడ్డలు – ప్రజాభ్యుదయమునకు ప్రభుత్వము తలపెట్టిన సాంఘిక సంక్షేమపథకములు ఇట్లెన్నియో ఈ బుఱ్ఱకథలో సమరసభరితముగా రచయితచే చేకూర్పబడినవి. ఈ బుఱ్ఱకథను చదువుచున్నంతసేపు పాఠకులు పూర్తిగా పరిమోహలోకమున అనగా కథావిషయక జగత్తులో నిమగ్నులగుదురనుట యథార్థము. ఇందులో హరికథకు సంబంధించిన ప్రక్రియా విశేషమునుగూడ రచయిత చక్కగా పొందుపరచిరి. ఒక్కొక్క ఘట్టములో వారు చూపిన నేర్పును పాఠకలోకులు పరికించగలరు. ముంజేతి కంకణమును జూచుట కద్దపక్కర లేదుగదా! సర్వసమగ్రమయిన సమీక్షచే ఇంకను గ్రంథవిస్తృతి కాగలదు. ఒక్కమాటలో చెప్పాలంటే యీ బుఱ్ఱకథ ఎట్లు వుండవలెనో – అట్లై వున్నది. ప్రస్తుతమునకు సారభూతమైన ఈ ఉపోద్ఘాతముతో విరమించుచున్నాను.

ఇట్లు
సదా మీ శ్రేయాభిలాషి, మల్లెల మనసుతో
**మల్లెల గురవయ్య**
తెలుగు శాఖాధిపతి,
బిసెంటు దివ్యజ్ఞాన కళాశాల, మదనపల్లి.

## ప్రస్తావన

ఆ॥ తిమ్మమాంబకథను తేట తెలుగునందు
బుర్రకథగ వ్రాసె బుధుడునంచి
రెడ్డి తెలుగువారు ప్రేముడిపొగడగ
రాగ తాళ భావరమ్య పణితి

ఆ॥ సన్నివేశమెరిగి చదువరులనెరిగి
రాగ తాళములను రాటుతేలి
చిత్రమైనశైలి చిగురింప చిరుమల్లె
సోయగాలు నింపి వ్రాయునితడు

**ఎద్దుల శంకరనారాయణ**, బి.ఎ., బి.ఇడి.
సి. టి. యం. మదనపల్లి. తా॥

## పాట - భూపరాగం - ఆదితాళం

1. జోహారు మాఅమ్మా, మీకు జోహారు తిమ్మమ్మా
ఆకాశమంత పందిరివోలె, విస్తారమొందావా
ఓబూళ ఈశ్వర శిలాలకాండల—నడుమానపచ్చన్ని కొండవమ్మా ॥జో॥

2. ఐదేకరములా - వటరాజమై నీవు
వర్ధిల్లు తున్నావా - భారతదేశ
బ్రహ్మాండవటమా - వందనము
పలుమారు జోహారమ్మా ॥జో॥

3. ఉగేమిలే తల తూగేయిలే
మీ వూడలు కొల్లలుగా, పెరగేయిలే మీ
కొమ్మలు మింటికి. వినువీధి విహరించు చున్నాయమ్మా ॥జో॥

4. కాశ్మీరి దృశ్యపు భూలోక స్వర్గమ
యన్నట్లు వున్నావే. యాత్రికులెందరొ
"ఎ తెంచుచుందురు. నిత్యము మిము జూడవనదేవతా ॥జో॥

5. ఏనాటి వరమొ ఏ నోము ఫలమో
మజలేము మీ నీడలో
సఫలంబులే ఇక మా జన్మాదులు
సఫలంబు మమ్మారు సఫలంబులే జో॥

6. వినిపించలేని చరితములెల్లడ జనగణమనములలో
వెలసేవులే ఒక నందనవనమై
ఈశ్వరమల క్రింద విలసిల్లచూ
కలకాలమూ నీవూ వర్ధిల్లమ్మ తిమ్మమ్మా ॥జో॥

# నివేదన

సాహిత్య శిరోమణి :
శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, M. A.,
సాహిత్య విభాగాధ్యక్షుడు,
ప్రాచ్యకళాశాల, తిరుపతి.

వర్ణైః కతిపయైరేవ గ్రథితస్య స్వరైరివ!
ఆనంతా వాఙ్మయస్యాహో గేయస్యేవ విచిత్రతా॥
(మాఘుడు)

స్వరాలు ఏడే. అయినా గేయ వైచిత్రి అనంతం. అలాగే అక్షరాల సంఖ్య పరిమితమే అయినా వాఙ్మయవైచిత్రి మాత్రం అనంతంగా విస్తరిల్లింది.

సంగీత సాహిత్యాలు సరస్వతీ స్తనద్వయంగా వర్ణించబడ్డాయి. కమ్మని కంఠంతో రాగభావ యుక్తంగా ఆలపించబడినప్పుడు ఛందోబద్ధమైన వాణి అనిర్వచనీయమైన ఆనందానుభూతిని కలిగిస్తుంది.

పేరెన్నికగన్న మన జానపద కళలలో బుర్రకథ ఒకటి. ప్రజారంజనానికే కాక మహత్తరమైన ప్రబోధానికి కూడా బుర్రకథవంటి సాహితీ ప్రక్రియలు ఎంతగానో ఉపకరిస్తాయి. భారత భాగవతాది కథలను కావ్యవస్తువులుగా స్వీకరించి మహాకవులు వాటికి అజరత్వాన్నీ, అమరత్వాన్నీ ఆపాదించారు. శ్రీ ఎద్దుల నందిరెడ్డిగారు రచించిన "శ్రీ తిమ్మమాంబ జీవిత చరిత్ర'' అన్న ఈ బుర్రకథలోని వస్తువు ఇంచుమించు ఐదారువందల సంవత్సరాలకు పూర్వం జరిగిన ఒక చారిత్రక సంఘటన. అది నాటినుండి జనశ్రుతిలో వుంటూ క్రమంగా ఆనోటా, ఈనోటా ప్రచారమవుతూ వచ్చింది. శ్రీ నందిరెడ్డిగారి తండ్రిగారు శ్రీ గంగిరెడ్డిగారు బుర్రకథగా వ్రాసి దానికొక సాహిత్యరూపం కల్పించి వ్యాప్తి కలిగించారు. పితృపాదులనుండి సారస్వత పరమైన వారసత్వాన్ని కూడా పుచ్చుకొన్న శ్రీ నందిరెడ్డిగారు ఈ రచనకు కావలసిన హంగులన్నీ సమకూర్చి దీనినొక సమగ్ర సుందర కృతిగా తీర్చిదిద్దారు.

జీవితంలో సుఖదుఃఖాలు పడుగుపేకల్లాగా సంయుక్తమై ఉంటాయి. అందులోనూ సంసారులకు దుఃఖాంశమే ఎక్కువ. అందుకే గీతలో భగవంతుడు ఈ శరీరాన్ని అశాశ్వతమైన దుఃఖాలయమన్నాడు. తిమ్మమ్మ తన జీవితంలో కొంతకాలం సుఖించింది, ఆమె జీవితంలోని

అంతిమ ఘట్టం తీరని దుఃఖాలకు నెలవయింది. వ్యాలమ్మిన వీధిలోనే ఆ శీలవతి కట్టెలమ్మవలసి వచ్చింది. ఒకనాడు ఎంతగానో ఆమెను గౌరవించిన ఈ లోకం నిష్కారణంగానే అంతకంటె తీవ్రంగా ఆమెను గర్హించింది. ఆమె కష్టాలు ఎంతవరకూ వచ్చాయంటే, భర్త మరణించిన పిమ్మట తాను జీవించి వుండడం అర్థరహితమని ఆమె తిరుగులేని నిర్ణయం గైకొనేటంతటి పరాకాష్ఠనందుకొన్నాయి. చితిలో కౌకపోయినా మరొక రీతిగానైనా ప్రాణాలు వదలిపెట్టవలసిన పరిస్థితి అది. అందుచే ఆమె నిర్ణయానికి నాటి సమాజంకూడా బాధ్యత వహించిందనే చెప్పాలి. ఈ సంఘటనకు సందర్భానుగుణమైన జాతీయలలో పదప్రయోగంతో రసమహితంగా తీర్చి దిద్దడంలో శ్రీ నందిరెడ్డిగారు కృతకృత్యులయ్యారు "జీవనాదులగు జాతీయాలతో జీవము పోశాను'' అని రచయిత తన పరిచయ గీతాలలో గానం జేశారు.

శ్రీ రెడ్డిగారు ఈ కథను వర్ణనా ప్రధానమైన విపుల వచన ప్రబంధంగాగూడా వెలయించారు, అది ఇటీవలే ప్రచురింపబడింది. తిమ్మమాంబయే, తిమ్మమ్మ మర్రిమానన్న భావన స్థానిక ప్రజలలో వుంది. మానవజాతి మనుగడకు వృక్షరక్షణ అత్యావశ్యకమని లోకం గుర్తిస్తున్న రోజులివి. అందుచేత వృక్షసంపద ప్రాముఖ్యాన్ని చాటిచెప్పే రచనగాకూడా ఈ కృతి నేడు ఒక విశిష్టతను సంతరించుకొన్నది.

శ్రీ మద్భాగవతంలో వృక్షసంపద ఇలా వర్ణింపబడింది

అపకారంబులు సేయ రెవ్వరికి; నే కాంతంబులం దుండు; నా
తప శీతానిలవర్షవారణములై త్వగ్గంధ నిర్యాస భ
స్మపలాశాగ్ర మరందమూల కుసుమచ్ఛాయా ఫలశ్రేణిచే
నుపకారంబులు సేయు సజ్జనులకు; నీ యుర్వీజములో గంటిరే!

( భాగ - 10 1-850 )

శ్రీ నందిరెడ్డిగారి ఈ కృషి వాఙ్మయరంగంలోనే కాక వృక్షరక్షణోద్యమం పర్యావరణ పరిరక్షణ శాస్త్రసంబంధమై కూడ సముచితస్థానం సంపాదించుకొనుగాక! ! !

చిత్తూరు
30—5—1990

సముద్రాల లక్ష్మణయ్య

# శ్రీ తిమ్మమాంబ - బుర్రకథ

[ ప్రథమ భాగము ]

శ్రీ గణ నాయక సిద్ధివినాయక – తొలుత దండమయ్యా ॥తందాన తాన॥
శారదాంబను శరణుజొత్తు – సాష్టాంగ వందనముల
విష్ణు పీశ్వర బ్రహ్మ దేవులను – మొక్కి వేడుదాము
ఏడుకొండలా వెంకటేశుడా – వరము లొసుగుమయ్యా
అలివేలుమంగామా ఆదరించుమా – అమ్మా జగదంబా
ముగ్గురమ్మలా మూలపుటమ్మా – ఆదిశక్తి శరణం
ఆదికవి వాల్మీకి వ్యాసులూ – ఆదరించరయ్యా
తిమ్మమాంబకూ వందనమ్ములూ – సభకు వందనాలు ॥తందాన తాన॥

## —: భారతదేశ ప్రశంస :—

శ్రీ యుతమైనది భారతదేశము – సిరులు పొంగెనంత ॥తందాన తాన॥
గంగాయమునలు పొంగి పారిన – జీవగడ్డ యిదిరా
రాముని కృష్ణుని జన్మభూమి యిది – రమ్యమైన దేశం
సీతకు సుమతికి పుట్టినిల్లురా – పావన క్షేత్రంబు
వరము నిందుల్రు, విద్యారణ్యులు – వెలసినారు యిచట
అక్కరాయలు బుక్కరాయలు – రాజ్యమేలు చుండ
విజయనగర సామ్రాజ్యమందున – విజయము మనదేర
తెలుగు వారికది స్వర్ణయుగమురా – తెలుసుకోర తమ్మి ॥తయ్యక తద్ధిమిథ॥

## —: కథా సూచిక :—

వ॥ ఒకటవవాడు — ఇంతకూ మనము చెప్పే కథేమిటో కొంచం చెప్తున్నా !
రెండవవాడు—అందరికి ప్రత్యక్షంగా వుండే కథరా తిమ్మమ్మ మర్రిమానుకథ ప్రపంచ ప్రసిద్ధమై గిన్నిస్ బుక్కులో కెక్కిన తిమ్మమ్మ మర్రిమాను కథరా !

## —: విశ్వ మహావృక్షము – తిమ్మమ్మ మర్రిమాను వర్ణన :—

అదిగో చూడుము అద్భుతమైనది – అంత మర్రిమాను ॥తందాన తాన॥
ఏడు ఏడు పదునాల్గు లోకముల – లేదు యింత మర్రి ॥తందాన తాన॥

విశ్వమందునా లేదు నెచ్చట — ఇంత మర్రిమాను ॥తందాన తాన॥
ఈశ్వరాపుల పరిసరాలలో — విస్తరించినాది
గూటిబయలునా పంటభూములా — పాదుకొన్నదండి
అల్లి బిల్లిగా నల్లుకొన్న — వన దేవత వృక్షంబు
కోటివూడలా కల్పవల్లిరా — తిమ్మమాంబ మర్రి
తిమ్మమాంబయు కథను జెప్పెద — భక్తి మీరగాను
వినరా భారత వీరకుమార — విజయము మనదేరా ॥తయ్యక తద్దిమిథ॥

— కథా ప్రారంభము :—

చిత్రావతి నది తీరమందునా — బుక్క పట్నమండి ॥తందాన తాన॥
కోటలేమి ప్రహరిగె లేమి — యా బుక్కపట్నమందు
రాజవీధులూ దేవాలయములు — భజనమందిరములూ
రమ్యమైనదా బుక్కపట్నము — రాయలేలెనండి
బుక్కపట్నము చెరువు యున్నది — సముద్రమది నుండీ
పట్నము చుట్టూ ఆకు తోటలు — అరటి తోటలేమి
చెరుకుతోట దానిమ్మ వనములు — చెరువు కింద గలవు
మామిడి నేరెడు చింత తోపులు — ఇప్ప వనములండి
పోక వనము టెంకాయ తోటలు — పెంపు మీరగాను
అల్లము పసుపు అరటి జాపులు — పూలతోటలెన్నో
సీలి తోటలు నిమ్మ వనములు — ఇంపు సొంపుగాను
బుక్క పట్నము పొలెములోన — సిరులు పొంగెనండి
పాడి పంటలు దండిగ పండగ — ధనము గల్గ ప్రజలూ
మేలు మేలు మేల్ మేలు తమ్ముడా — మేలు భళారోయ్ వినరతమ్ముడ
బుక్కపట్నమూ పెత్తనదారుడు — పెదరాజు వీరయ్యా
కులమున శెట్టి బలిజకాపులు — పెద్దరైతు అతడు
వీరయ మంచి వీరుడు బాబు — భయములేని బండూ
ధర్మానికి తన ప్రాణమైనను — ఇచ్చు వీరుడతడూ
తప్పు జేసిన వారి నెప్పుడూ — మన్నన జేయడుగా ॥తందాన తాన॥

తప్పు జేసిన — వారి యెడల నై
వ్రేటు ముందు — తన మాట వెనుక నై

సాము నేర్చిన – సర్దారుడు సై
కండల దిరిగిన – దండివాడు సై
తాను తప్పులూ – జేయబోడు సై
తప్పు జేయతా – నోర్చుకోడు సై
బాపు ఒక్కటే – నంటాడు సై
దావని వాడు – లేడన్నా సై

ఆ వీరయ్యకు చెల్లెలి కొడుకు – వెంకటప్పగారు ॥తందాన తాన॥
వెంకటప్పకు తల్లిదండ్రులు – వెనుక ముందు లేరు
తండ్రి పోయినా మేనమామయే – యుండు నండ దండ
మేనమామ వీరయ్య యాతని – ఇంట పెంచుకొనెను
వీరయ్యకు రంగమ్మ యన్నది – రమణి భార్య గలదు
వీరయ్యకు దావొక్క పుత్రుడే – మల్లుడు మల్లయ్యా
మల్లమ మంగమ కుమార్తెలండి – మంచి మగువలయ్య ॥తందాన తాన॥

వ॥ లోకములో తండ్రి సచ్చినా మేనమామ యుండాలన్న సామెత ప్రకారము పెద్దరాజు వీరయ్య మేనల్లుడు వెంకటప్పను పెంచి పెద్దచేసి, చదువు సాములు నేర్పించి, తన కుమారుడు మల్లయ్య మంచి చదువరి గాలేక పోయినందున, ఆ యూరి పంచాయతీ పెత్తనదారుని పని, అల్లుడు వెంకటప్పకు అప్పజెప్పి చావిడికచేరి పనులన్ని చూచు కొమ్మన్న వాడాయెను ఆ తరువాత——

ఏండ్లు ఇరువది పూర్తిగడువగా – వెంకటప్ప బాబు ॥తందాన తాన॥
గ్రామ పెద్దగ పనులను తానె – చూచు చున్నదెల్లు
పరహిత కారుడు వెంకటప్పయు – పరమ సాత్వికుండు
పేదల పాలిట పెన్నిధియనగా – పేరు గాంచెనండి
దాన ధర్మములు వ్రతముగ నెంచెడి – సత్య నిరతు డతడు
ధర్మపరుడని పేరుగాంచెను – ధాత్రిలోన నాడు
ఏడుకొండలా వెంకటేశుని –విడువక గొల్చెనుగా
వూరిలోన శ్రీరామ భజనలు – నిరతము జేయించె
ప్రజల మేలుకే ఎల్లకాలమూ – అంకితమైనాడు
సర్వ సమర్థుడు అల్లుని జూచి – మామ పొంగిపోవు
చిన్నకూతు మంగమ్మ నిచ్చితా – పెండ్లి జేసినాడు ॥తందాన తాన॥

వ॥ ఈ విధంగా పెద్దరాజు పీరయ్య కుమార్తెకు, అల్లునకు తగిన బహుమానములిచ్చి, వారి యింటిని బాగు జేయించి, వేరు కాపురము పెట్టించి తన కన్నులఎదుట వారు చల్లగా కాపురము చేయుచుండగా చూచి సంతోషించిన వాడాయెను. ఆ విధముగానే పెద్దరాజు పీరయ్య, అల్లుడు చన్నక వెంకటప్ప పినతండ్రి కుమార్తెలలో పెద్దదయిన నరసమ్మను తన కుమారుడు మల్లయ్యకున్ను, ఆమె చెల్లెలు లక్ష్మమ్మను తమ దాయాదులుగా, దగ్గర బంధువులుగా ఉండిన గూటిబయలు గంగరాజు రామయ్యకున్ను ఇచ్చి వివాహములు జరిపించి అల్లుని బాధ్యతలను అన్నింటిని తానే వహించి, అతనికే బాధలు లేకుండా చేసెను. ఇట్లుండగా కొంత కాలమునకు మంగమ్మ వెంకటప్ప గారికి పుత్రుడు కలుగగా, వీరి ఇలవేల్పయిన శ్రీమన్నారాయణుని అవతారము శ్రీ వెంకటేశునిమీద భక్తిభావముతో నారాయణుడని నామకరణము గావించి బీద సాదలకన్నదానము జేసిరి.

హాస్యం:—ఒకటవవాడు: నాకుకూడ ఒక కొడుకు గల్గితే నారాయణుడని పేరే పెడతార !
రెండవవాడు: ఒరే ఒరె ఓగొడ్డుపోతు నీకు బిడ్డకాదురా గడ్డ పుడుతుందిరా !

కాలచక్రము తిరుగుచు పోవును – కల్లగాదు నిజము ॥తందాన తాన॥
కొన్ని ఏండ్లకు కాలమాయెను – మామయ పీరయ్య
పీరయ పుత్రుడు మల్లయున్నడు – మంచివాడు సుమ్మీ
శాంత పరుడు పీరయ్య పుత్రుడు – చల్లని మల్లయ్యా
బావమరది యా వెంకటప్పకు – బాసటగా నిలిచె ॥తందాన తాన॥

## —: మంగమ్మ వెంకటప్పగారి ఆదర్శ దాంపత్యము :—

చన్నక వారికి వెంకటేశుడు – ఇలవేల్పయినాడు ॥తందాన తాన॥
తిరుమల దేవుని చెన్నక వారు – నిరతము కొల్చెదరూ
వెంకటప్పకు తగిన భార్యగా – మంగమాంబ యుండె
అతనికి తలలో నాలుకమాదిరి – మెలగు చుండెనామె
సాదుజనులకు సేవ జేయుచు – సత్కరించు చుండె
దంపతులెపుడూ వాడి యెద్దులు – కాపురాలలోన
సతిపతులిద్దరు సమస్వభావులు – సత్య ధర్మరతులు
మానవసేవయె మాధవ సేవగ – మనుగడ గడిపారు
సంఘసేవయె బుద్ధవలపని – భావించిరివారు ॥తందాన తాన॥

సంఘం శరణం గచ్ఛామి అని — పాడినారు వారు ॥తందాన తాన॥
ఒక్కడే పుత్రుడు నారాయణుడు — పరల సంతులేదు
ఏండ్లు గడుపగా బిడ్డలు లేరని — యోచన గలిగింది
కులము వెలయనిక కొడుకువున్నడు — కూతురు లేదయ్యా
పరల సంతుకై నదుల మునిగిరి — నిదులకు వెళ్ళారు
చలివిందరలు సంతర్పణలు — వీదల వెళ్ళిల్లా
ప్రీతితోడ జేయించియువారు — పెన్నిదిలైనారు
ఏడుకొండలా వెంకటేశుని — విడువక గొల్చారు ॥తందాన తాన॥

వ॥ అయ్యా, వారి ఇలవేల్పయిన తిరుమలేశుడే తిరుగులేని దైవమని ఆ దేవునికివారు

మొక్కని మొక్కు కట్టని ముడుపు — లేదు వారికన్నా ॥తందాన తాన॥
ఏడు ఏడునా ఏడు కొండలకు — యాత్రలు జేశారు
ఉత్సవమ్ములు జరిపించారు — ఉత్సాహముతోను
సంతుగోరి సద్భక్తితోన — ఆ శ్రీనివాసునకునూ
వ్రతములు జేసిరి నోములు నోమిరి — భక్తి మీరగాను
ఎన్నిచేసినా సంతుగలగదూ — ఏమిచోద్యమయ్యో ॥తందాన తాన॥

## —: బుక్కపట్న ప్రాంతమందు కరువు కాటకములు సంభవించుట :—

అంతలోన ఆ ప్రాంతమంతయు — కరువు వచ్చెనయ్యో ॥తందాన తాన॥
చెరువు లెండెను బావులింకెను — పైరుపంట లేదు
పశువులనమ్మిరి మేతలేక ఆ — రైతులందరయ్యో
పుస్తెలమ్మినా పస్తులెగతిగా — ప్రజలు బాధపడిరి
తాగునీటికే కట కట యయ్యో — ప్రాణికోటి కయ్యో
అన్నము లేక కొందరు ప్రజలూ — అడవి పాలు అయిరే
ఆకులములు మేసి కొందరు — అలమటించినారు
ఉత్తర జూచి ఎత్తర గంపని — వూర్లు వదలినారు
గంతా బొంతా నెత్తి కెత్తుకొని — కడుపు చేతబట్టి
చంటి పిల్లలా సంకనెత్తుకొని — వలస వెళ్ళినారు
చెట్టుకొకరుగా పుట్టకొకరుగా — చెదరినారు జనులూ
కూడులేదు తిన గూడులేదు మన — గోడు గోడు మనుచు ॥తందాన తాన॥

అన్నమొ రామచంద్రాయని – తామలపటించినారు ||తందాన తాన||
దొంగతనాలు, దోపిడీలు మరి – ఎక్కువయ్యేనకటా
ప్రజల బాధలు చూడగ లేకను – వెంకటప్పగారు
విరాట పర్వము చదివించారు – రామాలయమందు
శివునికి వారు అభిషేకములు – జేసినారు బాగ
నడివీధి గంగమ్మ నెత్తిన నూరు – కడవలు పోశారు
ఎన్ని చేసినా వర్షము రాదా – ప్రాంతమందు అయ్యో
హరి హరీ అయ్యయ్యో – తందాన తాన ఓ దేవనందనాన ! ||తందాన తాన||

## —: శ్రీవారి దర్శనము :—

సంతులేకను. వర్షము లేదని – వెంకటప్పగారు ||తందాన తాన||
వెంకటేశుని వ్రతదీక్షలతో – యాత్రచేయ దలచె
సతిపతులిద్దరు బయలు దేరిరి – బండిలోని యప్పుడూ,
తిరుపతిజేరి రాత్రిపూట ఆ – ఆలయమ్ము నందు,
గోవిందరాజుల గుడికడవారు – విశ్రమించినారు,
తెల్లవారగ తిరుమల వెళ్ళెద – మనుచు తలచినారు,
మంగమాంబ తా కలలో తిరుమల – నెక్కుచున్నదయ్యా,
సతిపతులిద్దరు ఏడుకొండలు – నెక్కుచున్నరండి,
తప్పిపోయినొక ముద్దుపాపను – వెంబడించినారు.
వెళ్ళి వెళ్ళి రతనాలపాప ఆ – తిరుమల చేరింది,
తిరుమల దేవుని ఆలయమందున – గర్భగుడిని జేరె
అలివేలుమంగమ తల్లి ఒడిని – ఆ పాప జేరినాది,
సతిపతులిద్దరు పాపను వెదకుచు – గర్భగుడిని జేరి,
ఆండపిండ బ్రహ్మాండనాయకు – శ్రీనివాసుజూచి,
ఆపదమొక్కులవాని ముందర – సాగిలపడినారు,
బిడ్డలార లే లెండు లెమ్మని – దేవుడపుడు పలికె,
కరువుకాటక బాధలతోన – జనులు బాధపడగ
సోదరమానవ సేవజేయని – భక్తి ఎందుకయ్యా ?
మానవసేవే మాధవసేవగ – మదిని దలపలేరా ?
అందరిలోన అంతటంతటా – నన్నుకానలేరా ? ||తందాన తాన||

సర్వ వ్యాపకమైన స్వామిని – మీరు చూడలేరా ? ॥తందాన తాన॥
ఇందుకలడని అందులేడని – సందేహము లేలా ?
ప్రహ్లాదహాయనిపన్న జ్ఞానము – మీకు నేడు లేదా ?
కరువుకాలము, కష్టకాలము – యాత్రలెందుకయ్యా ?
కష్టకాలము ధనము నష్టము – పెట్టవలదు మీరు ?
లెండు వెళ్ళుడు ! బుక్కపట్నము – బుద్ధిగల్గిమీరు,
ఉన్నదానితో ఊరి ప్రజలను – ఆదుకొనుడు వేగ
అన్నదానము చేయుడిమీరు – ఆదరంబుగాను,
అదియే నాకును పూజయగునని – తెలుసుకొనుడు వాలు,
కదళీ ఫలములు తీసుకొండని – స్వామివారికిచ్చె,
ఫలము పంచను భాగ్యముబ్బను – వెళ్ళిరండు మీరు,
జాగు చేయక ఊరుచేరుడీ – వ్రతము చేయగాను,
కలలో చెప్పిన శ్రీనివాసుడు – కరిగిపోవగాను,
మెలకువ వచ్చెను వేకువ ఝామున – సంగమాంబకపుడు,
బిడ్డలేదు ఆ దేవుడు లేడు – అంత పట్టి కలయే,
కొక్కరోకో యని కోడిగూసెను – సుప్రభాతమయ్యే
కలలోగన్న కథను భర్తకు – చెప్పెసంగమాంబ
శ్రీనివాసుని ఆజ్ఞను శిరసా – వుంచివారు అపుడే,
తిరిగి వచ్చిరి బుక్కపట్నమూ – బుద్ధజనులు మెచ్చ ॥తందాన తాన॥

హాస్యం : రామన్న: ఒరే నేనుగూడా తిరుపతికి పోవాలరా, పదిరూపాయలుంటే ఇయ్యరా,
రంగన్న: ఒరే నువ్వు తిరుపతికి గాదురా – పదిరూపాయలతో కల్లంగడికి పోతావు.

## —: అన్నదాన వ్రతములు :—

తిరుపతినుండి తిరిగివచ్చిన – వెంకటప్పయపుడు ॥తందాన తాన॥
అన్నదానమును వ్రతముగ జరుపగ – అన్ని సూర్చుకొనియే
సప్తగిరుల ఆ స్వామి సాక్షిగా – సంతసమ్ముతోను
సప్త దినములా సంతర్పణల్గా – వ్రతము చేసినారు
ఏడవ దినమున సంగమాంబకు – యోచన గలిగింది
పండ్లు ఫలాలు పసుపు కుంకుమ – తీసుకొన్నదేమి ॥తందాన తాన॥

ముత్తైదువలు వెంటనడువగా - గంగపూజ సేయ ॥తందాన తాన॥
చెరువు కట్టకు బయలు దేరెను - చెలువుమీరగాను ॥తందాన తాన॥

వ॥ ఇట్లు మంగమాంబ ఏడవ దినమున బుక్కపట్నము చెరువు కట్టమీదికిపోయివిఘ్నేశ్వరుని పూజించి వరుణదేవుని వరములు కోరి, గంగాదేవిని ప్రార్థించి, కరువుకాటకాల బాధలను తొలగించి, వర్షము గురిపించమని వేడుకొన్నదాయెను. గంగాదేవిని పూజించిన మంగమాంబ సంతర్పణ స్థలానికి వచ్చి, అన్నపూర్ణేశ్వరిని అర్చించినది. అన్నపు రాశికి కాయకొట్టి కర్పూరమిచ్చి అన్నదాన వ్రతము ఆరంభించినదాయెను.

అలసట జెందక ఆలూమగలూ - అన్నము వడ్డించ ॥తందాన తాన॥
తనివితీర భోంచేసిరి ప్రజలు - కడుపు చల్లగాను
సంతసమందిన జనుల జూచెను - మంగమాంబయపుడు ॥తందాన తాన॥

వ॥ ఇట్లు మంగమాంబ తనలో తాను అన్నదాన వ్రతమునుగూర్చి లోలోపల తర్కించుకొనుచూ రేపటినుండి జనులందరికి గ్రాసము గతియేమి? అన్నములేక అలమరింతురే ఏమి చేయవలెను ? అని తలపోసినదై ఏమయినాకాని, ఎంత కష్టమయినాకాని, ఇంకా వారము రోజులు సంతర్పణలు కొనసాగించాలనుకొని నిశ్చయించుకొన్నదై. అందుకు భర్త అనుమతి గోరుటకు అతనివద్దకు వచ్చి అనునయంగా... ....... ....

నాది ఒక్కటి మనవి వున్నది - నయముగాను నాథా ॥తందాన తాన॥
అనుగ్రహింపుము ఆగ్రహింపకు - నూరిపెద్దనీవు ॥తందాన తాన॥

వ॥ ఆ సమయములో వెంకటప్పగారుకూడ రేపటినుండి ప్రజల బాధలు ఎట్లనో గదా? యని తలపోయుచు, ఎల్లకాలము తాను వారిని ఆదుకొనుటకు వీలుగాదుకదాయని తలంచి అప్పు చేసి అయినాసరే యింకా వారము దినములు అన్నదానము జేస్తే, ఎంత బాగుండును - అందుకు తన ఇల్లాలు ఏమనునో యనుకొను చుండెను, ఆహా! సమస్వభావులయిన సతీపతులంటే వీరే గదా! అపుడు భార్య విన్నపము విన్నతోడనే వెంకటప్ప ఏమన్నాడయ్యా అంటే... ... ........

హాస్యం: రామన్న: ఒరే నేను ఏదారంటే నా భార్య గోదారంటుందిరా
రంగన్న: నేను చేప్పేది నీ కథ గాదురా, మంగమ్మ కథ:

కోరిన కోరిక వెదపక జెప్పుము — కోమలాంగి నాతో ॥తందాన తాన॥
అని తన మగడు అనతియ్యగా — అడుగుచున్నదామె
కూలిజేసిన కుండగాలును — బీదప్రజలకియ్యి
బీదల బదుకులు బండవారెను — భీకరమీ కరువు
మరియొక వారము వ్రతము — జేయను మనసుగల్గెనాకు
మీ సమ్మతితో సంతర్పణలు — సాగించగలేమా?

వ॥ అని ఇట్లు అర్ధాంగి అడుగగా వెంకటప్ప ఆమందానందముతో ఏమనుచున్నాడయ్యా అంటే.. .... ......

నీవడిగినందుకా నందముగల్గె — అర్ధాంగి నాకు ॥తందాన తాన॥
నీ కోరిక ఎంతో మంచిదాయెగా — కోమలాంగి నేమ
అదియే ఇప్పుడు నాలో నేను — అనుకొను చున్నాను
సరిగదానినే నడుగు చుంటివి — సంతోషించితిని
శక్తికి మించిన కార్యము చేసిన — కష్టము రావచ్చు
ఇంటనుండిన మిగులు ధాన్యమీ — వారము సరిపోయె
ఇంటిలోన మన ఖర్చుకు మాత్రమె — ధాన్యమున్నదనిన
వెంకటప్ప తన సతితో లగతి — ఆడిన మాటలకు
నా మనవిని కొంచమాలకించుము — నాథా దయతోన
మీకు తెలియనిదేమి యున్నది — ధర్మ సూక్ష్మమంత
జనుల బాధలు చూడలేకనే — నిటులు చెప్పుచుంటి
బుద్ధదేవుని బోధలు మనము — వినియు వుండలేదా
సంఘము మనకు శరణ మనియెగా — ధర్మదేవుడతడూ
ధర్మము మనకు శరణమనియెగా — ధాత్రిలోన ఎప్పుడూ
సంపదలన్నియు సంఘము పాలని — చాటిచెప్పుదాము
సమ సమాజము సృష్టింతము — మన గ్రామ సీమలందు
అపుడే అదుగో వర్షాకాలము — ఆసన్నంబయ్యె
పైరు పంటలు తప్పక మనకు — పండకెట్లు పోవూ
బుగ్గబావులు మనకు ఉండగా — పంటలేమి కొదువ
కార్మికులందరు మనతో వుండగ — కష్టమేమి కలుగు?
సర్వులు మనవారయ్యుండంగ — సంపదలెందులకూ? ॥తందాన తాన॥

కరువు పనులు ప్రారంభమగునుగా — వారము దినములలో ॥తందాన తాన॥
పెనుకొండనుండి తాకీదు వచ్చెగా — రాజు లాజ్ఞలాయె
కరువు పనులలో కూలి జనాదులు — కడుపు నిండునండీ
మనము ఎట్టులో అప్పులు సప్పులు — జేసి బ్రదుకుదాము
తక్కువేమి మనకెప్పుడుండదు — రాముడుండువరకు ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు భార్య మంగమ్మ చెప్పినధర్మ సూక్ష్మలకు, సామాజిక న్యాయబుద్ధికి, దయాగుణానికి వెంకటప్ప ఆమందానందము చెందినవాడై ఈ విధముగా అనుకొను చున్నాడు.

సతి మాటలకు సంతసించిలా — మెచ్చుకొన్నదేమి ॥తందాన తాన॥
ఇట్టి గుణవతి ఇల్లాలయ్యేను — ఇలనే ధన్యుడను
ఆనందముతో అనురాగముతో — నర్ధాంగి తొననియె
నీవు కోరిన కోరిక మేరకు — వ్రతము జరుపుదాము
వలసిన వస్తుధాన్యము వెంటనె — సిద్దము చేయించు ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు భార్య కానతి ఇచ్చిన వాడై, వెంకటప్ప ప్రజల వంక చూచి మరల రేపటి నుండి మరొక వారము అన్నదాన వ్రతము జరుపబడునని చాటింపు చేయించిన వాడయెను.

హాస్యం: యల్లన్న: అయితే సంతర్పణకు మనమూ బోదామురా — మావాల్లనందరిని పిల్చుకొస్తా.

మల్లన్న: సంతర్పణలు ఇప్పుడుకాదురా — జరిగి పోయనాయి — ఇప్పుడెవరు న్నారురా అట్లా ధర్మాత్ములు.

చాటింపును విని ప్రజలెల్లరును - సంతసించినారు ॥తందాన తాన॥
చిక్కు దిక్కులకు సంతర్పణలు — తెలిసిపోయెనండి
కుప్ప తెప్పలు బీదజనాదులు — బుక్కపట్నమందు
వనములు నిండిరి వలసలు వచ్చిరి — దినము దినము కండి
అందున ఖర్చము అదనమాయెను — అన్నదానమునకు
దిన దినమునకు ఎక్కువ ఖర్చము — వేయవలసి వచ్చె
ముందు వుండిన వస్తు పదార్థము — అయిదు దినములయ్యె ॥తందాన తాన॥

అందుకు యోచన చేసిరి వారలు — ఏమి జేతుమనుచు ॥తందాన తాన॥
దాచిపెట్టిన కూడిక ధనమును — తీసుకొన్నరపుడు
అంగడింటికి వెళ్ళినారుగా — ఓత్యము గొన్నారు
ఆరవ దినమును జరిపిరి ఇకపై — ఏడవ దినముంది
ఏడవ దినము వ్రతము గడపను — యోచన జేశారు
వెండి బంగరు సొత్తులు వారు — కుదవ బెట్టినారు
ఏడవ దినమున విందు జరిపిరి — వెలితిలేక వారు
సమ సమాజము స్థాపనకొరకై — సర్వము నర్పించి
త్యాగధనులుగా పేరు పొందిరి — ధన్యాత్ములు వారు
బీదయూ బలియూ పుట్టిన దేశం — పుణ్యభూమి ఇదిరా ॥తందాన తాన॥

## —: సంతర్పణలు ముగింపు – సంతాన ప్రాప్తి :—

వ॥ సంతర్పణలు సమాప్తముకాగా, పురోహితులకు వస్త్రదానములిచ్చి పూజించి, గోపూజ గావించి సతీపతులు భోజనాదులు గావించి వారి పెద్దలతో ఇష్టాగోష్టిగా మాట్లాడుచు తాంబూళములిచ్చుచుండగా నెక్కడి నుండియో వృద్ధ వానరమొకటి అరటి పండును చేతబట్టుకొని

హాస్యం: యల్లన్న: అరరె కోతి ఎక్కడరా. నాజోలిలో అన్నముందిరా.
మల్లన్న: ఇక్కడ రాలేదురా, కథలో మాట.

అరటి పండును చేత బట్టుకొని — ముసలి కోతి యొకటి ॥తందాన తాన॥
పరుగిడి వచ్చి మంగమ్మొడిలో — పండుబెట్టినాది
ప్రక్కన ఉండిన మామిడి వృక్షము — పైకి ఎక్కిపోగా
పోయిన కోతి మరల ఎక్కడా — కానగరాదాయె
సభికులందరూ నాశ్చర్యముతో — సంభ్రమమందారు
పండ్లను కోతులు లాగి తింటివి — ఎక్కడయిన గాని
కోతి పండును ఇచ్చివెళ్ళుట — చిత్రమాయెనేడు!
ఏడుకొండలవాడు పంపినా — ఆంజనేయుడితడే
మీరిటి చేసిన వ్రతములు స్వామి — మెచ్చినాడు బాగా
అరటి పండును తెచ్చి యిచ్చె మీకాడ సంతతనుచు
పండును తినుమా అమ్మా నీకు — ఫలములందగలదు ॥తందాన తాన॥

పెద్దలు జెప్పిన మాటలు నమ్మిరి – సతి పతులిద్దరును ॥తందాన తాన॥
పండును దీసుక ఇంటికి వెళ్ళిరి – పరమ సంతసమున
తిరుమల దేవుని పూజలు జేసిరి – చిత్త శుద్ధితోను
ధూప దీప నైవేద్య మంగళా – హారతులిచ్చారు
ఇల వేల్పగు తమ తిరుమల దేవుని – ప్రార్థన జేశారు
అరటి పండును ఆరగించెగా – మంగమాంబయపుడు
అంతటితో పన మంగమాంబయు – చూలాలయ్యింది
ఆ దినమ్మున నర్ధరాత్రికి – మేఘము గమ్మింది
దూర్పు దిక్కున ఉరుములు మెరుపులు – ఉద్భవించినాయి
నాలుగు దిక్కుల వర్షముపట్టి – కుండపోతగాను
ఎడము లేక జడివానలు గురిసెను – రేయిబగులు విడక
ఆరు దినములకు చెఱువులు నిండెను – మఱవలు పారినవి
గుంపు గుంపులై ప్రజలు చేరిరి – చెరువు కట్టమీద
వర్షము రాకకు మంగమాంబ – మహాత్మ్యము కలదనిరి
పుణ్య దంపతుల పూజాఫలమని – పుర జనులందరును
వేయినోళ్ళతో పొగిడిరందరు – పుణ్య దంపతులను
పాలెగారును పెద్దరైతులూ – వెంకటప్పగారు
చెఱువు కట్టకు చేరి రండను – తెప్పగట్టినారు
గణపతి వడయరు వరుణ దేవుని – గంగను పూజించి
చెఱువు మీదను తెప్పవిడిచిరి – చెలువు మీరగాను
తెప్పోత్సవమును సంతసమ్మున – సకల జనులు జరుప
కోలాహలముగ కోలాటలను – భజనలు జేశారు
పురజనులందరు వెంకటప్పను – సన్మానించారు
పాళెగాళ్లును పెద్దరైతులూ – పుణ్య దంపతులను
విందుకు బిలిచిరి కానుకలిచ్చిరి – ప్రేమ మీరగాను ॥తందాన తాన॥

వ॥ ఈ విధంగా వెంకటప్ప దంపతుల సంఘసేవను గుర్తించిన పాలకులున్ను, ప్రజలున్ను వారిని తగినవిధంగా సత్కరించిరి. పెద్దరాజు మల్లయ్య తన చెల్లిని బావను పిల్చుకొని వెళ్ళి చెల్లికి సీమంతము జరిపి వారికి కావలసిన రొక్కరోజనాలను ఆహార ధాన్యాలను వెంకటప్ప ఇంటికి జేర్పించిన వాడయ్యేను. చెల్లెలు సీమంత సమయమున తన కుమార్తె పుట్టిన్మను తన మేనల్లుడు నారాయణునకు చేసుకొనవలసినదిగా బావను బతిమలాడుకొనెను, చిన్న పిల్లలకు అపుడే ఏమిపెళ్ళి తొందర అని అందరూ నవ్వుకొన్నవారైరి

హాస్యం: రాముడు: ఒరే రంగన్న నేనుగూడ యీ యాత్రకు బోల్డి అమ్మ రేపు అన్నదాన
వ్రతము జేస్తారు. నీవూ భోజనానికి రార - మర్నాడు మనవారు నాకు
సత్కారం జేస్తారు.

రంగన్న: ఆ, ఆ చేస్తారు నీకు సత్కారము దుడ్డుకర్రతో బుర్రపోగొట్టుకొని నీవు
మాత్రము ఏదాది వ్రతము చేస్తావు.

—: తిరుమలమ్మ జననం - శైశవము :—

మంగమాంబకు నవ మాసములు - పూర్తిగడవగాను ॥తందాన తాన॥
రెండు పంటలు వెలువు కిందహా - పండినాయివాగ
పొలములన్నియు పచ్చదనముతో - పరిఢవిల్లెన్నుడు
శుద్ధపూర్ణిమా శుక్రవారము - సూర్యోదయమందు
పుత్తడి బొమ్మ పుత్రిక గలిగెను - సంగమాంబకపుడు
కలలు పండిన పాలప్మది యని - మదము చెందె మాత
తిరుమల దేవుని వరిప్రసాదమని - తలచిరి ప్రజలెల్ల
మూడవ నాడున పదియవ నాడున - స్నానములయ్యనవి
ముత్తైదువులు ముద్దుబిడ్డ - నుయ్యాలలూపిరారు
జోలలు పాడిరి ఆటలు నాడిరి - ఉత్సవంబులయ్యె
పురహితులయిన బ్రాహ్మణులపుడు - మంత్ర శాస్త్రములతో
తిరుమల దేవుని వరమున బుట్టుట - తిరుమలమ్మ యనియు
నామ కరణము జేసిరి పెద్దలు - నయముగాను నాడు
శుక్ల పక్షమున చంద్రుని రీతిగ - తిరుమలమ్మ పెరిగె
ఒక ఏదాది గడచిన వెంటనె - తిరుమల వెళ్ళారు
తలనీలాలు తీసి యిచ్చిరి - శ్రీనివాసునకుహా
బిడ్డఎత్తు వెల్లాలు పంచిరి - చిన్న పిల్లలకును
నూట ఒక్క టెంకాయ కొట్టిరి - ఆలయమ్ము నందు
తిరుమల యాత్రను జేసి వచ్చిరి - బుక్కపట్నమునకు
ముద్దు బిడ్డను తల్లిదండ్రులు - ముద్దుగాను పెంచ
ఇరుగు పొరుగు యా వూరి వారను - తిరుమలమ్మనెపుడు
కింద దించినా మట్టితాకునని - మక్కువతో వారు
ఆల్లారు ముద్దుగా ఎత్తి ముద్దిడి - ప్రేమకలర జూడ ॥తందాన తాన॥

## —: తిరుమలమ్మ బాల్యము :—

ఆట పాటలా తిరుమలమ్మకు – ఐదు ఏండ్లు గడిచే ॥తందాన తాన॥
వీధిబడికిని చదువుకు బంపిరి – ఆరు ఏండ్లనాడు
చదువులలోన శారదాంబగా – సన్నుతి గాంచింది
ఆటలలోన అపర గిరిజగా – అందెవేసినాది
తోడివారిలో యీడువారిలో – మేటి అయ్యె బాల
కన్యక యామె పరమేశ్వరియని – ఆర్యులనిరినాడు
తిరుమలమ్మను తిర్మలమ్మని – ముద్దుముద్దుగాను
తిన్న తిన్నగా తిమ్మమ్మనిరి – తియ్య తియ్యగాను
తల్లిదండ్రులు ఊరివారలు – తిమ్మమ్మన్నారు
ముద్దుపేరుగా నిలిచిపోయెను – తిమ్మమ్మను పేరు ॥తందాన తాన॥

వ॥ లోకములో ఈ విధంగా ముద్దుగా బెట్టుకొన్న బిడ్డలపేర్లే మామూలుగా వాడుకలో నిలిచిపోవును గదా! అట్లె తిరుమలమ్మపేరు తిమ్మమ్మగానే నిలిచి పోయినది. తిమ్మమ్మగానే ఆమె లోకానికి తెలిసింది. రాజేశ్వరమ్మను రాజమ్మగాను ఆంజనేయప్పను అంజనప్పగాను పిలుచుట ఇలాంటి సంఘటనలు మనం వింటున్నాముకదా! ఏ పేరైనా తిరుమలమ్మ నడవడిక ఎట్లా వుందయ్యాంటే.

అల్లరి తోడులు గూడదాయె – తన మార్గము వేరయ్యె ॥తందాన తాన॥
భూత దయనూ పరోపకారము – గల్గియుండెనామె
బీదలకెన్నో సంతర్పణలు – చేయు చిన్న నాడే
ఉత్తమ బాలల తోడుగ చేయును – బొమ్మల పెళ్ళిళ్ళు
అల్లరి మాటలు చిల్లర మాటలు – ఆమెకు రావండి
ఆమె నడవడి తోడి బాలల – కొరవడి యైనాది
కలలో నయినా కల్లలాడదు – సత్యవతియె బాల
తిరుమలమ్మ ఆగర్భ జ్ఞానిగ – అవతరించె నిలను
నారాయణునకు చెల్లెలంటెను – ప్రాణ సమమునయ్యె
ఇదియు నప్పుడు బాల్యమునుండి – పుట్టమ్మయితేను
బాల ధోరణి నచ్చలేదుగా – బాలిక పుట్టమ్మకు
తిరుమలమ్మను ఎవరు పొగిడినా – గిట్టదు పుట్టమ్మకు
అందరు కలిసొక వీధిబడినందే – చదివినారు కానీ ॥తందాన తాన॥

తిరుమలమ్మ తన చిన్ననాటనే — పెద్దచదువు చదివే ॥తందాన తాన॥
రామాయణమును భారతమ్మును — శ్రద్ధతోడ చదివే
అమరకాండము భాగవతమ్మును — భక్తితోడ చదివే
చదివిన చదువులు సద్వర్తనమై — బాలయందు తోచె
గురువులు చెప్పిన నీతులన్నితా — గుర్తు పెట్టుకొనియే
చదువులలోని మర్మమెల్ల తా — చదువుకొన్నదయ్యా
పన్నెండేండ్ల వయసు నందున — బడిని విడచినాది ॥తందాన తాన॥

## —: తిమ్మమ్మ చదువుమాని గృహ కృత్యాలు నేర్చుకొనుట :—

చదువు మానిన తిమ్మమ్మపుడు — తల్లికి సాయంబై ॥తందాన తాన॥
చక్కగాను తా సంసారములో — పనులు నేర్చుకొనియే
వంటవార్పులు చేయుటలో కడు — దిట్ట అయ్యె నండీ
వేకువ ఝామున లేచిన తిమ్మమ — దేవుని ప్రార్థించు
తిరుమల దేవుని అలివేలమ్మను — స్మరణ జేయుచుండు
తల్లిదండ్రుల పాదాలాలకు తా — వందనములు జేయు
కాలకృత్యములు తీర్చుకొన్నతా — స్నానము చేయునుగా
దీపారాధన దైవ ధ్యానము — చేయును తిమ్మమ్మా
తులసిపూజలు గోపూజలును — సూర్యవందనాలు
పొద్దుపొడవకమున్నే పూజలు — పూర్తి చేయునమ్మా
గోవుల గాయును గోపాలికయై — గోవిందుని తలచు
పశువుల మేత నీటియందునా — శ్రద్ధచూపు నామె
పాలు పితుకు, పజ్జిగలు జిల్కుదా — గొల్లభామ వలెను
సేద్యపు పనులు చేయుంచుటలో — శ్రద్ధ చూపు చుండు
జీతగాళ్ళకు పాతగాళ్ళకు — అన్నపూర్ణయామె
ఆశ్రయించిన కూలీలకును — కల్పవల్లియామె
అతిథులనున్న ఆభ్యాగతులను — ఆదరించునామె
పొలములు దిరిగి పంటభూములు — చూచి యింటికేగి
తల్లిదండ్రులకు భోజనంబులు — తానే వడ్డించు
అన్నిపనులలో అన్నకుతాను — చేదోడుగ నుండు
పగటివేళ విశ్రాంతివేళను — కుట్టుపనుల జేయు
జననీ జనకుల వీనుల విందుగ — కీర్తనములు పాడు ॥తందాన తాన॥

తల్లిచెప్పిన నీతి బోధలు – తప్పక పాటించు ॥తందాన తాన॥
భారత భాగవతాదులు బాగుగ – జదివి చెప్పుచుండు
విధిగా ప్రతిదినమవియేపనులు – విశ్రమించు వరకు
ఆమె నడవడి జనులకొరవడి – నిక్కంబిది సుమ్మి
ఆమెను చూచి గ్రామ ప్రజలును – మంచిదారి నడున
గ్రామమంత యీ దర్శవంతమై – శాంతి సుఖములబ్బె
తిమ్మమ్మ యెప్పుడు పుట్టెనప్పుడే – వీడవె శుభములన్ని
కరువుకాటకాల్ దుర్భిక్షములు – దూరమాయె నచట
పాడిపంటలు ఫలవృక్షంబులు – ఫలియించెను మిగుల
ఆ ప్రాంతమంత సుభిక్షమాయెను – తిరుమలమ్మ చలువ
తిరుమల దేవుని వరమునబుట్టిన – తిరుమలమ్మ యామె
ఊరి జనులకొక భ్రమయు గలిగెను – అట్టికాలమందు
తిమ్మమ్మను తమ వూరియందున – నిలుపుకొన్నచాలు
ఇల్లటమున్న అల్లుడొకనికి – ఇచ్చుకొనుట మేలు
భాగ్యదేవతనావిధంబుగ – బుక్కపట్నమందె
శాశ్వతంబుగానిల్పినట్టులగు – నంచు తలచిరపుడు
ఊరి వారికి వెంకటప్పకు – ఉత్తమంబునదెయే ॥తధికిట తధికిటథ॥

వ॥ ఇట్లు గ్రామస్తులు అనుకొన్నవారై వెంకటప్పగారితో తమ కోరికను వెల్లడించిరి. తల్లిదండ్రులే గాక ఊరివారు గూడ ఆమెను ప్రేమగా చూచుకొన్నందున తమ గ్రామములోనే తిమ్మమ్మ కలకాలముండి పోవుటకు ఇల్లరికమే మంచిదని విన్నవించిరి. మంగమ్మ వెంకటప్పగారును అందుకు సంతసించి మా కోరిక కూడ అదే, తిమ్మమ్మకు దూరముగా మేముండలేము, గదా! అయినా తిమ్మమ్మ వరప్రసాదిని. ఆమె అభీష్టము ఎట్లున్నదో ? ఆ తిరుమలేశుని సంకల్పమెటున్నదో గదాయని విన్నవించుకొన్నవారైరి

## — తిమ్మమ్మకు యుక్తవయసు వచ్చుట – వరాన్వేషణము జరుగుట :—

వసంత కాలము వచ్చిందప్పుడు – పూవులు పుష్పించే ॥తందాన తాన॥
విరిసిన పూవుల వాసనంతట – గుభాళించెనయ్యా
తేనెటీగలు తేనెల వెదకుచు – పువ్వులందు వ్రాలె
యుక్తవయసుకు వచ్చిన తిమ్మమ – చంద్రవదనమయ్యె
బంధుమిత్రులు తరలివచ్చిరి – మంగళవాద్యాల ॥తందాన తాన॥

చీరలు రవికలు సెవ్వ్యాకులును — కానుకలిచ్చిరిగా ॥తందాన తాన॥
కొబ్బరి కాయలు ఖర్జూరంబులు ఆమె వడినినింపి
బట్టలు పూవులు పసుపుకుంకుమలు — పండ్లు ఫలములిచ్చి
పాటలు పాడి హారతులిచ్చి — దీవించిరి జనులు ॥తందాన తాన॥

వ॥ అంత కొంత కాలమునకు, వెంకటప్ప మంగమ్మ తమ ఇలవేల్పయిన తిరుమల దేవునికి పూజలు చేయుటకు ఇంటిల్లపాది ఇలు తీర్థము వెళ్ళి స్వామిని సేవించుకొని తిమ్మమ్మకు తగిన వరుని ప్రసాదించమని తిరుమలేశునికి మొక్కుకొని తిరిగి స్వగ్రామమునకు వచ్చినవారైరి.

హాస్యం: రామయ్య: ఒరే నాబిడ్డ గూడ పెద్దదయిందిరా — మంచి సంబంధము చూపమని ఇప్పుడే తిరుమలకువెల్లి స్వామికి మొక్కి వస్తార. ఈ గుమ్మితి దీసుకోర.

రంగయ్య: అరే బద్మాష్ యీ కథగానీరా ఒప్పుకొనిచెప్పకుండా పోతే నీ కూతురు కేమొగాని నీకు మళ్ళి పెళ్ళిజేసి పంపిస్తారు — కానీ.

శ్రీయును కులమును రూపును గల్గిన — కన్యయగుటకతన ॥తందాన తాన॥
గుణవతి యామె వరపుత్రికయని — తెలిసినందువలన
పేరు మోసిన వీరులెందరా — ప్రాంతమున్నవారు
శ్రీమంతులునూ. అధికారులును — కన్యనడిగినారు
ఎవరు వచ్చినా ఒప్పలేదుగా — పెళ్ళికి తిమ్మమ్మ
తిరుమలేశుడే వరుని చూపునో — అన్నది ఆయమ్మ
మాతా పితలకు దిక్కుదోచక — ఊరకుండిరంత ॥తందాన తాన॥

—: గూటి బయలు గంగరాజుల సంస్థానము — వారి బాంధవ్యము :—

విజయ నగర సామ్రాజ్యములోన — రాజధాని యొకటి ॥తందాన తాన॥
కోటల పేట పెనుగొండున్నది — దక్షిణాది యందు
తెలుగు వీరులా పదును కత్తులా — సాన బెట్టిరచట
శత్రువులకు పెనుకొండయప్పుడు — సింహస్వప్నమయ్యె
డెబ్బది యారు పాళెములకును — ముఖ్య పట్నమయ్యే
బుక్కపట్నము కొక్కంటియును — పాళెములై యుండె
పెగ్గొండ మీదను కొండ క్రిందనూ — కోటలున్న పేమి ॥తందాన తాన॥

కోటకులోగా గగన మహలను – రాజగృహము గలదు ॥తందాన తాన॥
వివిధములయిన దేవళమ్ములు – వేలకొలది గలవు
అంజనేయుడా కోటనెప్పుడు – కాచుచుండు నంట
కోటకు లోపల ద్రాక్షవనము – దానిమ్మవనములుండి
చల్లనిరాజ్యము పెనుకొండాయని – పేరు కెక్కెనండి
కదిరి తూర్పు కొక్కంటి పాళ్యము – కొండలందు గలదు
పాళెము జాగీరు గ్రామమున్నది – గూటిబయలు కోట
కోటలో జాగీర్‌దారులున్నారు – శెట్టి బలిజ వారు
ఇంటిపేరు శ్రీ గంగరాజులు – ముగ్గురు సోదరులు
ముగ్గురు ఒకటే తల్లి బిడ్డలు – ఒద్దిక గలవారు
పెద్దవాడు రంగయ్య అతడే – రంగరాజుగారు
చిన్నవాని రామయ్య అందురు – యువరాజతడనగా
మూడవవాడు కృష్ణయ్య మరి – సాముకు సర్దారు
రామయ్యకు లక్ష్మమ్మ యనియును – సతీరత్నమండి ॥తందాన తాన॥

వ॥ ఈ లక్ష్మమ్మ ఎవరోకాదు తిమ్మమ్మ తండ్రి చన్నక వెంకటప్పగారి పినతండ్రి కుమార్తె. ఈమె పుట్టినిల్లు బుక్కపట్టణమే, స్వయాన తిమ్మమ్మకు మేనత్తగావలెను. బుక్కపట్నములోని పెద్దరాజు వారు గూటిబయలు లోని గంగరాజు వారు దాయాదులు దగ్గరి బంధువులుగా నుండిరి. పెద్దరాజు పీరయ్య బ్రతికి వున్నపుడే లక్ష్మమ్మను గంగరాజు రామయ్యకు ఇచ్చి వివాహము జరిపించెను. అట్లనే లక్ష్మమ్మ అక్క నరసమ్మను తన కుమారుడు మల్లయ్యకు వివాహము చేసి, తరతరాలుగా వస్తున్న బాంధవ్యము తెగిపోకుండా అతికించెను. కానీ చన్నక వెంకటప్ప పిన తండ్రికి కుమారులు లేనందున రాకపోకలు సన్నగిల్లినవి. అయినా వెంకటప్ప మాత్రం తిరుమల వెళ్ళునపుడల్లా వచ్చి తన సోదరి లక్ష్మమ్మను చూచి వెళ్ళేవాడు.

హాస్యం: యల్లన్న: నాకు నా పాత బంధువులే గుర్తుండరురా!
మల్లన్న: నీకు నీ బోజనం తప్పా ఇంకేది గుర్తుండదురా.!

**బాలవీరుని జననము – జననీ జనకుల కోల్పోవుట**
**బాల్యములోనే పులిని జంపి బాలవీరుడగుట.**

రామయ్య లక్ష్మమ్మ కైననూ – ఒక్కడె పుత్రుండు ॥తందాన తాన॥
గంగరాజుల ఇంటిదేవతలు – వీరుల వరముననూ

పుట్టినందునా బాలవీరుడని – పెట్టిరతని పేరు ॥తందాన తాన॥
బాలవీరుడు బాలచంద్రుడే – చక్కని వాడతడు
బాలవీరుని చిన్ననాటనే – తల్లిదండ్రులేమొ
అచ్చట ముచ్చట చూడకయే – వారు చెల్లిపోయినారు
బందిపోటుల దొంగలతోన – పోరియు రామయ్య
వీర మరణమే పొందినాడయా – అడవిలోన నాడు
పతి మరణమ్మును విన్నయంతనే – సతియూ లక్ష్మమ్మ
పంచ ప్రాణములు వదిలి నాదిరా – పతివ్రత లక్ష్మమ్మ
హరి హరీ అయ్యోయ్యో – తందాన ఓదేవనందనాన ॥తందాన తాన॥

వ॥ బంధిపోటు దొంగల ప్రమాదములో గంగరాజు రామయ్య గతించగా గంగరాజుల సంస్థానము చిన్నబోయినది. పతి మరణమును చూచిన లక్ష్మమ్మ స్పృహ తప్పి పడి భర్తతోపాటు మరణించినది. తిమ్మమ్మ మేనత్త లక్ష్మమ్మ గూడ ఒక మహా పతివ్రతగా జీవించి మరణించినది. ఈ విధముగా బాలవీరయ్య చిన్ననాడే తల్లి దండ్రులను పోగొట్టుకొన్న వాడయ్యెను. అయినా పెద్దతండ్రి రంగయ్య బాలుని కేలోటు రానీయకుండ పెంచుచున్నాడు.

పెద్దతండ్రి రంగయ్య బాలుని – పెంచెనాడు బాగ ॥తందాన తాన॥
పిన్నతండ్రి కృష్ణయ్య వానికి – సాము నేర్పినాడు
ఇద్దరు పెంచిరి బాలవీరుని – ముద్దుల కొడుకనియు
చదువు సాములు నేర్పించిరిగా – బాలవీరునకును ॥తందాన తాన॥

వ॥ గంగరాజుల సంస్థానములో బాలవీరుడందరి బాలకుల కంటె అందె వేసిన వాడుగ విద్య నభ్యసించెను. అతని పదునాల్గవ ఏట వరకు గూటిబయలు సంస్థానమునందే చదువుకొనెను. బాలునికి ఉన్నత విద్య చెప్పించుటకు రంగరాజు వానిని కొక్కంటి పాఠశాలకు పంపి తరువాత పెనుగొండలో గురుకులమున విద్యాబుద్ధులు చెప్పించెను. తిమ్మమ్మ అన్న నారాయణుడు గూడ అదే గురుకులములో విద్యార్థిగా నుండి నందున బాలవీరుడు నారాయణుడు బాల్యమునుండి బాంధవ్యముతో పాటు బాల్యమిత్రులై చదువుకొనసాగిరి.

కత్తియుద్ధము, కర్రసామును – బాలురు నేర్చారు ॥తందాన తాన॥
మల్లయుద్ధము. విలువిద్యలను – మేలుగ నేర్చారు
గుర్రపుస్వారి, రథములు దోలుట – రయముగ నేర్చారు
ధర్మశాస్త్రము, తర్క శాస్త్రము – చక్కగ చదివారు
రామాయణములు, రాజనీతిని – రమ్యముగా జదివి
పెనుకొండ యందున పేరు బొందిన – చదువరులయ్యారు ॥తందాన తాన॥

వ॥ ఈ విధంగా బాలవీరుడు బావ నారాయణునితో పాటు పెనుకొండలో కూడ విద్యా బుద్ధులు నేర్చుకొని ప్రయోజకుడై తన సంస్థానమునకు తిరిగివచ్చి పెంచిన తలిదండ్రులకు చేదోడు వాదోడుగా సంస్థాన కార్యములందు సహకార మిచ్చువాడాయెను.

బాలకృష్ణుడు కాళియ సర్పము – చంపినాడు నాడు ॥తందాన తాన॥
గోవుల గాచెను గోపాలుడు – రేపల్లివాడయందు
గంగరాజుల గోవుల జంపెను – క్రూరపు పులియొకటి
ఈశ్వరపలలో అడవులందున – దిరుగుచున్నదండీ
గోవుల గావగ బాలవీరుడు – గోపాలుండయ్యె
పులితో తలపడి చీల్చి చంపెరా – బాలుడయ్యునాడు
బాల్యములోనే పులిని జంపితా – బాలవీరుడయ్యె
సార్థక నామధేయుడయ్యెను – సత్యమిదియు సుమ్మి
బుద్ధికి భూమి వంటి వాడురా – బాలవీరయ్య
చిన్ననాటనే దైవ భక్తుడా – బాలచంద్రుండు
శివుడే వారికి ఇంటి వేలుపు – గంగరాజులకును
రాముడాతని ఇష్ట దైవము – బాలవీరునకును
వీరుల వరమున బుట్టినట్టియా – కర్మవీరుడతడూ
ఇరువదియేండ్ల ప్రాయము వచ్చెను – బాలవీరునకును
జననీ జనకులు చిన్ననాటనే – దూరమగుటకతనా
చిన్ననాటనే విరాగియైన – బాలయోగి యతడు
తీర్థయాత్రలు చేసెను వీరుడు – చిన్ననాటినుండి
ఖాద్రిలోన నరసింహస్వామిని – కొలుచుచున్నదేమి
సాధుకొండ మల్లయ్యస్వామికి – సేవలు చేశాడు
యోగులనెందరో దర్శించాడు – సాధుల చూశాడు ॥తందాన తాన॥

506844 /2DPAVL

సాదుగొండ పీరన్న గవులలో – పరమయోగి యొకడు ॥తందాన తాన॥
ఉన్నాడనియు తెలిసినందున – వీరుతు వెళ్ళాడు
యోగి మ్రోలను సాగిలపడెను – బాలవీరుడపుడు
శిష్యునిగా నను చేసుకొమ్మని – వేడుకొన్నవాడు ॥తందాన తాన॥

వ॥ యువకుడుగా ఉండి విరాగియైన బాలవీరుని చూచిన యజ్ఞాత యోగి బాల వీరునితో "నాయనా నీవు గృహస్థుడవై మహాసాధ్వియగు నిల్లాలికి భర్తవై, కర్షక కర్మయోగివై భక్తి యోగముతో భవసాగరమును దాటవలసిన యోగమున్నది. కర్షకులు, కర్మ యోగులు. అన్ని జీవులకు అన్నదాతలు, వ్యవసాయము కంటే వుత్తమమయిన వృత్తి లేదు," అని పలికి కొంతసేపూరకుండి అర్ధనిమీలిత నేత్రుడై "నాయనా నీకు కాబోవు సతీమణి ఇక్కడకు ఏడామడ దూరములో మల్లప్ప కొండల ప్రాంతములో పెరుగుచున్నది. ఆమె తిరుమల దేవుని వరప్రసాదిని. ఆమె వలన మానవ జాతికే వన్నె కలుగును. లెప్పుమ్మ కర్తవ్యమును మరువవద్దు – స్వధర్మాచరణమే చక్కని యోగము, వెళ్ళు!, రాజయోగివి గమ్మని'' ఉపదేశము చేసెను.

—: బాలవీరుడు తిమ్మమ్మను వరించుట – వివాహమాడుగోరుట :—

యోగి యాజ్ఞను శిరమునదాల్చి – బాలవీరుడపుడు ॥తందాన తాన॥
గూటిబయలుకు మరలి వచ్చెను – కర్మయోగి యయ్యే
కర్షక కార్మిక యజ్ఞము చేత – సంఘసేవ చేసి
శ్రమయేఫలమని సత్యమె జయమని – భావన చేశాడు
బాలవీరుడా బాలరాజు. – సంస్థానమునకునాడు
బాగుగ నేలెను ప్రజల మేలు – తనమేలుగ మదిదలచి
యువకుడైనయా బాలవీరుడు – యువ్వరాజుగాగ
తండ్రి రంగయా కుడి భుజమల్లు – కొలువు సేయసాగె
కృష్ణమరాజుకు చేదోడుగ – వాదోడుగనున్నాడు
గోరక్షణము చేసినాథయా – గోవిందునిలాగ
ఎల్లవేళలా బాలవీరుడా – యోగి మాటదలచి ॥తందాన తాన॥

వ॥ ఇట్లుండగా ముందే తిమ్మమ్మ గుణగణములను వినియామెను ప్రేమించి యుండిన బాలవీరుడు యోగిమాటలవల్ల ఇంకా గాఢానురక్తుడైన వాడాయెను. అంతలోనా—

పెద్దతండ్రియు పెండ్లి చేయగా — ప్రయత్న పడినాడు ॥తందాన తాన॥
బందువు లిండ్లలో కన్యలు చూచే — బాధ్యత వహియించె
పెద్దవారు నీలాగున చేయగ — పెండ్లి ఒప్పదేమి?
ఎంత చెప్పిన పెండ్లి వద్దని — పద్దుకునిలిచాడు
తిమ్మమాంబను పెళ్ళియాడగ — నిశ్చయించినాడు
తండ్రిగారికి తనదు కోరిక — చెప్పుకొన్నదేమి
వందనమ్ము పెద తండ్రిగారికి — దండమయ్య మీకు
తల్లివినీపై తండ్రివినీపై — పెంచినావు నన్ను
పెండ్లిచేయ పలు చోట్లకు మీరు — తిరిగినారు బాగ
కన్యల్ను కొల్లగ చూచియు నాకు — కట్టబోయినారు
కన్యలిస్తమని బంధువులెందరో — కదిలి వచ్చిరయ్య
పెండ్లి వద్దని పెలుసుగ బలుకగ — కొరత గల్గె మీకు
ఇచ్చెదమని నామూర్ఖపు కన్యల — మాటలు మనకేల
అందు వల్లనే పెండ్లియె వలదని — గట్టిగ బలికితిని
ఉత్తమ కోడలు కావలెనననా — ఉన్నది యొకచోట
బుక్కపట్నమున కలదా కాంత — బుద్ధిమంతురాలు
తెచ్చి వివాహముచేసిన యొప్పెద — తండ్రిగారు నేను
అని యిటు బాలవీరుడు చెప్పగ — తండ్రిగారు అపుడు
ఆమెను మేము చూచినాదయా — మేనరికమె మనకు
కానీ యామె సుకుమారీయని — చెప్పగ వింటిమిగా
గంగరాజులది సంస్థానమ్ము — వినరా వీరయ్యా
గమసరి కాంతయె గావలెనీకు — నాయన వినవయ్య
దూర భారము సంబంధమ్ము — కష్టమగును మనకు
ఎంత చెప్పినను బాలవీరుడు — వినడము లేదయ్యా ॥తందాన తాన॥

—: రంగరాజు బంధుమిత్రులతో బుక్కపట్నమునకు పెత్తనము వెళ్ళుట
తిమ్మమ్మ బాలవీరుడు పరస్పరము అనురాగ బద్ధులగుట —

రంగరాజు ఆనాడు బాగుగ — ఆలోచించాడు ॥తందాన తాన॥
చేయునదేమి లేకయె తాను — పయనమయ్యెనాడు
బందుమిత్రుల వెంటనిడుకొని — బండిలోనతాను
బుక్కపట్న పెత్తనమువచ్చెను — తిరుమలమ్మ కపుడు ॥తందాన తాన॥

వ॥ వచ్చిన బంధువులను చన్నక వెంకటప్ప క్షేమవార్తలడిగిన వాడయ్యేను. తన బావ మల్లయ్య తన షడ్డకు కుమారుడు బాలవీరునకు తిమ్మమ్మనివ్వవలసినదిగా గోరెను. బాలవీరుడు తిమ్మమ్మను తప్ప ఇతరులను వివాహమాడనన్నాడని తమతో సంబంధము కావాలని రంగరాజు వెంకటప్పను కోరుకొన్నాడు. అంతావిన్న వెంకటప్ప తాము తిమ్మమ్మను విడిచి ఉండజాలమని యోగ్యుడయిన వరుని ఇల్లటముంచుకొని బిడ్డ నిస్తామన్నాడు. అందుకు ఒప్పుకొంటే బాలవీరు నొకసారి బుక్కపట్నము పంపమన్న వాడాయెను.

రంగరాజుల సంస్థానములో — వరుడు పెద్దకొడుకూ ॥తందాన తాన॥
ఇల్లటమంపను వీలుకాదనె — రంగరాజు అపుడూ
అయినా మేము వెళ్ళి వచ్చేదము — గూటిబయలుకేమో
పంపుతామయా బాలవీరుని — కోరిక మీరంగా ॥తందాన తాన॥

వ॥ గూటిబయలుకు తిరిగి వచ్చిన రంగరాజు ఒక శుభదినాన తన తమ్ముడు కృష్ణయ్యను తోడుపెట్టి బాలవీరుని బుక్కపట్టణమునకు పంపినవాడాయెను—

వాయువేగ శరవేగముతోన — బోవు అశ్వములనూ ॥తందాన తాన॥
ఎక్కి పట్నము వచ్చిరి వారు — కృష్ణుడు. వీరుండు
సంధ్యారాగము శోభలతోనా — సాయం సమయమ్ము
పక్షులన్నియు గూళ్ళ చేరగా — కలకల రావములా
వచ్చిన బాలవీరుని చూచెను — నారాయణుడండి
బాలవీరుని కౌగలించుకొని — క్షేమ వార్తలడిగె
బుద్ధిలోన బలు విద్యలలోన — బాలవీరుడండి
యోగ్యుడనెను బహు సమర్థుడనెను — నారాయణుడేమో
తనకు నచ్చిన బాలవీరునే — చెల్లి ఒప్పుననియూ
తల్లిదండ్రికి చెప్పినాడయా — నారాయణుడపుడూ
అన్నమాటయే తన మాటనెను — తిరుమలమ్మ యపుడూ
తల్లిదండ్రులే నిరుకున బడిరి — నిల్లరికము గూర్చి ॥తందాన తాన॥

వ॥ ఇలా వుండగా తిమ్మమ్మ బాలవీరులు ఒకరినొకరు చూచుకొన్నవారై, గుణరూపాలందు ఒకరి నొకరు మనసులోనే మెచ్చుకొని ప్రేమించుకొన్న వారైరి. వెంకటప్ప, బాలవీరుని గుణగణములు పరిశీలించుటకు బుక్కపట్నమందే బాలవీరయ్యను విడిచి వెళ్ళుమనగా కృష్ణయ్య అట్లేయని గూటిబయలుకు తిరిగి వెళ్ళినవాడాయెను.

బాలవీరుడు తిరుమలమ్మను – తేరిపార జూచె ॥తందాన తాన॥
గుణరూపములు కలసిపోసిన – పుత్తడి బొమ్మామే
చూపనచాయతొ సొంపెసలారెను – సుగుణరాశియామే
అందముకంటే అందమయినదా – యమ్మనడతయండీ
బంగారమునకు పరిమళమబ్బిన – చందము వలెనండీ
చక్కటి గుణము సౌందర్యమ్ము – లేదు యేది కొరత
మౌనముతోనే మాటలాడునా – మధురమైన మూర్తి
ఆమెను చూచిన వారికెవరికి – అక్కడనే తాము
దేవి పార్వతిని చూచినట్టులే – భ్రమలు గల్గునయ్యా
భూమి మీదనే యవతరించెనా – దేవత యన్నట్లు
చాటుమాటున బాలవీరుని – తిరుమలమ్మ చూచె
గిరిజాదేవి పరమశివుని తా – చూచినట్టులామె
సిగ్గులు నిగ్గులు తేలియాడెనా – తిరుమలమ్మ యేమో
గుణము వున్నది రూపు వున్నదీ – ప్రాయమున్నదనియు
అన్నిటికన్నా మంచిది యతడు – అన్న సఖుడునయ్యే
శివుని భక్తుడు శీలవంతుడూ – చక్కని వాడనియూ
ముందువినెనూ తా చూచెనిప్పుడు – తిరుమలమ్మ యేమొ
అన్నయప్పుడే చెల్లికి జెప్పెను – తనకు ఇష్టమనియూ
తల్లిదండ్రుల యంగీకారమె – తదుపరి కార్యమ్మా ॥తందాన తాన॥

—: జననీ జనకులు గంగరాజుల సంస్థానములోని కష్ట సుఖముల గూర్చి తిమ్మమ్మకు విడమర్చి చెప్పుట .—

వ॥ ఇట్లుండగా తల్లి మంగమ్మ తిమ్మమ్మను దగ్గరకు చేర బిలిచి ఏమన్నదయ్యాంటే....

అమ్మా విను తిమ్మమా వినవె – అడిగెదనొక మాట ॥తందాన తాన॥
వరాల తల్లి నిజము చెప్పుము – సిగ్గుపడకు బిడ్డా
పెత్తనమొచ్చిన బాలవీరుడు – ఎడమువాడుగాదూ
తరతరాల బాంధవ్యమున్నది – తాతల నాటిదిగా
బాలవీరుడు ఇల్లటముంటే – చాలఇష్టమమ్మా
నీదు ఇష్టము జెప్పుము తల్లీ – సిగ్గుపడక ఇపుడు
కొరత లేకను మాకు చెప్పుమూ – కోమలాంగి నీవు ॥తందాన తాన॥

వ॥ అందుకు తిమ్మమ్మ ఏమన్నదయ్యాంటే - అమ్మా! వరుడు దగ్గరిబంధువు అన్నకు అప్తమిత్రుడు యోగ్యుడు బుద్ధిమంతుడని అందువల్ల యీ సంబంధము నాకిష్టమేఅని విన్నవించినదాయెను. అందుకు పంగమ్మ సంతసించినదై భర్తకీ విషయంతెల్పింది. బాలవీరుని గుణగణాదులను జూచి మెచ్చుకొన్న తిమ్మమ్మ తలిదండ్రులు బాలవీరుని చేరబిలిచి నాయనా బాలవీరా, మీకు మాకు తరాలనాటి బాంధవ్యముంది. మీ సంబంధము మాకిష్టమే కానీ మా నోముల పంట తిమ్మమ్మ లేక లేక గలిగింది. మా ప్రాణాలన్ని ఆమెమీదనే పెట్టుకొన్నాము. మీ ఊరు దూరముంది మాది పెద్దఆస్తి, ఆస్తిలో అర్ధభాగం మీ కిస్తాము మాఇంటనే ఇల్లరికముండి మా కన్నులముందర వుండమని బాలవీరుని పరి పరి విధముల బ్రతిమాలిరి. అందుకు బాలవీరుడు పెద్దలార! మీ ఆదరాభిమానములు కానందమయినది కానీ నాకు నాచిన్ననాడే తలిదండ్రులు గతించినప్పటినుండి మా పెద్దతండ్రి పినతండ్రులే నన్ను తమ బిడ్డలకంటే ఎక్కువగా పెంచి పెద్దజేసిరి. మాసంస్థానములో నేను పెద్దకుమారుడను. సంస్థానమును చూచుకోదలచిన బాధ్యత నాపైనున్నది ఇల్లటముండలేనని విన్నవించు కొన్నవాడాయెను. అంత తిమ్మమ్మ తలిదండ్రులు రహస్యముగా తిమ్మమ్మ కేమని చెప్పుతున్నారయాంటే—

అమ్మావినవే తిమ్మమా విను - తెల్లముగా నీవు ॥తందాన తాన॥
కన్న ప్రేమయూ పెంచిన మతులు — కలిపి చెప్పుతాము
నిన్ను విడిచి ఒక దినమును మేము - ఇల మన జాలముగా
తల్లిదండ్రులూ, వూరివారలు — ఎత్తి సాకినాము
ఇల్లరికముతో తగిన వరునకు — నిన్ను యివ్వగలము
బాలవీరుడిల్లరికము రానని — పలుకుచునున్నాడు
గూటిబైలుకు నిన్ను పంపగా — గుణము రాదు మాకు
గంగరాజు సంస్థానమయిననూ — గుణము లేదు తల్లీ
గూటి బయలకు కోటయున్ననూ — చిన్న గ్రామమమ్మా
నీరాధారము బొత్తిగ లేదు — మెట్ట భూములమ్మ
సద్దరొట్టెలట అప్పలంబులూ — టక్కు కాదు తల్లి
రేణి గాయలా ఊరివారికి — ఊరగాయలమ్మా
పల్లెలలోన కష్టము తల్లి — పట్నము గాదమ్మా
జీత గాళ్ళకు నాత గాళ్ళకు — అన్నము వండాలి
సేద్య గాళ్ళకు కష్టమువుండు - కల్లగాదు బిడ్డ
నీవు చూడ సుకుమారివి తల్లి — కష్టము పడలేవు ॥తంధాన తాన॥

గంగరాజుల గోనె యెద్దులు – నూర్లకొలది కలవూ ॥తందాన తాన॥
వ్యాపారమ్ము పెద్దది అమ్మా – మనమే చూడాలి
ఆవుల మందలు గొర్లమందలూ – పూరిచుట్టు గలవు
బానలు బానలు మజ్జిగ చిలికె – భాదయుండు తల్లీ
గొల్ల భామవా నీవు కూతురా – అనుభవమ్ము లేదు
వేల యకరముల్ పంట భూములు – వారికున్నవమ్మా
పంట పొలములా పనులను మనమే – చేయించాలమ్మా
చేయలేవు సుకుమారివి తల్లి – ఎల్లకాలమందు
గంపడు పిల్లల సంసారమ్ము – గంగరాజులకును
ఎంత చిన్న సంసారమ్మయితే – అంత సౌఖ్యమమ్మ
ఇద్దరు ముగ్గురు పిల్లలు చాలు – సుఖము గల్గునమ్మా
చింతలు లేనిది వంతలు లేని – చిన్నది సంసారం
చేయుట మేలు చిన్నారివి, మా – చిలకమ్మా వినుమా ॥తందాన తాన॥

వ॥ అని అట్లు తల్లిదండ్రులు ఊరి వారలు చెప్పగా తిమ్మమ్మ ఏమన్నదయ్యా అంటె –

వందనమ్మురీ ఊరి పెద్దలకు – తల్లిదండ్రులకును ॥తందాన తాన॥
పెద్దవారికి బదులు జెప్పను – బుద్దిగాదు తండ్రి
మీకు తెలియని ధర్మము లేవీ – నాకు దెలియరావు
అయినా జెప్పెదనాకు తెలిసినా – సత్యము వినరయ్యా
కష్ట సుఖములూ కావడి కుండలు – జనులకెప్పుడుండు
బాలవీరుడే పతియని నేను – భావముంచినాను
ఒక్కటె మనసూ హృదయమొక్కటే – మంచి జాతి స్త్రీకి
మనసు మారదు మంచి మగువకు – మన్నన చేయండి
భూస్వాములకు సుఖము లేదునా – యన్నలార వినుడు
పాడి పంటలు పండించుటలో పరమ సుఖము గలదు
పేద ప్రజలకు సేవలుజేయగ – చింతన చేసితిని
తాను మెచ్చిన చోటనె మగువకు – స్వర్గమౌను గాదె
ఇష్టము లేని చోట నెప్పుడూ – కష్టముగా నుండు
నలునివలచిన దమయంతికి నా – యడవి స్వర్గమాయె
జాతి స్త్రీలకు న్యాయమ్మదియే – అయ్యలార వినుడు
సంస్థానమును స్వర్గముగానే – మార్చగలను వినుడి ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు తిమ్మమ్మ ధర్మ సూక్ష్మలను వివరించగా తలిదండ్రులు మారు మాటడక తిమ్మమ్మ నిర్ణయానికి సమ్మతించిన వారై. అల్లుడగు బాలవీరునితో ఏమను చున్నారయ్యాంటే !

నాయన వినరా! అల్లుడ వినరా – బాలవీర నీవు ॥తందాన తాన॥
తిమ్మమ్మను నీకివ్వదలచిన – సమ్మతి వినవయ్యా
నీవు కోరిన కొండల మీదనె – వర్షము కురిసింది
గూటి బయలకు పోవలదిచ్చట – ఉండి వ్రతము జేయు
తిరుమలమ్మయా వ్రతము జేయును – పెళ్ళికి ముందటను ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు బాలవీరయ్యకు చెప్పిన వారై – బుక్కపట్నములో చన్నక వెంకటప్ప, కుమార్తె తిమ్మమ్మ బాలవీరుల వివాహముతో బాటు, వెంకటప్ప బావమరిది పెద్దరాజు మల్లయ్య కుమార్తె పుట్టమ్మను నారాయణునకిచ్చి పెండ్లి చేయుటకు పెద్దలు నిశ్చయించు కొన్న వారైరి, నారాయణుని వివాహము పెద్దరాజు మల్లయ్య ఇంటి యందునూ, తిమ్మమ్మ వివాహము వెంకటప్ప ఇంటియందును జరుపవలసినదిగా పెద్దలు నిశ్చ యించినారు. అలాగుననే వెంకటప్ప అందరికీ జాబులు ఎట్లా వ్రాస్తున్నాడయ్యా అంటే

హాస్యం: రామన్న: ఒరే రంగన్నా నాకూతురు పెండ్లికి ముహూర్తమడిగి రావల్లరా ఈ గుమ్మితి దీసుకోర వెళ్లా!

రంగన్న: ఇప్పుడు కథ జెప్పకుండా పోతే. నీకు ముహూర్తము పెట్టి పెళ్ళిగూడ జేస్తారులా, కథ గానీ.

## — బుక్క పట్నములో వివాహ మహోత్సవములు :—

వెంకటప్ప పలు లేఖలు వ్రాయగ – మదిని దలచినాడు ॥తందాన తాన॥
దండమయ్య పదివేల దండముల్ – బావగారు మీకు
రంగయ్య బావ కృష్ణయ్య బావలు – మీకు వందనములు
చన్నక వెంకటప్ప వ్రాసిన – విన్నపంబులండి
మేము క్షేమము మీరు కుశలమని – మేము తలచుతాము
మీ కుమారుడు బాలవీరుని – మేము వప్పినాము
మా కుమార్తెను అతనికి మేము – ఇవ్వదలచినాము
మీరు సమ్మతి బంధుమిత్రులా – వెంటదీసుకొనుచూ ॥తందాన తాన॥

బుక్కపట్నము వచ్చి వెళ్ళుడు – నిశ్చయార్థమునకు ॥తందాన తాన॥
లేఖలు వ్రాసియు లకోట చేసి – గూటి బయలు కంపె ॥తందాన తాన॥

వ॥ గూటి బయలులో ఆ శుభలేఖను అందుకొన్న రంగరాజు, కృష్ణయ్యగారు సంతోషించిన వారై – రాగల బంధు మిత్రాదులను బిలుచుకొని బుక్క పట్నము చేరిన మీదట పెద్దల సమక్షములో పెళ్ళి కార్యములు నిశ్చయించి బంధు మిత్రాదులకు శుభ వార్తలను పంపుకొన్నవారైరి. అటు పిమ్మట గంగరాజులు బాలవీరునితోసహా సంస్థానానికి తిరిగి వచ్చి వివాహ ప్రయత్నాలు ఘనంగా చేయసాగిరి. ఇంక అక్కడ బుక్క పట్నములో అకాశమంత పందిరి వేసి భూదేవంత ముగ్గులు వేసి పెండ్లి ప్రయత్నాలెట్లా చేస్తున్నారయ్యా అంటే..

పట్టణమంతా వేసిరిబాగా – పచ్చని పందిళ్ళు ॥తందాన తాన॥
వానిపైన టెంకాయ నెరెడు – ఆకులు పరిపించి
స్తంబ స్తంభమున అరటి కంబములు – అంటగట్టినారు
మామిడాకుల తోరణంబులు – చుట్టు గట్టినారు
ఐదురోజుల హరివేణీల – అందమయిన పెళ్ళి
ముత్తైదువులా హరివేణీలకు – పూజలు చేశారు
వివాహ వేదిక యందు వినాయకు – పూజ చేసినారు
ఇలవేల్పగు యా తిరుమల దేవుని – ప్రార్థన సల్పారు
కలశమ్ములను తీర్చిదిద్దిరి – లక్ష్మిని పూజించి ॥తందాన తాన॥

వ॥ వివాహమునకు ముందు రోజున వధూవరులు, ముత్తైదువులు బంధుమిత్ర సపరివారముతో బుక్కపట్నములో దేవాలయములకు వెళ్ళి పూజలు ఎట్లా చేసిరయ్యా అంటే....

పండ్లు ఫలమ్ములు తట్టలతో – కళశమ్ము లెత్తుకొనియూ ॥తందాన తాన॥
పళ్ళెములెత్తిన ముత్తైదువులు – వెంట నడచిరపుడు
సన్న మేళములు, సద్దెల తాశాల్ – నాగసరములేమి
నగారి తుతూరి మృదంగ ఖేరీల్ – తూర్యారావములు
ముందు మ్రోగుచూ పోవుచుండగా – తిమ్మమాంబ దేవి
బయలుదేరినది పూజలు చేయగ – దేవాలయములకు ॥తందాన తాన॥

---

[ ఇచ్చట టెంకాయకొట్టి కర్పూరము వెలిగించవలెను ]

పాట:— సీతమ్మ పెళ్ళికూతురాయెనే - అనేపాట మాదిరి :—

ఆనంద మానందమాయెనే, మన తిమ్మమ్మ పెళ్ళికూతురాయెనే!
ఆనంద మానందమాయెనే, మన బాలవీరు పెళ్ళిబాగ వుందిలే!
భాజాభజంత్రీలు మోగెనే, బంగారు కలలన్ని పండెనే!
ముక్కోటి దేవతలందరూ, మన తిమ్మమ్మ బాలవీరు బ్రోవరే!

వేదవిధిని వివాహ తంత్రము - జరిగినాది బాగ ॥తందాన తాన॥
మంగళ వాద్యము లొక్కసారిగా — మారుమ్రోగె నండి
సుముహూర్తమున మంగళధారణ — మంచిగ జరిగింది
అక్షింతలు జల్లిరి బంధుమిత్రులు — వధూవరుల పైన
వధూవరులు పూలమాలలు — మార్చుకొన్నరంత
బాలవీరుడు దోసిటి బియ్యము — తిరుపలమ్మ కపుడు
శిరమున బోసెను చెలువుమీరగ — శాస్త్రరీతిగాను
తిమ్మమదేవి దోసిటబియ్యము - బాలవీరునకును
శిరమున బోసెను చిత్తములరగ - శిలముట్టిపడగ
తలంబ్రాలను బోసుకొన్నరు - తనువులు పులకింప
సప్తపదిని సంపూర్తిగ జేసిరి — వేదమంత్రములతో
సీతారాముల కళ్యాణమువలె — చూడముచ్చటాయె
మంగళమ్మ శుభ మంగళమ్మని — పాడిరి అంగనలు
బంధుమిత్రులు కట్నకానుకల్ - చదివించిరి బాగ
గారెల బూరెల భోజనాదులు — చేసినారు బాగ ॥తందాన తాన॥

పాట :—శశిరేఖా పరిణయం సందర్భంగా మాయాబజారు సినిమాలోని పాటకనుకరణ :—

వివాహ భోజనాలు, విందైన వంటకాలు!
వియ్యాల వారివిందు, ఓహోహో బాగు బాగు ॥వివాహ॥
ఔరౌర గారెలెల్ల, ఓహోరె బూరెలెల్ల
జిలేబి లడ్డులెన్నొ, పులిహోర అప్పలాలు ॥వివాహ॥

వ॥ ఈ విధంగా రంగ రంగ — వైభోగముతో తిమ్మమ్మ బాలవీరుల వివాహము జరిగింది. మరునాడు బంధు మిత్రాదులు, పెండ్లి పెద్దలను వీడ్కొని వారి వారి ఊర్లకు వెళ్ళుచుండగా—

హాస్యం: రామన్న: ఇంత పెద్దపెళ్ళి జరిగితే మన కింత బోజనము కూడ పెట్టలేదు గదరా?
రంగన్న: పెళ్ళి జరిగింది ఇప్పుడు కాదురా మొద్దూ - ఐదారు వందల సంవత్సరాల మాట - అప్పుడు మీ ముత్తాతలు భోంచేసి ఉంటారులే.

బంధు మిత్రులకు కొబ్బరి కాయలు - తాంబూలములిచ్చి ॥తందాన తాన॥
అయ్య గారికి ఆయ గాళ్ళకు - ఇనాము లిచ్చారు
మర్యాదలతో నందరినపుడు - సాగనంపినారు
అరివిరి పరివిరి ఒడి బియ్యంబులు - వండివేసినారు
ఇంట ఇరుటను విందులు బెట్టిరి - ఊరివారలంత
విందులేమి ఆనందములేమి - జరిగినాయి బాగ
అంటట వచ్చె వసంతకాలము - ఆకులు చిగురించె
ఎచ్చట చూచిన పూవులు పూచెను - శోభనమ్ము గూర్చె
బాలవీర తిమ్మమ్మయు చిలకా - గోరింకల లాగ
అల్లిరికంబులు ఆరు నెలలుగ - అనురాగమునిండ
ఇల్లరికమ్మును బాలవీరుడు - ఇష్టపడక పోగ
మంగమాంబయు, వెంకటప్పయు - వగచిరి తమలోనె ॥తందాన తాన॥

వ॥ ఇట్లు ఆరు నెలలు అల్లిరికము ముగిసిన తరువాత బాలవీరుణ్ణి తన సంస్థానమునకు త్వరగా రావలసినదని అతని పెద్దతండ్రి రంగయ్యగారు వర్తమానమును పంపిరి. బాలవీరుడు అత్తమామలకు ఆ యూరిపెద్దలకు చెప్పి, తిమ్మమ్మతో సహా స్వగ్రామము నకు బయలుదేరగా, వెంకటప్ప తన అల్లుని, కూతురును అత్తగారింటికి ఎట్లా పంపుచున్నాడయ్యా అంటే........

— బాలవీరుడు తిమ్మమ్మ నూతన వధూవరులు సపరివారముగ గూటిబయలుకు బయలుదేరి వచ్చుట :—

శుభదినంబును నిర్ణయించిరి - ప్రయాణమ్ము జేయ ॥తందాన తాన॥
బంధుమిత్రులను పిలువనంపిరి - విందుపెట్టినారు
రప్యమ్మయిన రత్నకంబడిని - పరచినారు శోభ
కంబడిమీద పిన్న పెద్దలు - కొలువు దీరినారు
పుణ్యాంగనలు తిమ్మమాంబ కొడి - బియ్యము గట్టారు
పూలహారములు వేసిరి వారికి - కొత్తదంపతులకు
పురోహితులు వేదమంత్రములే - చదువుచుండగాను ॥తంధాన తాన॥

అక్షింతలను జల్లిరప్పుడు — ఆశీస్సులు నిండ ॥తందాన తాన॥
దీవెనలిచ్చిరి దంపతులారా — శుభములు గనుడనుచు
మంగళ వాద్యాల్ మోగుచుండగా — నూతన దంపతులు
ఇల్లు విడిచి అట ఆలయాలకు - తరలి వెళ్ళిరపుడూ
పూజలు జేసి ఊరిద్వారము — వచ్చి నిలచినారు
పల్లకీలును ఎద్దులబండ్లు - సిద్ధముగా నుండ
బంధుమిత్రులు నరటి గెలలతో — వెంట నడువగాను
చీరలు రవికెలు సారె తీసుకొని — జనము వెంటరాగ
తలిదండ్రులకు తిమ్మమ్మకును — కనులనీరు నిండ
ఎచ్చట వెళ్ళిన జన్మభూమిని - మరువదు తిమ్మమ్మ
కన్నతల్లియు కన్నదేశమూ — స్వర్గసమముగాదె
పల్లకి నెక్కిరి కొత్తదంపతులు - కూర్మితోడ యపుడు
నారాయణుడు తొందర చేయగ — బయలుదేరిరంత
తల్లిదండ్రులు, నారాయణుడు — వదినా పుట్టమ్మ
ఈడువారలు జోడువారలు — అమ్మ వెంటరాగ
ఆయగాల్లును బోయవారు — బలుగట్టి బంట్లురాగ
పెళ్ళిబృందము బయలుదేరెను — గూటిబయలు జేర
వూరు వూరుగా కదులు చున్న — దన్నట్లు అందరపుడు
రెండవ దినము గూటిబయలుకు — చేరవచ్చుచుండ
గంగరాజు సంస్థానము వారు — ప్రజలు వెంటరాగ
భేరి మృదంగ మేళమ్ములతో — బంధుమిత్రులాతో
పలకలు కొమ్ములు వురములు, మద్దెలు — మూరుమ్రోగుచుండ
పెండ్లివారికి ఎదురుకోలుగా - పొలిమేరకు వెళ్ళి
తోడదెచ్చిరి పెండ్లివారిని - సంస్థానమ్మునకు
కోటలోనను కొలువయ్యారు — వచ్చిన వారపుడు ॥తందాన తాన॥

వ॥ ఈ విధముగా బుక్కపట్నము నుండి సారె దెచ్చిన వారందరూ వారమురోజులు అచ్చటనే ఉండి విందులు వినోదాలతో కాలక్షేపము చేసినవారై వెనుదిరిగి బుక్కపట్నము వెళ్ళగా మంగమాంబ వెంకటప్ప కొంతకాలమక్కడనే యుండిరి. అక్కడున్నంతకాలము కొమరితకు ధర్మోపదేశాలు చేసిరి. తమ బిడ్డ సుకుమారి యగుటచే సున్నితముగా చూచుకొండని అత్తవారింటిలో అందరికి చెప్పుకొని వెళ్ళిరి.

చెల్లిని పీడలేని నారాయణుడు మాత్రము చాల దినములు గూటిబయలులోనే యుండి చివరకు బుక్కపట్నమునకు దిరిగి వచ్చిన వాడాయెను.

హాస్యం: రామన్న: ఒరే రంగన్న నాకేదో బాధగా వుందిరా! అందరూ తిమ్మమ్మనువిడచి వెళ్ళితే నేనైన కొంతకాలమమ్మదగ్గరుంటానుర. నాకు కొంత భోజనము జరిగిపోతె చాలుర !

రంగన్న: నీకు గావలసింది భోజనము జరిగిపోవడమేర అయినా అమ్మగారు ఇప్పుడెక్కడుందిరా ఏవాటి కథో యిది. కానీ, కథగానీ.

## —: తిమ్మమ్మ అత్తింట కాపురము :—

గూటిబయలులో అత్తఇంటనూ – పుట్టినింటిపలెను ॥తందాన తాన॥
ప్రతిదినమామె పనుల పద్ధతి – ప్రత్యేకంబండి
పేకువలేచి మాంగల్యమ్మును – కనులకద్దుకొనును
మగని కాలను మెల్లగదాకి – వందనములు జేయు
తల్లిదండ్రులా గురువు దైవముల్ – స్మరణచేయు మదిని
ఇష్టదైవమరిపేలు మంగకు – మొక్కులిడును భక్తి
ఏడుకొండల వెంకటేశుని – విడువక గొల్చునుగా
గోపృచ్ఛమును తాకి గోవుల – మేత జూచి మగువ
కాలకృత్యముల్ స్నానసంధ్యలు – చేయునామె మరల
తులసిపూజ గోపూజ జేయును – తులసినీరు త్రాగు
ఈశ్వరామల వెనక తోచిన – సూర్య వందనాలు
ప్రత్యక్షదైవము సూర్య దేవుని – స్మరణ జేయునామె
పొద్దుపొడవక పూర్వమందు నీ – పనులనన్ని జేయు
అత్తగారితో ఆడబిడ్డలు – అందరితోబాటు
ఇంటిపనులను వంటపనులను – ఇష్టముతో జేయు ॥తందాన తాన॥

హాస్యం: పుల్లన్న: ఒరే మల్లన్నా తిమ్మమ్మ ఇష్టంతో పనులు జేసిందంటె అందరూ అయిష్టముతో పనులు చేస్తారురా?

మల్లన్న: ఎందుకు చేయర్రా పుల్లన్నా ! కొత్తగా కాపురానికొచ్చినపుడు మాయావిడ అత్తమీద కోపం దుత్తలమీద జూపుచూ కుండలన్ని పగులగొట్టేది కదరా! కాని తిమ్మమ్మ అట్లగాదు మరి, అంతేగాదు—

కర్షక కార్మిక శ్రేయము కొరకై – శ్రమలు పడును యామె ॥తందాన తాన॥
కూలివారికి నాలివారికి – కల్పవల్లి గదర
జీతగాల్లకు నాతగాల్లకు – జీవగర్ర యామె
సంపదలన్ని సంఘము కేనను – సామ్యవాదియామె
కృషితో నాస్తి దుర్భిక్షమ్మని – పాటుబడును యామె
సహనము శాంతము గూడుగట్టిన – సౌమ్యమూర్తి యామె
శ్రామిక శక్తిలో సంపదున్నదని – చాటిచెప్పునామె
ఎప్పటిపనులు అప్పుడె చేయును – తప్పదు మరి తాను
సంసారమున సకల పనులను – సంతసంబుగాను
చేయుటయును చేయించుటయందును – ఓర్పు నేర్పు గల్గి
తన ధర్మములను తాను బాగుగా – చేయగల్గునామె
ధర్మోరక్షతి రక్షితః యన్న – మతము నామెదయ్యా ॥తందాన తాన॥

హాస్యం: యల్లన్న: అంటే ఏమిట్రా పుల్లన్నా ?
పుల్లన్న: అంటే మనము చేయాల్సిన పనులను బాగా చేసి మన ధర్మాన్ని మనము కాపాడుకుంటె మన ధర్మమే మనల కాపాడుతుందిరా! ఇంకా తిమ్మమ్మ ఎలాంటిది – విను

కర్మ యోగియై భర్త బాటను – నడచు చున్నదామె ॥తందాన తాన॥
ఒర్పునందు భూదేవియామెరా – తిమ్మమాంబ ఎపుడూ
భర్త మాటకు బదులు చెప్పదు – మంచికార్యమైన
అవసరమయితె సలహా లిచ్చును – అన్ని వేళలందు
మంత్రి నలెను మంత్రాంగము నెరపును – మగనితోన నెపుడు
గంగరాజుల సంస్థానముకే – లక్ష్మి దేవియామె
రాత్రిపూటను రామాయణము – పారాయణ జేయు
అందరకున్ను రేపటి పనులను – నపుడే జెప్పునుగా
మరదుల కెప్పుడు మంచి మాటలా – పనులు చెప్పునయ్యా
అణకువతో తాన త్తమామలను – ఆదరించునయ్యా
పేదల పాలిట పెన్నిధి యామె – పెద్దదిక్కు అమ్మ
ఆమె కాపురము ఆదర్శమురా – కాలకాలమందు
ఆమె అడుగులు పెట్టినదాది – గంగరాజులింట ॥తందాన తాన॥

నిమ్మకేమొ నీరెత్తినట్లుగా   నిండుకొనెను నిధులు
మూడుపూవులు ఆరు కాయలు – కాసెను వారింట
పట్టినదల్ల బంగారమురా – గంగరాజులకునూ
దిక్కు దిక్కుల దెలియనాయెను – తిమ్మమాంబ ఘనత ॥తందాన తాన॥

## — గంగరాజుల సంస్థానములో వివాహములు జరుగుట :—

వ॥ గంగరాజు రంగరాజు వృద్ధుడాయెను. తాను బ్రతికి ఉండగానే తన కుమారులకు తమ్ముని కుమారులకు కూడ వివాహము చేసి చూచి పోవలెననుకొనెను. ఆయన కోరిక మేరకే తగిన సంబంధాలు చూచి అందరికి ఒక్కసారిగా వివాహములు జేసిరి.

రంగ రంగ వైభోగముతోన – పెండ్లిండ్లయ్యాయి ॥తందాన తాన॥
గంగరాజుల కోటలలోన – కోలాహలమాయె
తిమ్మమాంబ తలిదండ్రులాదిగా – బంధువులందరును
పెండ్లికి వచ్చి విందులు గుడిచి – విస్మయ మొందారు
గంగరాజుల సంస్థానములో – రాణిగ తిమ్మమ్మ
రాణించెనురా తలిదండ్రులకు – ఆనందముగాగ
కొక్కంటి నాయుడు పెళ్ళికివచ్చె – మంది మార్బలముతో
రంగరాజుల కలుసుకొన్నడా – నాయుడప్పుడేమి
కుశల ప్రశ్నలు వేసికొన్నరు – పెండ్లి మంటపముల
మంచి మిత్రులు వారు ఇద్దరా – ప్రాంతమందు నాడు
పాళెములోన ప్రధానిగాను – రంగరాజు యుండె ॥తందాన తాన॥

వ॥ ఈ వివాహాలు అయిన తరువాత మంగమ్మ వెంకటప్ప కుమార్తె తిమ్మమ్మ, కొడుకు నారాయణుడు, కోడలు పుట్టమ్మ – బావ మల్లయ్య దంపతులందరితోపాటు తిరుమల యాత్రకు వెళ్ళిరి. మ్రొక్కులు ముడుపులు చెల్లించుకొని శ్రీనివాసుని సేవించుకొనిరి. తిరుమలలో తిరుమలమ్మకు కావలసిన వస్తుసామాగ్రిని తల్లిదండ్రులు తీసి ఇచ్చిరి. కుమార్తెకు అంతగా ఖర్చు పెట్టుచున్న అత్తమామల పద్ధతి పుట్టమ్మ కేమాత్రము నచ్చలేదు. లోలోన కలవారము కలిగినది. బాధపడసాగెను. తమతమ వూర్లకు తిరిగి వచ్చిన తర్వాత.

## — పుట్టమ్మ కాపురము :—

వ॥ అంత కొంత కాలమునకు గూటిబయలులో వృద్ధులైన రంగరాజు కృష్ణయ్యలు కాలధర్మము చెందిరి. ఇక్కడ బుక్కపట్నములో మంగమాంబ వెంకటప్పలు ఎలావున్నారయ్యా అంటే .......

అత్తమామల ఉత్తమ గుణములు – కోడల పుట్టమ్మకు ॥తందాన తాన॥
బొత్తిగాను సరిపడవు నాయనా – ఆమె బుద్ధి యోమో?
అత్తమామలు చేయుదానమూ – కంట పడగనామె
కంటిలో కారము పడినవిధముగా – కళ్ళుమూయునయ్య
పరోపకారము చేయుట జూచిన – పనులు జేయదేమి
అత్తమామల దైవభక్తియు – ఆమెకు సరిపడవు
కోవెలలున్న వనములలోనె – కాకులుండునట్లు
మంగమ్మ గారికి మేన కోడలై – పుట్టమ్మ పుట్టింది
ఇద్దరు ఒక్క ఇంట పుట్టినా – ఎంత భేదముంది? ॥తందాన తాన॥

వ॥ పుట్టమ్మకు మేనత్త అయిన మంగమ్మ మామ వెంకటప్ప నయాన భయాన నచ్చజెప్పి కోడలిని మంచి మార్గానికి దెచ్చుటకు ఎంతో ప్రయత్నించి ఈ విధముగా చెప్పిన వారెరి.

అత్తలేని యా కోడలు వున్నా – వుత్తము రాలమ్మ ॥తందాన తాన॥
కోడలు లేని అత్త వుండినా – గుణవంతురాలు
పెద్దలు చెప్పిన యీ సామెతలో – నిజములేక పోదు
అయినా వినుమా పుట్టమ్మా విను – అమ్మా వినవమ్మ
కోడల విని మా కోరిక దీర్చవె – కోప పడకు తల్లీ
పరోపకారము ప్రజల సేవకు – పాటుపడుము తల్లి
బీదల యెడను దయను చూపుమా – బింకము వద్దమ్మ
సాధులనందరి సత్కరించుము – చీదరించు కొనకు
ఊరిజనాలను దూరము చేయకు – ఊరడించవమ్మ
అడబిడ్డకు ఆశదీరదు – అమ్మ ఇంటి మీద
తిమ్మమనెపుడు తిరస్కరించకు – తిన్నగాను చూడు
పుట్టినవారు గిట్టక తప్పదు – గట్టిమాట తల్లి ॥తందాన తాన॥

పోయేనాడు వెంటరాదుగా – పూచిక పుల్లైనా ॥తందాన తాన॥
పరోపకారమె పరమార్థమ్మని – తెలుసుకొమ్మా నీవు
ఎల్ల వారికి మేలు చేయుము – ఎల్లకాలమందు
చెడు వినవద్దు, చెడు కనవద్దు – చెడు అనవద్దమ్మా
పంతు బుద్ధిని మకురు బుద్ధిని – మానివేయవమ్మా
కోపతాపముల్ కోతి చేష్టలు – వదలి వేయవమ్మా
క్రూర గుణాలను విడిచి పెట్టుమా – కోడల పుట్టమ్మా
పతి దైవంబని భావన చేయుము – మంచిగా నువుండు
అత్త మామల ముసలి వారిని – ఆదరించవమ్మా
మేన కోడలని తెచ్చుకొంటిమి – మేలు చేయవమ్మ ॥తందాన తాన॥

వ॥ అని పరి పరి విధాలుగా అత్త మామలు పుట్టమ్మకు బుద్ధులు జెప్పిన వారైరి. కానీ పుట్టమ్మలో మాత్రము మార్పు రాలేదు. సరికదా అత్తమామలు బ్రతిమాలుచున్నారని ఇంకా గయ్యాళి గంపగా మారింది.

హాస్యం: మల్లన్న: ఒరే యల్లన్నా పుట్టమ్మకు దయ్యమేదన్నా పట్టిందేమొ చూపించలేదటర్రావాళ్లు – వేపాకుతో కొడితే కుదురు కుంటుందేమొ.

యల్లన్న: దయ్యాలకు దయ్యమురా పుట్టమ్మ – నీకు పట్టించే నీ జుట్టు వూడ గొడుతుందిరా జాగ్రత్త.

వ॥ గయ్యాళి గంపైన పుట్టమ్మ ఇక మారదనుకొన్న అత్తమామలు అప్పుడేంచేశారయ్యా అంటే .. ....

అత్త మామలకు కోపము హెచ్చెను – ఆమెనడత చూచి ॥తందాన తాన॥
దండన ఖండన చేయ బూనిరి – దారికి తేబోయి
కుక్క తోకను చక్క బెట్టగా – ఎవరికి తరమగును
అత్త మామలు ఆలోచించిరి – అంతవరకు చూచి
ఇంటి పెత్తనము తీసి వేసిరి – కడకు ద్రోసిరపుడు
కోడలి కోరిక జరుగనివ్వరు – కూడు నీళ్ళు ప్రాప్తి
పొలము పనులకే పుట్టమ్మండి – ఇంటికి ఎడమాయె
కాళ్ళను గట్టిన గాడిదయయ్యెను – కలుగలేదు బుద్ధి ॥తందాన తాన॥

—: తిమ్మమ్మ తల్లిదండ్రుల గోల్పోవుట - బుక్కపట్నము వెళ్ళుట :—

వ॥ ఇట్లు కొంతకాలము అత్త మామలు పుట్టమ్మను దూరము చేసి సంసారము చేయుచుండగా బుక్కపట్నములో మహావ్యాధి ప్రబలి దానధర్మ పరోపకార పరాయణులైన మంగమాంబ వెంకటప్ప పుణ్య దంపతులు పరలోక గతులైరి. వారితోపాటు పెదరాజు మల్లయ్య ఇంకా ఎందరో ఇ ఊరిలో ఆ వ్యాధి వలన మరణించిరి. వ్యాధి తగ్గినంతా నారాయణుడు, చెల్లికి శోకవార్త నంపెను.

హరి హరీ అయ్యోయ్యో — తందాన — ఓ దేవ నందనాన ॥తందాన తాన॥
తలిదండ్రుల మరణ వార్తవిని — తల్లడిల్లిపోయె
మూర్ఛ పోయెను తిమ్మమదేవి — ముజ్జిగ చిక్కుచును
తోడి కోడలు వెంగమునెమ్మా — అమ్మ ముఖము మీద
చన్నీరు చల్లగ మూర్ఛ దేరెను — అమ్మా తిమ్మమ్మా
ఏడ్చి ఏడ్చి కన్నీరు ఇంకెను — కంటనీరు లేక
వాయు వేగమున పోవు గుర్రముల్ — బండి గట్టినారు
బాలవీరుడు తిమ్మమ్మా మరి — బంధు వర్గమంత
వచ్చిరి వేగమే దుఃఖముతోన — బుక్క పట్నమునకు
అన్నను చేరి బోరు బోరున — ఏడ్చెను తిమ్మమ్మ
కట్టలు దెగినా చెఱువులాగా — కన్నీరు వరదలాయె
వలవల యేడ్చెను నారాయణుడు — బావమరిది చూచి
అమ్మలేదు మరి నాయనలేరు — మామ చెల్లిపోయె
బాలవీరుడు బావమరిదికి — ధైర్యము బోశాడు
చెల్లిని తిన్నగ ఓదార్చాడు — నారాయణుడపుడు
ఊరడిల్లుమా తల్లీ తిమ్మమ — మరణము ధ్రువమమ్మా ॥రామ రామ జై రామయ్య రామా
తిమ్మమాంబనూ చూచిన ప్రజలూ — బుక్కపట్నమందు రామా రఘురామ॥
గోడు గోడున దుఃఖించెతమ — గోడు జెంది వారు
కాకిశోకములాయె మామని — పుర్రంగిరి జనులంత
వారిని తిన్నగ ఓదార్చింది — తిమ్మమాంబ యపుడు
కన్నులు మూయుచు తల్లిదండ్రులు — కన్న కొడుకుతోను
అన్నా వినరా నారాయణ విను — మరుమకయ్య మాట
చెల్లిని దూరము ఇచ్చినామురా — తిమ్మమ నానాడు
చెల్లిని నీవు చూచుచుండుము — తల్లిదండ్రి నీవై ॥తందాన తాన॥

మరపురా మన ఇంటి దేవుని – తిరుపలయ్యా నెపుడు ॥తందాన తాన॥
ఏడు పేటన తిరుపల వెళ్ళి – మొక్కులు చెల్లించు
అనియు తల్లియు తండ్రియప్పుడు – కన్నులు మూశారు
తల్లిదండ్రుల సందేశమును – చెల్లికి చెప్పాడు
చెల్లిని చూచి భోరుభోరున – నేడ్వసాగినాడు
బాలవీరుడూ నారాయణుని – ఊరడించినాడు
అన్నకన్నుల నీరు తుడిచెను – చెల్లెలు తిమ్మమ్మ
అన్నకు చెల్లి చెల్లికి అన్న – చింతదీర్చుకొనిరి
అంతా యింతా విధివ్రాతే యని – ఊరడించుకొనిరి
రా వా రామ జై రామయ రామా – రామా రఘురామా
ఎందుకయ్యా యీ జీవుల కింత వ్యదను గూర్చినావు ॥రామ రామ॥

వ॥ ఆ విధముగా ఒకరినొకరు ఊరడించుకొన్నవారై – అన్నాచెల్లి తల్లిదండ్రులాదుల అంత్యక్రియలను జేసి, వారు కడసారి గట్టిన ముడుపులను తీసుకొని, అందరూ తిరుపల యాత్రకు వెళ్ళి తల్లిదండ్రుల కోరిక మేరకు ఏడుకొండలవాని హుండీలో సమర్పించుకొని స్వామిని సేవించుకొనిరి. ఇలవేల్పులగు అలివేలు మంగమ్మ–వెంకన్నలో తమ తలిదండ్రులగు మంగమ్మ వెంకటప్పలను చూచుకొని స్థిమితపడిరి. తిరుపతిలో వున్నపుడు వారికి, బాలవీరునికి సాధుకొండ వీరన్న గవులలో గన్పించిన అజ్ఞాతయోగి, గోగర్భములో గనుపించెను. తిమ్మమ్మ బాలవీరుడు, నారాయణుడు యోగికి ప్రణమిల్లిరి. అజ్ఞాతయోగి శాశ్వతనివాసమెద్దియని బాలవీర దంపతులు ప్రశ్నించినపుడు, యోగి, విశ్వమంతా తనకు శాశ్వత నివాసమేనని – ఎక్కువ రోజులు శ్రీశైలములో శ్రీ శంకరాచార్యులు తపము చేసుకొన్న పాలధార, పంచధార ప్రాంతములో నుంటానని చెప్పిన వాడాయెను.

—: తిమ్మమాంబ కర్మ కౌశలము —

యోగి దర్శనం తిరుపల యందు – తిమ్మమాంబకపుడు ॥తందాన తాన॥
పూర్వ జన్మము చేసిన పుణ్యము – పండినట్టులయ్యె
యోగి స్పర్శతో తిమ్మమాంబకు – ఏన్గు బలము వచ్చె
ఒకని దీవెన బ్రహ్మదీవెన – యనుచు భ్రాంతి గద్దె
జన్మ దుఃఖము జరయు దుఃఖము – దుఃఖము శఃజగతి
బుద్ధుని దొరలు దలచుకొన్నది – తిమ్మమాంబ యపుడు ॥తందాన తాన॥

వైరాగ్యముతో వివేకములతో – ధైర్యము కలిగింది ॥తందాన తాన॥
యోగిని చూచిన నాటినుండియు – తిమ్మమాంబయోర
వీరనారియై భారతావని – వెలయ వలయుననియు
నిశ్చయించెను నిర్మలమ్ముగా – తిమ్మమాంబ మదిని
స్వాతంత్ర్యమును సమర్థమ్మును – సాధించాలనియు
నిశ్చయించె నీ విధముగ తిమ్మమ్మ – తిరుమలందెనాడు
తిరుమల నుండి వచ్చిననాది – తిమ్మమాంబలోన
కలిగెనెన్నియో అపూర్వ శక్తులు – అప్రయత్నముగనే
తామరాకున నీటి బొట్టుగా – సంసారమునందు
అంటీ అంటక అన్ని పనులూ – చేయుచుండినాది
భర్తనుగోరి కర్రసామును – కత్తిసామునపుడూ
విలువిద్యలను మల్లయుద్ధమును – మెల్లగ నేర్చింది
గుఱ్ఱపుస్వారి రథము తోలుట – సేద్యము పనులన్ని
బాలవీరుని సారథ్యముతో – నేర్వగల్గినాది
జీవిత యాత్రకు అన్ని విద్యలూ – అవసరమున్నాది
సత్యభామగా, రుద్రమదేవిగ – రూపు దిద్దుకొనియె
తోడి కోడలు ఎంగమునెమ్మా – తోడుగ నిల్చింది
ఎంగమునెమ్మ – వెంకటరాజా ధర్మపత్ని యండి
వెంకటరాజు బాలవీరుని – పెద్ద తమ్ముడండీ
రంగరాజుకు పెద్దకొడుకు – యీ వెంకటరాయుడు
అన్నదమ్ములు ఇద్దరునాడు – రామలక్ష్మణులుగా
సంస్థానమ్మను చక్కబెట్టిరి – సర్వ వేళలందు
తిమ్మమాంబకు ఎంగమునెమ్మ – ఎప్పుడు తోడుండు
అక్కచెల్లియనిరి వారిని – నిజముగ ప్రజలంత
ఎంగమునెమ్మా తిమ్మమాంబకు – ఎన్నో విద్యలను
సేద్యము పనులను నేర్పించినది – చెలిమి తోడనాడు
యీ పరిణామము అద్భుతమైనది – తిమ్మమాంబయందు
బాలవీరుడు గ్రహియించాడు – తిమ్మమాంబ ఘనత
రామ రామ జై రామయరామ – రామా రఘురామా
నీమ భక్తుల కెన్నడుగాని – శుభము గల్గునయ్యా ॥తందాన తాన॥

## —: మహావీరుడు బాలవీరుడు - తిరుమలమ్మ సంస్థాన పరిపాలన :—

బాలవీరుడు ధర్మవీరుడై — ధరణిలోన వెలసె ॥తందాన తాన॥
ఆశ్రయించిన వారికెప్పుడును — తిమ్మమాంబదేవి
కల్పతరువురా కర్మదేవిరా — తిమ్మమాంబనాడు
అన్నదానము అన్నివేళల — సల్పును తిమ్మమ్మ
దీనులనెందరొ దరిచేర్చింది — బ్రతుకు తెరువు చూపి
రోగులకున్న యోగులకున్న — మేలు జేసినాది
బాలవీరుడు శాస్త్రవేత్తయే — వ్యవసాయము నందు
వ్యవసాయంబున నెన్నో పనులను — పరిశోధించాడు
ఎన్నో బావులు త్రవ్వించె — సంస్థానమందు నాడు
చాలా చెరువులు గట్టించారు — ప్రజల మేలు కొరకు
నెలకు మూడు వర్షాలు కురిసెను — వారిపాలనమున
ఈతి బాధలు లేవు ప్రజలకు — నెప్పుడయిన గాని
గోగణాలను వృద్ధి చేసిరి - గోపాలకులయిరి
పాడిపంటలు బాగుగ పండగ — పండగయ్యేనాడు
పంటపొలములు బాగుచేసిరి - పంచి ఫలితమాయె
పనులు బాగా పంచినారు — ప్రజల బాగుకొరకు ॥తందాన తాన॥

వ: బాలవీరుడు దానధర్మ పరోపకారియేగాక, చిన్ననాటినుండి మహావీరుడు - బాల్యములో వేటకు వెళ్ళిన వీరుడు తన గోవులను, చంపుచున్న పులిని అవలీలగా వధించినాడు. పెరిగి పెద్దవాడయిన తరువాత తన కోటపై దండెత్తి వచ్చుచున్న తురకల దండును తనకున్న కొద్దిపాటి భటులతో కనుమలోనె ఎదిరించి తరముగొట్ట గలిగినాడు.

తూర్పుననుండి తురకల దండు - రాత్రిపూట రాగా ॥తందాన తాన॥
వేగులవలన విషయము దెలిసి —బాలవీరుడప్పుడు
తనకు వుండిన కొంతబలగము — తోడపెట్టుకొనియు
కనుమలోన ఒక ఇసుక దారిలో - పొంచుకొనియు వుండి
తురకల బలగము నెదురించెను తన — శక్తి యుక్తి కొలది
తత్తర బిత్తర చెందిన తురకలు - ఉక్కిరి బిక్కిరియై
అల్లా అల్లా బిస్మిల్లా యని — పరుగులు దీశారు
రాజ్యంబుపై తురకదండును - పరాభవము చేసి ॥తందాన తాన॥

పరిమితమైన తన బలగముతో - పెద్ద దండు తరిమె ॥తందాన తాన॥
పాలేగారు వచ్చినాడయా - ప్రసంశించినాడు
పాళెములోన పెద్ద వీరుడని - పొగిడినాడు బాగా
కోరగల్లుకు బాలవీరుని - పిలువనంపినాడు
ఆస్థానములో పట్టాకత్తిని - బహుమతి యొసగాడు ॥తందాన తాన॥

వ॥ అంతేగాక ఆనాటి సభలో నాయుడు బాలవీరునికి వీరయ్య నాయకుడని బిరుదు ప్రదానం చేసి సన్మానం జేశాడు. ఇక బాలవీర దంపతుల ప్రణాలికలు పరోపకార్యాలింకా యెలా వున్నాయయ్యాంటే....

మామిడి తోటలు జామతోటలు - దాగుగ వేశారు ॥తందాన తాన॥
చింతవనము నేరేడు వనములు - నేర్పుగ పెంచారు
అరటితోట నానిమ్మ తోటలు - దండిగ వేశారు
ఫలవృక్షాలను పెంచి తియ్యని - ఫలములు పంచారు
సంస్థానమ్మున సంపద నిలిపి - సర్వ జనులకున్ను
సుఖ సంపద తులతూగగ - ప్రజలను ఉద్ధరించినారు
అందరు మనకూ వారికి మనము - కావలెనన్నారు
ఆందలమెక్కియు క్రిందివారిని - ఆదుకొనిరివారు
అందరిమేలు తమ మేలనిరా - మదిని దలచినారు
రామరాజ్యము వారి రాజ్యము - రమ్యమైన దండి
రామ రామ జై రామయ రామ - రామా రఘురామా ॥తందాన తాన॥

వ॥ ఇట్లు బాలవీరుని సంస్థానములో - తిమ్మమాంబ మంత్రాంగములో సర్వేజనా సుఖినోభవంతు! లోకా సమస్తా సుఖినోభవంతు! అన్నవారి మతములో సర్వులు సుఖించారు.

**— అపర దుర్గ తిమ్మమ్మ - అపర సత్య ఎంగమునెమ్మ ;—**

వ॥ ఇట్లు గంగరాజుల సంస్థానము సిరిసంపదలతో రామరాజ్యముగా నుండగా, ఒకనాడు గంగరాజులు కదిరిలో శ్రీ నరసింహస్వామి వుత్సవాలకు మగవారు వెళ్ళివుండగా - అదను జూచి గుద్దెల మేయాలనుకొన్న దివిటీ దొంగలు అర్ధరాత్రి గంగరాజులకోటను దోచుకొనుటకు ఎట్లా వస్తున్నారంటే.. ....

—: పిల్లన గ్రోవి పాట :—

డెబ్బై ముగ్గురు దొంగలురా – గుర్రాలమీదను ఎక్కారురా ॥ఓరయ్యో దొంగాలురా॥
కండలు దిరిగిన వారందరు – కోరమీసాలతో వున్నారురా
యమభటులవలె వారు వున్నారురా – దివిటీలు చేబట్టియున్నారురా
కసరత్తు చేయుచూ వచ్చారురా – కత్తులు దిప్పుతు వున్నారురా
విల్లంబులను గలిగియున్నారురా – మత్తుగ ఒత్తుగ తాగారురా
వేగంబుతో వారు వస్తున్నరూ – మీసాలు మెలివేయుచున్నారురా ॥ఓరయ్యో దొంగాలురా॥

వ॥ ఈ విధముగా వుత్తరాదినుండి వచ్చు దివిటీ దొంగలను, వేగులవారు ఏగి రాతికొండ కుప్పమీది నుండి గమనించినవారై పిల్లనగ్రోవిని వూదుచూ యీ వార్తను పై విధముగా గంగరాజులకోటకు పంపుకొన్నవారైరి. ముందే వేగుల వారివలన దొంగల వార్త దెలిసికొన్న తిమ్మమాంబ కోటను మూయించి విశ్వాస పాత్రులయిన కొందరు భటులను కొడవళ్ళతోను, బల్లెములు, కత్తులతోను కావలిఉంచి, కోట కంతల దగ్గర తాను, తోడికోడలు ఎంగమునెమ్మా, విల్లంబులను వింటిదబ్బలను తీసికొని యుద్ధానికి సిద్ధముగా వున్నారు. మిగతా తోడికోడండ్రు స్త్రీలు, నూనె కాగనెట్టుకొని కారపు పొడి కుండలలో వేసుకొని, అనువైన ప్రదేశాలలో అణగి యున్నారు. మరికొందరు స్త్రీలు, బాల బాలికలు వడిసెలరాళ్ళను వేయుటకు వాటమైన స్థలములో పొంచివున్నారు. కొందరు స్త్రీలు తిమ్మమ్మకు, ఎంగమ్మకు బాణాలను, రాలను అందించుటకు కాచుకొని యున్నారు.

వచ్చిన దొంగల చూచినాదిరా – తిమ్మమాంబ యపుడూ ॥తందాన తాన॥
కారుమబ్బులో దివిటీ వెలుగులో – దొంగలు కనబడగ
గుర్రములను దిగి దివిటీ పట్టుకు – తయారు యగువేళ
ఎంగమునెమ్మకు ఎక్కిడమన్నది – సైగలు చేసినది
వదిలెనురావో నూరు వాణముల – తిమ్మమాంబయపుడు
ఎంగమునెమ్మ వేసెను రాళ్ళను – వింటిదబ్బ నుండి
చుర చుర చురమని జర జర జరమని – బాణాలంతటను
దొంగలు తాము ఆగినప్పుడు – నొక్కటొక్కటీగా
దొంగకు ఒక్క లెక్కన బాణం – దూసుకు పోయింది
దొంగ కంటికి ఒక్క రాయిగా – వింటిరాయి విడిచే
తోడికోడలు వెంగడు వేసెను – రాలను రయముగను ॥తందాన తాన॥

టప్ టప్ ఢమ్ ఢమ్ పటపటమనిరాల్ – తగిలె దొంగలకును ॥తందాన తాన॥
బాలదాలికల్ వడిసెలరాలను – వేసిరి రయముననూ
వడిసెల రాళ్ళు వర్షముగాను దొంగల పైబడగా
వానర సైన్యం బాలబాలికల్ – వడివడిగా వేసి
తక్కిడి బిక్కిడి చేసి దొంగలన్ – తరుమునట్లు చేయ
ఎంగమాంబయు సత్యాదేవిగ – విక్రమించెనాడు
తిమ్మమాంబయా దుర్గాదేవిగ – దొంగలదునుమాడె
విప్పులు గక్కుచు కాళీ దేవిగ – కధను తొక్కినాది
గుర్రక్క దిప్పుకోలేక దొంగలు – గుంజిలు పెట్టంగ
గుర్రములను దా పట్టుకోనుటకు – గునక పరువుతోన ॥తందాన తాన॥
శంఖము వూదెర – తిమ్మమ్మా సై
శరము పట్టెరా – తిమ్మమ్మా సై
మాట లేదురా – వేటుముందు సై
పోటు వీరుడు – పనికిరాడు సై
బాణాల్ విడిచెను – తిమ్మమ్మా సై
దుర్గాదేవిగ – గానుపించె సై
కాళీదేవిగ – అగ్గిగక్కె సై
కాలయమునిగా – కానుపించె సై
దొంగలు దౌడు – తీసిరన్న సై
ఎంగమాంబయూ – దీసిపోదు సై
సత్యభామవలె – ఆయమ్మా సై
ఆడ నాగుగా – బుసలు కొట్టె సై
ఆడ సింగమూ – అన్నట్లు సై
ఆకలిగొన్న – సింగమురా సై
ఫట ఫట ఫటమని – పండ్లు కొరికె సై
బిరబిర బిర రాలను – దీసినాది సై
దొంగల వేసెను – వింటి దబ్బ సై
వీర విహారము – చేసినాది సై ॥తయ్యక తద్దిమిథ॥

వ॥ రాణి సంయుక్త, రాణి రుద్రమ్మకూడి యుద్ధము చేసినట్లుగా తిమ్మమాంబ, ఎంగమాంబ దొంగలను దునుమాడుచుండ, దొంగల గతి ఎట్లా వున్నదయ్యా అంటే........

గుక్క దిప్పుకోలేక యున్నారు – గుడ్లు బిక్కరించ ॥తందాన తాన॥
శరవేగముతో దగులుచున్నవి – రాళ్ళు అంతటాను
శరములు వడివడి నెక్కడదగులునో – తెలియకున్నదాయె
వంగిన లేచిన నిలబడితేను – వెన్నంటెను వర్షం
శిలావర్షము శరవర్షంబును – దాకెను దొంగలకు
కుక్కలు కొల్లలు వారిమీదను – కలబడెనప్పుడును
కుక్కల గూటిబయలు కోట యని – దొంగలు అరిచారు
ఉక్కిరి బిక్కిరి యైరి దొంగలు – మత్తు వదిలిపోగా
వారి విల్లును ఎత్తి పట్టగ – లేరు దొంగలప్పుడు
వారివిల్లును ఎక్కుపట్టగ – లేరు వారు అప్పుడు
వారి కత్తిని చేత బట్టగ – చేతగాక యప్పుడు
వారివె దివిటీల్ వారె పట్టుక – కాల్చుకొన్నారయ్యా
వారివె దివిటీల్ వారిని చూపెను – అర్ధ రాత్రిలోన
బ్రతికి యున్న బలుసాకు దినియును – బ్రదుకవచ్చునాని
జ్వరము వచ్చెను చెమటలు పట్టెను – దెబ్బ దొంగలకు
పెండ్లాం బిడ్డల మొగము చూతుమా – ఇంక మేము యనుచు
తలలకు దెబ్బలు చేతుల దెబ్బలు – తగిలెను ఎందరికో
కాళ్ళు విరిగెను కన్నులు లొట్టలు – కుంటి గుడ్డియైరి
ఉడాయించిరి మోడాలెక్కి – పారిపూసుకొనుచు
కుక్కలు ఎన్నో వెంటనంటి వారి – దరుముకుంటు పోగా ॥తందాన తాన॥

వ॥ ఈ విధముగా సరళ స్వభావమైన తిమ్మమ్మ. దుష్టులయెడ అపర దుర్గగా, తన పొలాలలో, కోటలో దొంగలు పడినపుడు - ఆశ్రితులకన్యాయము జరిగినపుడు, తాము పాళెగాళ్ళము గదాయని పెత్తనము చెలాయించినపుడు - గంగరాజుల సంస్థాన విషయంలో ఎవరయినా జోక్యము చేసికొన్నప్పుడు, స్త్రీ - బాల వృద్ధులను గోవులను సాధువులను దుర్మార్గులు బాధించినపుడు – దోపిడి దొంగలు తారసపడినప్పుడు – దివిటీ దొంగలు దిగి వచ్చినప్పుడు, తిమ్మమ్మ కాళికాదేవివలె కదను తొక్కను – అపర దుర్గగా నవతరించి ధర్మ రక్షణ చేసింది. (ఈ సంఘటనము వల్ల తిమ్మమ్మగారు, ఎంగమునెమ్మ స్వయముగా వీరవనితయే గాక, తక్కువ బలముతో ఎక్కువ మందిని ఓడించగల యుద్ధ తంత్రజ్ఞురాలనుట స్పష్టమాయెను).

హాస్యం: వీరన్న: (గట్టిగా అరుస్తూ) డొక్క చీరేస్తాను — పళ్ళు పీకేస్తాను
సుబ్బన్న: ఒరే వీరన్న నీకేమైన పిచ్చి పట్టిందిరా — అట్లా అరుస్తావ్
వీరన్న: పిచ్చిగాదురా, దివిటీ దొంగలిక్కడికి రాకుండ తరుముతా
నాకొడకల నా మొద్దు కత్తివ్వరా.
సుబ్బన్న: ఓరే వీరన్న నిద్రపోకు — కలవరించకు, దొంగలిపుడు గాదులే వాళ్ళను
ఏ కాలములోనో తిమ్మమ్మ తరిమివేసిందిలేర — దొంగలొచ్చిన ఆరు
నెలలకు కుక్కలు మొరిగినట్లుంది నీ కథ.

## —: బాలవీర దంపతులు - తీర్థయాత్రలు :—

వ॥ గూటిబయలులో నున్న రామాలయానికి, ఓబులేసుని గుడికి అర్చకుడు గావలసి యుండెను. తిమ్మమ్మ కిష్టమగు నోములు, వ్రతములు జరుపుకొనుటకు తన తండ్రి జీవిత కాలములోనె విద్యావయో వృద్ధుడగు నొక బీద బ్రాహ్మణుని, అంజనేయశాస్త్రిని బుక్కపట్నము నుండి రప్పించుకొని యుండెను. అతనికి గొల్లవాని కుంటముందర నొక పట కుటీరమును నిర్మింప జేసెను. ఈ వృద్ధ బ్రాహ్మణుడు బాలవీర దంపతులకు పూజ పునస్కారములకే గాక ఎన్నో దాన ధర్మ పరోపకార విషయము లందు శ్రీరామునకు వశిష్టునివలె సూచనలిచ్చు చుండెను. బాలవీరుడు ఆ సద్బ్రాహ్మణునకు కొంత భూమిని ఇనాము ఇచ్చెను. ఆ భూమి ఇప్పటికీ బ్రాహ్మణ భూమిగా, బాపన చేనుగా పిలువబడుచున్నది. చాలా కాలముగా సంతానము లేని తిమ్మమ్మ ఆంజనేయ శాస్త్రిగారి సలహా ప్రకారము బాలవీర దంపతులు తీర్థయాత్రలు తలపెట్టిరి. ఒక గుర్రపు బండిలో ఇద్దరు భటులను రొక్క రోజనాలను దీసుకొని, ఒకానొక సుదినమున విఘ్నేశ్వరుని పూజించిన వారై...

బాలవీరుడు తిమ్మమాంబతో — తీర్థయాత్ర వెళ్ళి ॥తందాన తాన॥
కదిరి నృసింహస్వామిని గొల్చిరి — మొట్టమొదట వారు
అహోబిలము, మహానందికి — యాత్ర వెళ్ళినారు
తీర్థములోన స్నానము చేసిరి — సంతానము కొరకు
విజయనగరము చేరిరంతట — విరూపాక్షు గొలువ
విద్యానగరము వైభవమ్మును — వింతగ చూశారు
కిష్కింధ ప్రాంతము వాలికాష్టమును — వారు చూచినారు
అచ్చట తాము బంధువులింట — బసలు జేసినారు
గంగరాజుల ఇలవేల్పగు — శ్రీ శైలవాసు గొలువ ॥తందాన తాన॥

ఆచ్చటినుండి పయనమాయిరి – శ్రీ శైలమ్మునకు ॥తందాన తాన॥
దక్షిణదేశపు కైలాసముగద – శ్రీ శైలమ్మనుచు
శ్రీ శైలమ్మును గాంచినవారికి – మరల జన్మ లేదు
శ్రీ శైలములో శివ పార్వతులు – వెలసినారు కాన
భ్రమరాంబమ్మకు బాగుగ వారు – పూజలు చేశారు
మల్లికార్జునుని మ్రొక్కి వేడిరి – మిగుల భక్తితోను
కృష్ణానదిలో స్నానము చేసిరి – కృష్ణ కృష్ణయనుచు
పాలధారకు పంచదారకు – పయనము అయ్యారు
పాలధారలో పంచదారలో – గ్రుంకులిడిరివారు
గురువునక్కడ వెదికిరివా – రజ్ఞాత యోగి కొఱకు
యోగిని ఒక్క గుహలో వారు – జూచినారు అంత
కొన్నినాళ్ళకు కళ్ళు దెరచెనా – యోగివర్యుడప్పుడు
సతిపతు లిద్దరు సాగిలబడిరి – యోగివర్యునెదుట
కన్నులు దెరచిన యోగి వారికి – దీవెనలిచ్చాడు
సంతానమ్ము గల్గునుగాని – సౌఖ్యముండదనియె
సంతానమ్మన బిడ్డలెకాదు – మంచి కార్యములును
మనిషి చేసిన మంచి కార్యమె – సంతానమ్మనియె
తామరపాకున నీటిబొట్టువలె – కదులు జీవితములు
మానవసేవయె మాధవ సేవని – యోగివర్యుడనియె
మిమ్మ మీరుగా ఉద్ధరించుటె – గీతబోధ యనియె
యోగి యాజ్ఞను తలను దాల్చియా – సతిపతులిద్దరునూ
యాత్రల నుండి మరలివచ్చిరి – సంస్థానమ్మునకు ॥తందాన తాన॥

— ఈశ్వరమల శిఖరారోహణము – విశ్వరూప సందర్శన యోగము :—

మొలకల పూర్ణిమ వచ్చిందపుడు – మొలకలు పోశారు ॥తందాన తాన॥
మొలకలు పెంచి మొలకను నోమి – పండుగ చేశారు
ఈశ్వరమల ఆట వెలసియున్నది – గూటిబయలులోన
అంత ఎత్తగు కొండ శిఖరము – వేరు లేదు చెంత
శిఖరమె ఈశ్వర లింగమాయెను – ఈశ్వరమల యందు
అందుకె ఈశ్వరమల యని కొండకు – పేరు వచ్చెనండీ
గంగరాజులు మునుపొకపుడు – కొండనెక్కువారు ॥తందాన తాన॥

శిఖరమునెక్కి శివుని లింగ – మభిషేకము చేతురుగా ॥తందాన తాన॥
లింగము వంటి స్తంభమున్నది – శిఖరముపై నండి
ఈశ్వర లింగము అనియు కొలుతురు – శైవులు శిఖరమును
వైష్ణవులదియే నారసింహుని – స్థానంబనియెదరు
నారసింహుడే స్తంభమనుచును – భక్తిని గొలిచేరు
హరియేగాని, హరుడేగాని – ఒక్కడె, దైవముగా
హరిహరనాధుని తత్వము ఇదియే – తెలిసిన వారికిని
శివుడేగాని విష్ణువేగాని – చింతలేదు మాకు
అందుకోసమై తగువులాడుచే – తప్పని తెలియండీ
గంగరాజులు ప్రతి యేడాది – శిఖరము ఎక్కేరు
శివుని లింగము అభిషేకించియు – పూజలు చేసేరు
శివాభిషేకము చేసినంతనే – వర్షము గురిసేను
పూర్వులనుండి వచ్చుచుండె – ఈ పుణ్యాచారములు
అభిషేకముతో పూజలు చేసి – గంగరాజులపుడు
స్తంభముపై నఖండ్లలోన – గంధపు చెక్కలతో
ఆవునేయిని ఎండు కొబ్బరి – అందు వేయువారు
వేసి జ్యోతిని వెలిగించేరు – యజ్ఞముగా వారు
శివునికున్న యా జ్ఞాన జ్యోతికిది – సమమే యన్నారు
జ్యోతిని చూచిన వారికి జ్ఞానము – ముక్తి కలుగుననిరి
ఎంతో దేశముగాను పించురా – చుక్కవలెను జ్యోతి ॥తందాన తాన॥

వ॥ ఈ విధముగా మొలకల పూర్ణిమనాడు గంగరాజులు బంధుమిత్ర సపరివారముతో ఈశ్వరమల శిఖరమునధిరోహించి హరిహర నాధుని సేవించి యజ్ఞయాగాదులు చేసి దేశము సుభిక్షముగా నుండుటకు సర్వేశ్వరుని ప్రార్థించేవారు. అందుకే బాలవీరుడు బావ నారాయణుని పిలిపించుకొని తాను సతీసమేతంగా బంధుమిత్రాదులతో ఈశ్వరమల ఎక్కి జోతిని వెలిగించి సర్వేశ్వరుని ప్రార్థించిన వాడాయెను.

రామ రామ జై రామయరామా – రామా రఘురామా ॥రాఘు రామ॥
రైవత శాద్రికి కృష్ణుడునాడు – పూజలు చేసెనుగా
గోవులనదియే కాపాడుననయని – గొల్లల్లు కొలిచారు
ఆ విధముగనే గంగరాజులు – ఈశ్వర శిఖరమునూ
ఎక్కి పూజలు చేయుటకేమో – కొండము ఎక్కారు ॥రామ రామ॥

శిఖరమునెక్కిన గంగరాజులు – తిమ్మమ కానాడు ॥రామః రామః॥
ఎంతో దేకము గాననాయెరా – ఒక్కసారిగాను
కొండలు కోనలు నదులూ విధులూ – ఒక్కటేమిటయ్యా
శేషాచలము. గండిక్షేత్రము – సింహాచలమున్ను
శ్రీ శైలమును అహోబిలమును – తిరుమల కొండలునూ
మదనపల్లి పెన్గొండ కొండలు – మల్లప కొండలునూ
దక్షిణాదిన అమని కొండ – అదిగో అల్లదిగో
బుక్కపట్నము ధర్మవరమ్ముల – చెరువులు యల్లదివో
పంటపొలములు పట్టణంబులు – సముద్రాలు గూడ
కోటలు తోటలు రంగు రంగుల – ఇంద్రధనుసు యదిగో
కోటలు కొండలు నదులూ వనములు – అగపడుచున్నవిగా
నెమలి కేకలు కోయిల పాటలు – వినపడుచున్నాయి
జింకల గుంపులు చెంగున నెగురుచు – కనపడుచున్నాయి
మలయమారుతము చల్లగ వీచె – మంచి గంధములతో
కమ్మని చల్లని మెల్లని గాలి – మైమర పిస్తాది
విశ్వమంతయు వేడుకగాను – కనులకు గాన్పించె
శిఖరమునుండి చూచువారి – కది విశ్వరూపమండి
మధుర మోహనము విశ్వరూపము – వింతగొల్పునండీ
అందరి మనసులు మరలు గొల్పెడి – విశ్వరూపమండీ
విశ్వరూపమును చూపినాడు శ్రీ – కృష్ణుడు నాడండీ
అర్జునుడొక్కడె చూచెనండీ – ఆనాటి విశ్వరూపం
ఈశ్వరమలను ఎక్కిన చాలును – మనకు గాననగును
విశ్వరూప సందర్శన యోగము – విశదముగను నిజము ॥రామ రామ॥

---

[ ఇచ్చట టెంకాయలుకొట్టి కర్పూరము వెలిగించవలెను ]

వ॥ ఈశ్వర మల శిఖరము మీద బాలవీర దంపతులు సాయంకాలము శివుని అభిషేకించి యజ్ఞము చేసినవారై, రాత్రియందు జ్యోతిని వెలిగించిన ద్వేశ్వరుని ప్రార్థించిరి. అందరూ ఆనాటి రాత్రి భజనలు పురాణకాలక్షేపములు చేసి అచ్చటనే నిద్రించి మరునాడుదయముననే దిగివచ్చిరి. కాని తిమ్మమాంబకు ఆనాటి విశ్వరూప సందర్శనము మరపురాని మధురస్మృతిగా మిగిలిపోయినది. (ఇక మిగిలి పోయిన కథ గుండె పగిలి, పొగిలి పోయిన ఆమె వెత తలచుకొంటేనే తల తిరిగిపోతుంది, వ్యథ గల్గుతుంది. తర్వాత కథ ఎలా సాగిందో మళ్ళీ చెప్పుకుందాం)

# ( ద్వితీయ భాగము )

—: తిమ్మమ్మకు సంతాన ప్రాప్తి - సంతానము చెల్లి పోవుట :—

వివాహమయిన పదునారేడులు - జరిగి పోయెనండి ॥తందాన తాన॥
తిమ్మమాంబకు కడుపున కాయగ — ఆశలు చిగురించె
ఆరవ మాసము నిండినంతనే — అన్నవచ్చి చూచె
సీమంతమ్మును జరుపుటకాతడు — చెల్లిని పిలిచాడు
అన్న బాధలు తెలిసిన తిమ్మమ — రాలేనని అంది
వదిన పుట్టము తన్ను చూచిన - ఓర్వలేదు అంది
అయినా అన్న నారాయణుడు - అదికాదన్నాడు
చెల్లిని బావను బిలుచుక వచ్చెను — బుక్కపట్నమునకు
ధర్మవరానికి పోయి పంచివి — చీరలుకొని తెచ్చె
చీరలు రవికెలు గాజులు చెల్లికి - తొడిగించాడయ్యా
తల్లిదండ్రులిక తానే అని - సీమంతము జరుపంగ
పేరంటాళ్ళను పిలిచినాడయా — భార్యను బ్రతిమాలి
ఎటులో విధముగ సీమంతమును - జరిపినాడు బాగా
కాన్పుగూడ తన ఇంటిలోననె — జరగాలన్నాడు
అన్న బాధను తెలిసిన తిమ్మమ — అది కాదని పలికె
తాను లేనిచో సంస్థానమ్మే — చెడునని తెలిపింది
భర్తయు తాను గూటి బయలుకు - బయలు దేరినారు
నవమాసములు నిండి నంతనే — తిమ్మమాంబకపుడు
చక్కని పుత్రుడు జన్మించాడు - పండువంటి బిడ్డ
పుత్రోత్సాహము గల్గెను తండ్రికి — బాలవీడునకును
లేక లేక యాబిడ్డ పుట్టిన — సంబరమున అతడు
బీదసాదలకన్న దానము - ఉత్సవములు జరుప
పండుగాయెను సంస్థానమున — ప్రజల కందరికిని
కన్నుగుట్టెను కాని వారికి — సంస్థానమునందు
నారాయణుడు వచ్చినాడు తన — అల్లుని చూచాడు
సంతస మందెను అంతరంగమున — మేనమామ తాను
బావను చూచిన బాలవీరుడు — నవ్వులాట కొరకు
బావా! మీరిక కూతును. తప్పక — కనవలెనన్నాడు . ॥తందాన తాన॥

హాస్యం: రామన్న: ఒరే ఇప్పుడు ఆపరేషన్ జేస్తె మగవాల్లుగూడ బిడ్డలు కనవచ్చునంటగదరా
రంగన్న: అవునంటరా, నువ్వేమన్న కంటవా, ఆడబిడ్డపుడితే నాకు పుట్టబోయే కొడుక్కివ్వర.

వ॥ ఈ విధముగా తిమ్మమాంబకు పుత్రుడు జన్మించగానే పున్నామ నరకం తప్పెనని బాలవీర దంపతులు సంతసించినారు. నారాయణుడు రెక్కలు గట్టుకొని వచ్చి చెల్లిని బిడ్డను చూచి సంతోషించినవాడై తనకు కూతురు లేదేయని చింతించాడు. బాలవీర నాయకుడు పుత్రునికి తన తండ్రిపేరు మామపేరు గలిసి వచ్చునట్లు వెంకటరామరాజని నామకరణము చేసినాడు. నాలుగేండ్లు గడచినది.

అంతలోనె ఆ తిమ్మమాంబకు – కూతురు గలిగింది ॥తందాన తాన॥
తండ్రి పేరును, అత్త పేరును – అమ్మ పేరు కలిపి
వెంకటమాలక్ష్మియన్నది – తిమ్మమాంబ యపుడు
పుట్టిన బిడ్డ పెరుగుచున్నది – నెలవంకయి వెలసీ
ముద్దుల బిడ్డ వెంకటలక్ష్మి – వెంకటేశు కరుణ
అన్నను రమ్మని చెప్పలేదు – ఈసారి తిమ్మమాంబ
తిరుమలమ్మకు అన్న బాధలు – అన్నీ తెలియునుగా
రామ రామ జై రామయ్య రామా – రామా రఘురామ ॥తందాన తాన॥

వ॥ తిమ్మమ్మ యంటే సరిపడని పుట్టమ్మ భర్త తరచు వెళ్ళి చెల్లిని చూచి వస్తూ ఇల్లంతా గుల్ల చేస్తాడన్న బాధతో పొవద్దని పోట్లాడేది. చెల్లిని చూడకుండా ఉండలేని నారాయణుడు వ్యాపారమనియో, పెనుకొండలో రాచకార్యమనియో ఏదో ఒక నెపముతో గూటిబయలుకు వెళ్ళి చెల్లిని చూచి వచ్చేవాడు. కాని అన్నబాధలు తెలిసిన తిమ్మమ్మ అన్నకోసం కబురు పెట్టేదికాదు. గయ్యాళి భార్యతో నారాయణుని కష్టాలిట్లుండగా ఇక్కడ గూటి బయలులో...

ఆరు ఏండ్ల వాడయినాడయ్యా – తిమ్మమాంబ కొడుకు ॥తందాన తాన॥
ఆటలాడుచూ బాలుడుండగా – పాముకాటు విషమో
పెట్టిన విషమో మరియే విషమో – దెలియగ రాలేదు
నీరు వల్లము ఎరుగును లేర – నిజము దేవుడెరుగు
నురగలు గ్రక్కుచు బాలుడప్పుడు – చెల్లిపోయినాడు
పిడుగులు నెత్తిన పడినట్లయ్యెను – తిమ్మమాంబకపుడు ॥తందాన తాన॥

చంద్రమతియు తా లోహితాస్యుని – చావు చూడలేదా ॥తందాన తాన॥
ఎంత వారికీ తప్పదురా – ఈ కర్మ ఫలము బాబు
పెను తుఫానులో పడవ మాదిరి తిమ్మమాంబ బ్రతు...
ఊగిసలాడెను చావు బ్రదుకుల – మధ్య తల్లడిల్లె ॥తందాన తాన॥

వ॥ ఇట్లు బాలవీర దంపతులు పుత్ర శోకమును భరించలేక దుఃఖించు చుండగ....

అంతలోన ఆ ఆరునెలలకు - వెంకటమాలక్ష్మి ॥తందాన తాన॥
సన్నిపాతము జ్వరము కలుగగా – కండ్లు తేలవేసే
గోరుచుట్టపై రోకటి పోటుగ – ఒకటి వెనుక ఒకటి
కష్టములన్నీ కట్టి కట్టుకొని - కట్టా! వారలకు
గాలిలో పెట్టిన దీపమాయెను – బిడ్డ బ్రతుకునాడు
ముద్దుల బిడ్డ బంగరు బొమ్మ – వెంకటమాలక్ష్మి
కనుల యెదుటనే కన్నులు మూసెను – కలలు కరిగిపోయె
కన్నుల నీరు కాల్వలాయెను – తల్లిదండ్రులకును
బాధలు గుండెల మండుచున్నవి – కన్ను లెండిపోయె
కర్కశమైన కడుపు కోతతో – సొమ్మసిల్లినారు
ఎవ్వరికైనా ఇట్టి బాధలు – వలదు వలదు తండ్రి ॥తందాన తాన॥

వ॥ సంసార సముద్రములోని ఆటు పోట్లకు అలవాటుపడిన బాలవీర దంపతులకు ఈబాధలు క్రమముగా కొంతకాలమునకు పాతబడినవి. పురాకృత కర్మ ఎవరికైననూ తప్పింపరానిది గదా?

—: **తిమ్మమాంబకు వైరాగ్యము కల్గుట** :—

పాలను గాచి పెరుగు చిల్కినా - వెన్న వచ్చునయ్యా ॥తందాన తాన॥
సంసార సాగరం ఆటు పోట్లకు – అలసె తిమ్మమాంబ
యోగినిగా విరాగిణి అయ్యె – యోగ్య తిమ్మమాంబ
వస్త్రా వట్టిదె పోతావట్టిదె – ఆశలెందుకన్నా?
జీవితమంతా ఒట్టి భ్రాంతియే – ఏమి మిగులు తుదకు?
తిమ్మమాంబలో అంకురించెను – జ్ఞానము వైరాగ్యం
ఏది సత్యము? ఏది నిత్యమని – చింతన చేసింది ॥తందాన తాన॥

సత్యమయినదీ నిత్యమైనది — తత్వము నెరుగుటయే ॥తందాన తాన॥
సత్య సాధనే మోక్ష సాధనం — మర్మమెరిగి తేను
కోరికలన్ని విడుచుటె యన్నా — దుఃఖము తొలగుటకు
మార్గమనియును బుద్ధుడునాడు - బోధించాడన్న
యమనియమాదులు ధ్యానసాధనమె — తనకు మార్గమనియె ॥తందాన తాన॥

వ॥ అని ఈ విధముగా తిమ్మమాంబ తలచినదియై ఆంజనేయశాస్త్రిని అడిగి ప్రాణామామాది యోగసాధనలు, వేదాంత విషయాలు తెలిసికొని, మనశ్శాంతిని గలిగి, బురదలో నుండియూ మన్నంటని కుమ్మరి పురుగట్లు విరాగియై సంసారము చేయసాగెను.

## — గంగరాజుల సంస్థాన పతనం :—

సంస్థానముపై శ్రద్ధాసక్తులు - తగ్గినాయి బాగ ॥తందాన తాన॥
తిమ్మమాంబయు బాలవీరుడు — సన్యసించినట్లు
శకుని మామలు గంగరాజుల — ఇంటిలోన గలరు
అన్నదమ్ములకు భేదముగల్పి — వేరు చేసినారు
పొరపొచ్చములు పంతాలను — గల్పించి పెంచినారు
వారి వారి అల్లుండ్లు పెద్దలు — గావలెనన్నారు
పెద్దవాడగు రంగరాజుకు — పెద్దకొడుకుయైన
వెంకటరాయుడె సంస్థానమునకు — వారసుడన్నారు
కృష్ణమరాజు కొడుకులు నాడు — కుపితులయ్యినారు
ఎవరు వచ్చినా మేము పెద్దలము - రాజాలమ్మనియు
ఒకరిది మోచేతి క్రిందనే — నీరు ద్రాగవలెనా?
కాదా విధముగ జరుగ బోదిక - ఎవరికి వారలమే
వేరు బోయిన సుఖియిస్తాము — ఎప్పటికైనాను
అనియున్నారు, కృష్ణయ కొడుకులు — అదునుకొరకు వేచి
ఒకటే ఒరలో రెండు కత్తులు - ఇమడబోవురన్నా
కత్తికి కత్తికి వేరు వేరుగా - ఒరలె ఉండవలెను
పొరపొచ్చమ్ములు వచ్చిన పిదప — నిలువదు సంసారం
అందరు పెద్దలు సంసారములో — సాగలేరు బాబు
కీచులాటతో కలతలలోనా — పనులు చేయరేమి
కుట్రలతోన కుతంత్రములతో — ఇట్లు కూలనాయె ॥తందాన తాన॥

కలసి వున్నచో కలదు సుఖమురా – కల్లగాదు నిజము ॥తందాన తాన॥
ఎవరికి వారు సర్వస్వతంత్రులు – కావలెనన్నారు
పుడతానేరా అన్నదమ్ములు – పెరుగుచు దాయాదుల్
దాయాది మత్సరందడినీవాయని – పెద్దలు అన్నారు
వినాశకాలమునందు కలుగును – విపరీతబుద్ధి
జరుగదురా ఇక జరగదింకయని – తలచెను వీరుంపు
తిమ్మమాంబతో యోచన జేసెను – తీరని వ్యదతోడ
ఎండ మావిలో నీరయ్యేనురా – వారి ఆశలపుడు
ముందు జూచిన నుయ్యివుందిరా – వెనక గొయ్యివుంది
ఎందుబోవను దిక్కుదోచక – బాలవీరుడపుడు
ఉమ్మడి యాస్తిని పంచుటకే – తానిశ్చయించినాడు
ముక్కలు చెక్కలు సంస్థానమ్మిక – చేయలేము ఏమి
సాగరమైనను నీదవచ్చు – సంసారమీదలేము
అనియు తెలిసిన బాలవీరుడు – అధిక బాధ జెందె
వెన్నెల కొన్నాళ్ళు వుండురా – చీకటి కొన్నాళ్ళు
కష్ట సుఖాలు కావడి కుండలు – కల్ల జగము నంము ॥తందాన తాన॥

వ॥ అని ఈ విధముగా పరి పరి విధముల యోచించిన బాలవీరుని ప్రయత్నాలన్ని బూడిదలో బోసిన పన్నీరాయెను. అన్న దమ్ములందరూ ఆస్తిని పంచుకొని ఎవరి బోకి వారు తీసుకొనడమే ఇక మిగిలింది. అయినా గంగరాజుల సంస్థానములో పెండ్లి గావలసిన ఆడపిల్లలు పదారు మంది వున్నారు. పెద్ద తండ్రిగారు తనపై బరువు బాధ్యతలుంచి బోయినందున వారికందరికి వివాహములు చేసి పేరు పడదామని అన్నదమ్ములకు చెప్పుకొన్నవాడై, అందరికి సంస్థానములోను బంధువులలోను తగిన సంబంధాలు చూచి ఒక్కసారిగా సామూహిక వివాహాలు నిర్వహించి తన బరువు బాధ్యతలు దించుకొన్న వాడాయెను. అయినా పెద్దతండ్రి రంగరాజు చనిపోతూ సంస్థానమును చీలిపోనివ్వ వద్దని చెప్పిన మాటను పాటించలేక వీరయ్య నాయకుడు కుంగిపోయెను.

పెండ్లిండ్లకును పేరంటాలకు – ఉన్న ధనము బోయే ॥తందాన తాన॥
చీరసారెలకు పెట్టుపోతలకు – సెలవులాయె సొమ్ము
వానలు లేక పంటలు పెట్టక – తిండికి కరువాయె
పేరు ప్రతిష్టలు మంటగలిసెను – గంగరాజులకును ॥తందాన తాన॥

గంగరాజుల సంస్థానమ్ము — గంగలోన గలసె ॥తందాన తాన॥
కొడి గట్టెనురా వారి పౌరుషం — సంస్థానముతోనె
తనకాలములో ఇట్లులయ్యెనని — బాలవీరుడపుడు
మనో వ్యాధితో లోలోపలనే — కుమిలిపోయినాడు
బాధ భరింపక పంచముపట్టెను — బాలవీరరాజు
చెట్టుకొకడుగా పుట్టకొకడుగా — విడిపోయారంత
గంగరాజుల కోటనువారె — కొల్లగొట్టినట్లు
ఉన్న యింటికె కన్నము వేసి — పంచుకొన్నయట్లు
కన్నతల్లినే కొడుకులందరు — కడుపు కోసినట్లు
హరిహరీ। అయ్యాయో తందాన — ఓ రాజనందనాన
రామ రామ జై రామయ్య రామ — రామా రఘురామ ॥తందాన తాన॥

హాస్యం: రంగన్న: (కోపముతో గట్టిగా అరచుచు) ఒరే రామన్న నీవన్నవుగాపమ్ము నేను తమ్ముణ్నిగావచ్చు - ఇంక మనకు కుదరదురా, నేనుగూడ వేరు పోతార నాకు బుర్రిస్తావా, గుమ్మితిస్తావా చెప్పు - ఇక్కడుండే వాళ్ళే మనకు పెద్దమనుషులు.

రామన్న: ఒరే రంగన్నా బుర్ర గుమ్మితి రెండూ కలసుంటేనేరా మనము కథలు చెప్పి కడుపు నింపుకుంటాము—లేకపోతే ఇద్దరూ ఎండగాల్తామురా నా మాట వినరా, నాయన!

— పుట్టమ్మ కర్కశత్వము వలన నారాయణుడు - బాధ చెందుట —

వ॥ ఇట్లుండగా బుక్కపట్నములో నారాయణుడు భార్య పుట్టమ్మతో ఎట్లా వేగుచున్నాడయ్యా అంటే........

తిమ్మమాంబ కష్టాలు చూచియు — నవ్వుకొన్నదేమి ॥తందాన తాన॥
తిమ్మమాంబకు బిడ్డలు పోతే — పుట్టమ నవ్వింది
వేరు పోయిన తిమ్మమ చూచి — సంతసించెనంత
ఒంటి కాపురం అయితే ఎప్పుడు — ఎచ్చటికినిరాదు
బుక్కపట్నము తరచు వచ్చియు — బాధలు పెట్టదుగా
ఆమెకు దగిన శాంతి బాగుగా — జరిగెనిప్పుడనుచు
ఎంగిలి చేతితొ కాకిని తరమని — పుట్టమ్మెప్పుడునూ
పొంగిపోయెతా పుట్టమ్మప్పుడు — పిసినారయ్యాయో ॥తందాన తాన॥

కథ: ఈ విధముగ నారాయణుకు కుక్కతోక బట్టి గోదారీదినట్లు పుట్టమ్మతో కాపురము ఎట్లా చేస్తున్నాడు.

భార్యాభర్తల అనుబంధము – ఏనాడు లేదు సుండి ॥తందాన తాన॥
ఎప్పుడు చూచిన భర్తను పోరే – గయ్యాలయ్యింది
పుట్టలోపలి పామైనదిరా – భర్తకు పుట్టమ్మ
ఎప్పుడు బుసబుస రుసరుస మనుచూ – కసిరి విసరుకొనునూ
ఇంటిలొ కాపురమల్లె యున్నది – ఎంచి చూడగాను
తలకు మించిన భారమాయెరా – తరుణీ పుట్టమ్మ
పెదవికీ మించిన పల్లయామెరా – పడతీ పుట్టమ్మ
పిల్లాలేదు పీచూలేదు – పీసిని పుట్టమ్మకు
గొడ్డురాలుగా గడుసుదాయెరా – గట్టిది పుట్టమ్మ
నారాయణుడా బాధ ఎవరికి – చెప్పగలడు పాపం ॥తందాన తాన॥

హాస్యం: యల్లన్న: (బాధతో) ఒరే మల్లన్న నన్నీ పొద్దెట్లన్నా కాపాడరా!
మల్లన్న: ఏమిరా నీకొచ్చిన కష్టం
యల్లన్న: పొద్దున్నే అంత పొప్పు జేయమన్నానురా – పొప్పుగుత్తి దీసికొని మా యజమానురాలు నన్ను పచ్చడి చేసిందిరా – ఇదోరా బుడపలు, కాలు విరిగి పోయిందిరా, మల్లీ నువ్వెవరితో అనద్దురా మందేమన్నా వుంటె పుయ్యరా !

—: బాలవీరుడు రోగపీడితుడగుట - తిమ్మమ్మ చికిత్సలు జేయించుట :—

వ॥ అడవిలో తురుష్కులతో జరిగిన యుద్ధములో విషపూరితమయిన కత్తివేటు తగిలిన నాటినుండి వీరయ్య నాయకుని ఆరోగ్యము అంత బాగాలేదు అందుకుతోడు—

మనోవ్యాదితో మంచము పట్టిన – బాలవీరునకునూ ॥తందాన తాన॥
ఆరోగ్యమ్ము చెడిపోయెనురా – అధిక శ్రమల చేత
మందులేదుర మనోవ్యాధికి – మహిలో ఎందైనా
తిమ్మమాంబయే ధైర్యమతనికి – నూరి పొసెనండి
బాలవీరునకు దాపురించెరా – తీరని వ్యాధేమి
వాతరోగమే అధికమైనది – కీళ్ళ నొప్పి కలిగె ॥తందాన తాన॥

దినదినాదికది ఎక్కువయ్యెను – తగ్గలేదు వ్యాధి ॥తందాన తాన॥
నొప్పుల బాధకు తాళలేక తా – కుంగి పోయినాడు
లేచినిల్చొని నడవగలేడు – వీరయనాయకుడు
మనిషిరూపమే మారిపోయెరా కాగుడు కడుపాయే
చేతులు కాళ్ళు సన్నమాయెను – చాచి ముడవలేడు
భర్తకేమొ తిమ్మమ్మ దేవిరా – సేవలు చేసింది
మేకల చెర్వొస్థాన వైద్యులూ – వైద్యము చేశారు
మంచి వైద్యులను పిలిపించింది – వ్యాధి నయము చేయ
మందులు మంచివి ఇప్పించింది – మానదయ్యె వ్యాధి
మంత్ర తంత్రముల్ యంత్రములెన్నొ – వేయించినదండి
శకున శాస్త్రముల్ చూపించింది – శాంతులు చేసింది
ఒక్కపొద్దు వారాలు వ్రతములు – ఎక్కువ చేసింది
మొక్కుబళ్ళకు ముడుపులు ఎన్నో – లెక్కలేదు బాబు
వేడుకొనెను ముక్కోటి దేవతల – వ్యాధి కుదురదాయె
ఎన్ని చేసినా ఎక్కువెగాని – తగ్గదాయె వ్యాధి
వ్యాధి కుదరదు బాధలు తొలగవు – బాలవీరునికునూ
పతిసేవే తన గతియని తిమ్మమ – మదిలో తలచింది
పతియేగద ప్రత్యక్ష దైవమని – సేవలు చేసింది
పైకి లేచుటకు శక్తిలేని తన – భర్త లేవనెత్తు
లేవనెత్తి మల మూత్ర విసర్జన – లెల్లను జరిపించు
పరిసరములను శుభ్రపరచియు – పవ్వలింప జేయు
స్నానపానములు భోజన వసతులు – అన్ని అమరజేయు
సరగున తాను స్నానముచేసి – చక్కబెట్టునిల్లు
అత్తెము పత్తెము పాటించుచును – అన్నము బెట్టేది
వైద్యులు చెప్పిన వంటకాలను – వండి పెట్టునండీ
మైల లేనివి మంచి బట్టలు – కట్టబెట్టునండి
పతికేలాగున ఇష్టములగునో – అట్టుల చేసేది
రాత్రి పగలు పలుమారులు జెప్పిన – గాసి జెందదేమి ॥తందాన తాన॥

—: పేరొందిన వైద్యులతో చికిత్సలు చేయించుట
బాలవీరునకు వ్యాధి తీవ్రమగుట, తిమ్మమ్మ పతిసేవానిరతి :—

రః లాగున మూడేడులు గడచెను – బాధలెక్కువయ్యె ॥తందాన తాన॥
వ్యాధి బాదగల భర్తకు బాబు – దేహమెల్ల చూడ
ముళ్ళు గుచ్చను సందులేకను – పుండ్లు లేచినాయి
చిల్ల గింజల మాదిరి యతని –ఒడలెల్లను పొడలు
వ్రణ వైద్యులను పిలిపించింది – పూతమందు వేయ
ఒకటి మానితే రెండు లేచును – సందులేత ఒళ్ళు
చీము రక్తము కారుచుండ – దుర్వాసన మితిమీరే
దిన దినమునకూ ఎక్కువెకాని – పుండ్లు మానవయ్యె
అయినా తిమ్మపు పట్టువదలక – సేవలు జేసింది
మూలిక వైద్యుల పిలిపించెను – మలమీదపల్లెనుండి
అయినా గాని లాభములేదు – వ్యాధి గుదరలేదు
కోరి కోరి కొక్కంటి వైద్యులా – కొల్లగ రప్పించె
వారు కోరిన మూలికలన్ని – తెప్పించినదండి
ఎన్నో మందులు ఎన్నో పూతలు – లెక్కలేదు బాబు
ఎన్ని ఇచ్చినా ఎన్ని జేసినా – కుదరలేదు వ్యాధి
భూతవైద్యులకు మంత్రగాళ్ళకు – కొదవ లేదు బాబు
చుట్టుపట్ల వున్నట్టి వైద్యులు – అందరయ్యినారు
సోంపాళెమ్ము సిద్దవటమ్ము – వైద్యులు వచ్చారు
నారాయణుడు వైద్యులనెందరొ – తోడి తెచ్చినాడు
వ్యాధి ముదిరెను నయము గాదురా - బాలవీరునకును
ఏమి కర్మమో బ్రహ్మ రాతయో – తెలియరాదుగాని
సాధ్యము కాదని మానవు పుండ్లని – తిమ్మమాంబదేవి
యోచన చేసి సేవలె ఇంకా – శరణమన్నదండి
మెత్తని పడకల పాన్పులు వేసి – పండబెట్టునండి
విసన కర్రతో వీచును, ఈగలు – దోలుచుండు నండి ॥తందాన తాన॥

—: కోటను వదిలి కుటీర వాసినియైన అపరసుమతి తిమ్మమాంబ – గూటిబెలుకోటను శపించుట —

ప్రజలు చూచి యా బాలవీరుని – రోసడించినారు ॥తందాన తాన॥
పెద్దరోగమది అంటువ్యాధియని – అచటికి రారెవరు
చెడ్డవాసనని దూరము పోతరు – వద్దకు రారెవరు
బంధు జనములా ప్రక్కకెరారు – భయము చెందినారు
సాయము కొరకు తిమ్మమాంబ తా – బిలువ బంధు గణము
వినని వారివలె చాటు చేసుకొని – చోటు విడతురింత
మగని మనసుకు నొప్పిగల్గునని – ఎప్పుడు తిమ్మమ్మ
నిద్రాహారములన్ని మాని పతి – సేవలు చేసింది
కంటికి రెప్పగ అతని చూచె – కళ్యాణి తిమ్మమాంబ
ఇట్టులుండగా గంగరాజులు – వూరివారలేమి
అంటువ్యాధి యిది వచ్చునందరికి – తగదు వూరనుండ
అంటు జాడ్యమని నిందలు గట్టిరి – దంపతులకు వారు
పెద్దరోగమని కుష్ఠురోగమని – దూరము చేశారు
ఊరు విడిచియు దూరముగాను – ఉండమన్నరయ్యా
బ్రతికి యుండియు చచ్చినట్టులె – బాలవీరుడుండె
ఏమి జేయను శక్తిలేకను – చిక్కిపోయినాడు
మంచము పట్టి రోగముతోన – మూల్గుచుండెనండి
విలవిలలాడును వ్యాధి బాధకు – వలవలమని యేడ్చు
ఆమె చేసేడి సేవలు చూచిన – అధికమగును వంత
మగనికి ధైర్యం నూరి పోసెరా – మానిని తిమ్మమ్మ
మగువ రుద్రమ తిమ్మమాంబరా – ఎదురు దిరిగినాది
ఊరివారితో యుద్ధముకైనా –సరియేనన్నాది
అయినాగాని కాలముగాదు – వారికి ఆనాడు
ధర్మమె జయమని మిన్నకున్నది – తిమ్మమాంబనాడు
కాలముగాక మొనగాళ్ళయినా – మెడలు వంచినారు
అడవుల పాలై పాండవులంతా – ఆకులు మేశారు
తనవారే తను దూరము చేసిన – కాదనువారెవరూ
తమ తమ నెలవులు దప్పిన మిత్రులు – శత్రువులవుతారు
మానవ నైజము లోక రీతి ఇది – ఇంతేరాబాబు ॥తందాన తాన॥

ఏసుక్రీస్తునే శిలువ వేసెను — లోకము ఆనాడు ॥తందాన తాన॥
సోక్రటీసుకే విషము దాపిరి — లోకులు ఆనాడు
అయ్యోయ్యో తందాన — ఓ దేవనందనాన ॥తందాన తాన॥

వ॥ ఈ విధంగా బాలవీరునకు పెద్దరోగము కుష్టు రోగము అంటు జాడ్యమని వూరివారు తమ వూరికి దూరంగా ఉండమనగా తిమ్మమ్మ తీవ్రంగా ప్రతిఘటించినది. "తాము దురాచారులయితే అది అంటువ్యాధే అయితే నాలుగేళ్ళుగా సేవ చేయుచున్న తనకెందుకు రాలేదన్నది. మాకిన్ని బాధలుండగా దయతో సాయము చేయుటకు బదులుగా కోటలో ఉండనీయకుండా చేయు మీ రేమి బాగుపడతారు? ఎంతకాలము మీరీ కోటలో ఉంటారు? మీ వూరెంతకాలముంటుందని?" వూరిని, కోటను బాధతో శపించినదాయెను.

—: అపర సుమతి తిమ్మమ్మ పతిసేవానిరతి :—

హరి హరీ! అయ్యోయ్యో! తందాన — ఓ దేవనందనాన ॥తందాన తాన॥
అయినప్పటికి ఊరి వారిని — నొప్పింపగలేక
సాయము లేని ఊరిలో తాను — ఉన్న లాభమేమి
ఊరి కంటెను యడవియె మేలని — యనుకొనె తిమ్మమ్మ
తావుమార్చినా బాగవునేమని — తలచెనెమొ ఆమె
అడుగు తప్పినా పిడుగు తప్పునని — అనుకొనె ఆయమ్మ
పూర్వ జన్మలో చేసిన పాపము — వ్యాధిరూపమాయె
వ్యాది రూపమున పూర్వ కర్మ లిటు — బాధించినవనుచు
ఎవ్వరి కర్మకు వారే బాధ్యులు — అనియె భార్యతోన
ఎవరిని అన్నా ఎవరి నాడినా — ఏమి ఫలితముంది?
వగవ వలదు నా వరాల సతియని — బుజ్జగించినాడు
ఆడదానిగ పుట్టుటకంటె — అడవిచెట్టు మేలు
తిమ్మమాంబయు తిన్నగ తాను — ఆలోచించినది
బావివద్ద తమ పశువుల కొట్టము — బాగుచేసెనండి
వేపమానులా మధ్యలోన ఒక — కుటీరమ్ము చేరె
ఉన్న పశువులను వేప చెట్లకు — కట్టివేసినాది
సంసారమునూ సామాగ్రులను — చేర్చినాది అచట
మంచము మీద భర్త నుంచుక — వెళ్ళినాది అటకు ॥తందాన తాన॥

ఉన్న కుక్కలను ఆవుల తనతో – తీసుకు వెళ్ళినది ॥తందాన తాన॥
సుమతి లాగున సంసారమ్మును – చేసెనండి అచట
సుమతి లాగున పతి సేవలను – చేసె తిమ్మమాంబ
అపర సుమతిగా తిమ్మమాంబయు – పేరు పొందెనండి
కలియుగ సుమతిగ కొందఱామెను – కొనియాడిరి మిగుల
ఓర్పునందు భూమాత యామెరా – తిమ్మమాంబదేవి
సహనమునందున యపర సుమతిరా – అమ్మా తిమ్మమ్మా
అయినాగానీ లోకులు కొందరు – కాకులు వున్నారు
లోకులు కాకులు పలుగాకులుగా – ఆడి పోసికొనిరి
ఆలు మగలకు అంటు రోగము – లంటుకొన్నవేమి
హద్దూ పద్దూ లేక వారును – నడుచుకొన్న రనియూ
అంతావారు చేసుకొన్నదని – చెణుకులు విసిరారు
అందుకె వారు అనుభవిస్తరని – నిందలు మోపారు
ఎందరు లేరు లోకములోన – వారికెవరికైనా
ఇట్టి రోగములు కలిగినవా అని – ప్రశ్నలు వేశారు
లోకము కంతటి మూకటి మూయగ – ఎవరి తరము గాదు
మానవ నైజము అంతేరా యిది – లోకరీతి బాబూ
పర్ణశాలలో భర్త తోడను – తిమ్మమాంబయపుడూ
సుమతి మాదిరి సేవ చేయగ – ఎల్లవేళలందు
ముసలిబాపడా అంజనేయుడా – శాస్త్రిగారు నపుడు
అమ్మగారికి ఎన్నో కథలను – బాగుగ చెప్పాడు
సుమతి కథను సావిత్రి కథను – సీతమ్మగారి కథలు
అనసూయాది సతీమతల్లులు – గూర్చి చెప్పినాడు
వారి మాదిరి అమ్మగారును – ఆచరించు మనెను
ఆమె ధర్మమే ఆమెకు బలమని – ధైర్యము పోశాడు
సుమతి కథను విని తిమ్మమాంబలో – స్ఫూర్తి గల్గెనండి
సుమతికి తనకును ఎన్నో పోలిక – లున్నవనుచు తలచె
లోకము కాలము నేదియుగానీ – పతియె లోకమనుచూ
కాలమెల్ల తన పతిసేవలకె – అంకిత మొనరించె ॥తందాన తాన॥

## —: బుక్కపట్నములో అన్న నారాయణుని బాధలు :—

వ॥ తిమ్మమాంబ అవస్థలు ఇట్లుండగా, అక్కడ బుక్కపట్నములో నారాయణుడు భార్య పుట్టమ్మతో వేగలేక, గూటిబయలుకు వచ్చి చెల్లికి సాయపడలేక నడిమధ్య నలుగుచున్నాడు. దానికి తోడు సేద్యము సరిగా జరగదు. వ్యాపారములో నష్టము వచ్చింది. అయినా వ్యాపారమని పేరు చెప్పి, నారాయణుడు వెళ్ళి చెల్లెలుకు సాయపడసాగినాడు. ఇది తెలిసిన పుట్టమ్మ ఇంటివద్ద పనులు మానేసి పడకటింటి పట్టెపంచము మీద తిని కూర్చొని తిష్ట వేసింది.

గూటిబయలులో నారాయణుడు – కొన్ని దినములుండి ॥తందాన తాన॥
ఊరిలోన తన ఇంటిపనులను – చూచి వత్తుననియు
తిరిగి వచ్చెను బుక్కపట్నము – బాధతోన తాను
భార్యను చూడ పడకటింటిలో – పండు కొన్నదండి
తలభారమ్మని శిలాపోటని – పైకి లేవదాయె
మొండిభార్యను చూచి యాతడు – యోచన చేశాడు
పశువుల నాతడు పాలికి తోలెను – పాలి వారికపుడు
భూములన్ని తా గుత్త కిచ్చెను – బుక్కపట్నమందు
నారాయణుడీ రాగున నలుగుచు – బాధ చెందుచుండ
అన్న సాయమే తిమ్మమాంబకు – ఆదరంబులాయె
అప్పుడు అన్నా తిమ్మమాంబను – ఆదుకొన్నడయ్యా
పట్టుగొమ్మ తా నెట్టుగొమ్మగా – తిమ్మమాంబకతడు
ఆపద్బాంధవుడగుచు తోడుపడె – ఆపదలన్నింట
ఆపదమొక్కుల దేవుని – తిమ్మమ చూడలేదు గానీ
అన్నయె ఆమెకు ఏడుకొండలా – దేవుడయ్యెనాడు ॥తందాన ఓ దేవనందనాన॥

వ॥ ఇట్లుండగ గూటిబయలులో నున్న వృద్ధుడయిన ఆంజనేయశాస్త్రి అవసాన కాలములో తనకక్కడ చూచువారు లేరని, బాలవీర దంపతులకు చెప్పుకొని తన శేష జీవితమును గడుపుటకు కావలసిన ధనమును వారి నుండి తీసుకొని వారి నాశీర్వదించి బండిలో బుక్కపట్నము జేరెను. పితృ సమానుడయిన శాస్త్రిగారి ఎడబాటుకు తిమ్మమాంబ తల్లడిల్లి పోయెను. బుక్కపట్నం వచ్చిన శాస్త్రిగారు తిమ్మమాంబ దీనావస్థను అన్న నారాయణునకు చెప్పిన వాడాయెను.

హాస్యం: మల్లన్న: ఒరే యల్లన్న తిమ్మమ్మ కెవరూ సాయం లేరురా, నీవు ఇది వరలో సాయం పోతానంటివి. ఎల్లావేమిరా?

యల్లన్న: ఒరే మల్లన్న వాళ్ల సంస్థానం బాగుండేప్పుడయితే పోతా నంటిరా— ఇప్పుడు పోనురా, ఎందుకొచ్చిన బాధ

మల్లన్న: చేతిలో బెల్లం వుంటే వాలే ఈగవురా నువ్వు

యల్లన్న: (కోపముతో గట్టిగా) అంటే నీకు ఈగ మాదిరి నేనగుపిస్తున్నానురా— యధవనాయాల నువ్వే ఈ గ వి, దో మ వి, కందిరీగవి, బల్లివి గబ్బిలానివి అ .. .

— అన్న నారాయణుడు వచ్చి చెల్లిని బావను తనతో రమ్మని బ్రతిమాలుట :-

తెక్కలు గట్టుక అన్న వచ్చెను — గూటిబయలు కపుడు ॥తందాన తాన॥
తిమ్మమాంబను బావను చూచి — బాధ జెందినాడు ॥తందాన తాన॥

వ॥ బావను చెల్లిని తనతో బుక్కపట్నము తీసుకు వెళ్ళుటకు నిశ్చయించు కొనినవాడై చెల్లితో నిట్లను చున్నాడు.

అమ్మా విను తిమ్మమ్మా వినవె - వరాల చెల్లెమ్మా ॥తందాన తాన॥
తనవారెవరు లేని చోటను — ఒంటరిగా ఒకరు
ఉండరాదని తనతో రమ్మనె — బుక్క పట్నమునకు
బావను చెల్లిని తనతో రమ్మని — బతిమిలాడినాడు
అన్న మాటను ఆలకించిన - తిమ్మమాంబదేవి
అన్నా విను నాయన్నా వినరా — అన్నా వినవయ్యా
చెడ్డ కాలము పుట్టినింటికి — చేరరాదదన్నా
పూలు అమ్మిన చోటనె మనము — కట్టెలమ్మరాదు
బాగుగ బ్రతికిన బుక్క పట్నమున - బాధలు పడరాదు
బుక్క పట్నము వచ్చిన యెడల — బాధలెక్కువగును
కొరివితోన తలగోకు కొన్నటు — పదినతోను పసులు
అక్కడ గూడ వ్యాధులు పసలను — దూరముంచ గలరు
నక్కల పాలై మనకందరి పగవాళ్ల బ్రదుకు మిగులు
ఇక్కడ ఉంటే స్వాతంత్ర్యము నా — వక్కటుండదయ్యా
మెట్టిన ఇల్లే స్త్రీలకెప్పుడు - ఆశ్రయమ్ముగాదా? ॥తందాన తాన॥

## — భర్త కాలధర్మమును గూర్చి తిమ్మమ్మ అన్నతో ముందుగనె చెప్పుట - సహగమనమునకు అనుమతి బడయుట ;—

వ॥ ఈ విధముగా తిమ్మమాంబ వ్యాధిగ్రస్తుడయిన భర్తతో సుమారు నాలుగైదేండ్లు బాధపడి భర్త అవసాన కాలమాసన్న మగుచున్నదని గ్రహించినదై, భర్త నిద్రించినపుడు రహస్యముగా అన్నతో ఏమనుచున్నదయ్యా అంటే........

అన్న వినుము నాయన్నా వినుము – అన్నా వినుమన్నా ॥తందాన తాన॥
పుట్టిన వారు గిట్టక తప్పదు – ఎంతవారలైన
తూర్పున పుట్టిన సూర్యుడు – పడమట మునిగి తీరునన్నా
కాలధర్మమును పొందిి తీరవలె – సూర్య చంద్రులైన
వదిన వలన వెతలెన్ని పడినను – మరువలేవు నన్నా
తల్లిదండ్రులను మరపించితివి – నిన్ను మరువనన్నా
అక్కరవుంటే ఆపద లేమి – దూరము గావనియు
వచ్చి పోతివి నన్ను చూడను – ఇంతకాలమన్నా
పండిన కాయలు పండ్లు ఫలాలు – నాకు యియ్యకుండా
ఒక్క నాడును ఉండలేదు – నాయన్న నీవు నిజము.
చీరెలు రవికెలు ఇంటికి తెచ్చి – పెట్టి పోతివన్నా
పసుపు కుంకుమ పలుమరు తెచ్చి – ఇచ్చి పోతివన్నా
పసుపు కుంకుమ చీరెలు రవికెల – ఋణము దీరెనన్నా
నాపతి ఇంక నాల్గునాలలో – కాలధర్మ మొందు
పతి తోడిదె సాలోకమ్మని నే – నగ్ని బడదురన్నా
ముందుగ చెప్పితినీ యనుమతిని – బడయుటకిపుడన్నా
దీనత జెందక దిగులు చెందక – దీరుడవగుమన్నా
చెల్లికి నీవు దీవెన లిచ్చి – సుఖముగ మను మన్నా
అని యిటు చెప్పగ చెల్లిని జూచి – నారాయణుడంత
పొరలివచ్చు తన దుఃఖముతోను – యేడ్చి చెప్పెనిట్లు
అమ్మా విను నాచెల్లీ వినుమా – కడుపు కోయకమ్మ
రక్తము పంచుక పుట్టి తిమ్మమ్మ – ఒక్క కడుపులోన
ఒకటే చెట్టుకు జంట కొమ్మలా – నిద్దరమున్నాము
జీవితమ్మునా బాధల నెన్నో – నిన్ను చూచి తల్లీ
భరియించితినే నెప్పుడుగాని – బాధ చెందలేదు ॥తందాన తాన॥

ఆడబిడ్డయని యెంచలేదు – నిన్నన్నదమ్ముడనియూ ॥తందాన తాన॥
ఎంతో ఆశగ నున్నానమ్మ – అంతు తెలుపలేను
తల్లిదండ్రులు వెల్లిపోవగా – వారిని నీయందు
చూచితినమ్మా బాధలు నీకు – చెప్పుకొంటినమ్మ
నీవు పోయిన ఇంక ఎవరితో – నేను చెప్పుకొందు
నీవలె ధైర్యము నాకెవరిత్తురు – లోకమందు తల్లి
నాదు ఆశలు అడవి పాలను – చేయకు మాయమ్మా
నిన్ను చూడ ఆ ఏడుకొండల – దేవుడు అగుపడును
నీవు లేక నీలోకము నాకు – దిక్కు ఎవరు చెల్లి ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు నారాయణుడు ఏడ్వగా తిమ్మమ్మ అన్న కన్నుల నీరు దుడిచినదై అన్నకు ఈ విధముగా కర్తవ్యమును బోధించినదాయెను.

అన్నయ్యా నీ పేడ్చుట మానుము – మనవి వినుము నాది ॥తందాన తాన॥
చెల్లిమాట నీవాలకింపుము – అడ్డము రాకన్నా
పెద్దవాడవై ఏడ్చిన నేను – ఏమి చెప్పగలను
నీకు తెలియని ధర్మము లేవి – నాకు దెలియనన్నా
అయినా నాకు తెలిసిన దానిని – చెప్ప చుంటినీకు
కల్ల జగమ్మిది నిలకడలేనిది – కలల చందమన్నా
వారే రాజులు రాజ్యము లేలరె – ఎందు పోయిరన్నా
మూటగట్టుకొని పోవజాలిరా – వెళ్ళి పోవునాడు
మాది మాది యని పదము చెందిన – మానవు లందరును
ప్రాకు లాడిన పామరు లందరి – పేరు లేదు యిచట
మరువలేదుగా సీతను గాని – సావిత్రిని గానీ
అనసూయాది సుమతి కథలను – మరువ లేము గాదె
వారి జీవితా ధర్మము మనకు – ఆదర్శముగాదా? ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు తిమ్మమాంబ తన ఆశయాలను అన్నకు విన్నవించుకొని సహగమనమున కనుమతి నిచ్చి, యాశీర్వదించుమని అన్న పాదములపై బడగా, నారాయణుడు చెల్లిని లేపి తన సమ్మతిని తెలిపి ఎట్లా ఆశీర్వదిస్తున్నాడయ్యా అంటే........

చెల్లి నేనిక చేయగలిగినది – యేమి యున్నదమ్మా ॥తందాన తాన॥
ఎన్నడయిన నీ యిష్టము నేను – కాదన గలిగితినా?
నీ యిష్టమె నా యిష్టముగాగ – ఇలలో మెలగితిని
మనుగడ యందును మరణము నందును – మనది ఒక్క మాటే
అలివేలమ్మ నిన్ను ఎప్పుడు – అంటిపెట్టు కొనును
శ్రీనివాసుడు నిన్ను చల్లగ – చూచు చుండునమ్మ
అగ్ని దేవుడూ అనుగ్రహించి – చల్లగ నిను చూచు
జన్మ జన్మలూ మన బంధములూ – శాశ్వితమగు గాక
సూర్య చంద్రులున్నంత కాలము – నాకు సోదరివిగా
అవతరించి నను తరింప జేయుము – చెల్లీ తిమ్మమ్మా
తలచిన కార్యము తప్పక జయమగు – తల్లీ నీకెపుడు
ఇష్ట కార్యము సిద్ధిస్తుంది – ఇందుముఖివి తల్లీ
కోటి దీవెనలు నీకు ఇచ్చితి – కొంగు బట్టవమ్మా ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు నారాయణుడు కట్టలు దెంచుకొని వచ్చుచున్న కన్నీటి నాపుకొనుచు దావురుమని ఏడ్చిన బావకు తెలియునని దుఃఖమును దిగ మ్రింగి, మమకారముతో చెల్లిని మరల మరలా దీవించి అందరు కలిసి భోజనము చేసిన వారై అవసానదశలో బావకోరి తనకిచ్చిన బంగారు కడియమును పిడిబాకును, ఖడ్గము, కవచమును, జరీరుమాలును, జవనాశ్వమును ఇంకా ఎన్నో బహుమతులను తీసుకొని, బావను ముద్దుల చెల్లిని కడసారి కన్నులార చూచుకొనుచు మరల నాలుగు రోజులలో వచ్చెదనని చెప్పి, వారిని వీడలేక వీడలేక విడిచి, గుర్రము నెక్కి తన మనసంతా గూటె బయలులోనే ఉండగా కాళ్లీడ్చుకొనుచూ వచ్చి బుక్కపట్నము చేరి, చెల్లెలి సహగమనమునకు పుట్టింటి మర్యాదలను ఘనంగా జరుపుటకు నిశ్చయించి, తగిన ఏర్పాట్లు చేసుకొనుచున్న వాడాయెను,

## — బాలవీరుడు భార్యను ప్రశంసించుట – తన మరణమును సూచించుట :–

బాల్యమాదిగా భక్తుడయిన యా – బాలవీరుడపుడు ॥తందాన తాన॥
భార్యను చెంతకు చేర పిలిచెను – గద్గద స్వరములతో
కన్నుల నీరు గారు చుండగా – చెప్పె నిట్లు సతికి
భామా నిన్ను భార్యగ పొంది – ధన్యత గాంచితిని
నీతో కాపురమమృతమ్ముగా – బ్రదికితినిన్నాళ్లు ॥తందాన తాన॥

ఇరువది యైదు ఏడులు నీతో - సాహచర్యమంతా ॥తందాన తాన॥
ఇరువది యైదు దినములుగానే - నేను గడిపినాను
కలతలు లేక సాగెను నెలతా - నీతో సంసారం
కలలో నైనా వేరు భావములు - కలుగ వ్యాయెమనకు
తలలో నాలుకవై మెలిగితివి - తరుణీ తిమ్మమ్మా
ప్రాణేశ్వరివై పంచప్రాణముల్ - నీవే యైతివిగా
అన్యోన్యతకు అనురాగమునకు - మారు పేరు నీవు
మంగళకరమగు మూర్తివగుచు - కను పండుగ చేసితివి
నావారిని నీవారినిగానే - చూచినావు ఎపుడూ
సంసారమునూ సంస్థానమును - ఉద్ధరించినావు
వర్ధిల్లుము నీవారోగ్యముతో - అర్ధాంగివి నువ్వు
వారసురాలుగ వంశకీర్తిని - శాశ్వతముగ నిల్పు
పాళేగారు మనకు మిత్రుడు - సాయమిచ్చునెపుడు
సంస్థానములో సంగతులన్ని - సర్వమెరిగి నావు ॥తందాన తాన॥

వ॥ అన్న ప్రాణనాథునితో తిమ్మమాంబ ఏమనుచున్నదయ్యా అంటే—

దండమండి పదివేల దండముల్ - ప్రాణనాథ నీకు ॥తందాన తాన॥
నీవులేని క్షణమైన జీవిత - మేల నాకు వలదు
సహగమనమ్మే నాకు శరణము - సత్యముగను స్వామి
పతియే గతిగా పరమ సాధ్వికి - పరమార్థమ్మిదియే
శ్రీనివాసుడే నాకు మార్గము - జూపునిపుడు స్వామి
మనదు చరితము కాలకాలము - శాశ్వతముగ నిల్పు ॥తందాన తాన॥

వ॥ అన్న ప్రాణేశ్వరితో బాలవీరుడేమని బదులు చెప్పుచున్నాడయ్యా అంటే........

నీదు జీవితం సర్వమతముల - సమ్మతమ్ము గాదె ॥తందాన తాన॥
నీదు నిర్ణయం నేను ఇప్పుడు - మార్చలేను సాధ్వీ
మనుమరాలి నీకు ఎన్నియో - కష్టమ్ములు వచ్చె
నాదు గుండెలో గూడుకట్టి - నీ గుండె రాయి చేసి
భరియించితివి బాధలనెన్నో - బ్రతుకు భారమాయె
జన్మ జన్మల నీదు ఋణమును - తీర్చలేను సఖియ ॥తందాన తాన॥

నీసన్నిధిలో నరకమైనను – స్వర్గముగా మారు ॥తందాన తాన॥
అపర సుమతివై నాకు ఎప్పుడూ – సేవలు చేశావు
సుమతికి అనసూయాది సాధ్వులకు – వారసురాలవుగా
భారతనారివి కీర్తిగాంచుమా – భాగ్యలక్ష్మి నీవు
మాననీయవై మహిలో నీవు – మహిమలు చూపెదవు
పరమ సాధ్వి నా ప్రాణేశ్వరి! నే – విసిగిపోయినాను
విసిగివేసరి జీవిత మింకా – వలదను కొన్నాను
చాలు చాలు మీ జీవిత భారము – మోయలేను సఖియ
చేరువ అయినది కాలము చెలియ – తీరె ఋణము తెలియ
జన్మ జన్మల మన అనుబంధము – సాగు శాశ్వతముగ
శ్రీనివాసుడు సతతము నిన్ను – సంరక్షించునుగా
అగ్ని దేవుడు మనల నిప్పుడు – ఆదరించుగాక
ఆదిశక్తి జగదంబ మనలను – దయను జూచు దేవి ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు బాలవీరయ్య భార్యను దీవించగా తిమ్మమాంబ యాతని పాదములకు ప్రణమిల్లినది. బాలవీరయ్య తన భార్య తలనిమిరి, లేపి. తదేక దృష్టితో భార్యను చూచుచూ స్పృహదప్పి ఒరిగిపోయెను. సూర్యుడు అస్తమించెను. సంధ్యా కాలమయ్యెను, తిమ్మమాంబ భర్త శాశ్వతముగా కళ్ళు మూసినాడని దెలుసుకొనుటకు ఎంతో సేపు పట్టలేదు. మరణించిన భర్తను చూచి, యామె కన్నీరు మున్నీరుగా భోరున యేడ్వ సాగినది. ఏ దిక్కులేని యామెకు దిక్కెవరు? దీనుల యడ – దీనులకు దిక్కైన ఆ దేవ దేవునే, శ్రీమన్నారాయణునే స్మరించుచూ దీపము వెలిగించి భర్త తలదగ్గర పెట్టి, యాతని పాదములను తన ఒడియందుంచుకొని దుఃఖావేశముతో సర్వేశ్వరుని స్మరించుచూ నా రాత్రిఅంతయూ నట్లె నేడ్చుచూ స్పృహదప్పి పడిపోయినది. సర్వేశ్వరునే నమ్ముకొన్న సద్భక్తుల యోగక్షేమాలను సర్వేశ్వరుడే చూస్తాడని, గీతలో భగవానుడు సెలవిచ్చెనుగదా అందుకే........

—; తిమ్మమాంబ దివ్యతేజముతో కొక్కంటి నాయునికి కలలో గాన్పించి సహగమనమునకు సహాయమపేక్షించుట —

పాళెగాడు ధర్మాత్ముడు కలడు – కుమార మల్లప్ప ॥తందాన. తాన॥
గూటిబయలు కొక్కంటిపాళెము – నందు వుండెనాడు
పాళెగారును కలలో తాను – కొలువుదీరి యుండ
కలలో తానొక దివ్యకాంతను – గాంచినాడు అతడు ॥తందాన తాన॥

ఏనుగు మీద అంబారీ దిగి — కొలువు చేరినాది ॥తందాన తాన॥
కిరీటి ధారి చేతను శూలం — అభయ హస్తమదియె
తెలుసుకొన్నడు తిమ్మమాంబయని — విస్మయ మొందాడు
ఆసనమందున కూర్చోమనెను — అర్ఘ్యపాద్యమిచ్చె
ఆమె భర్తకు ఎట్టులున్నదని — క్షేమ వార్తలడిగె
ఏమి పనులుగల నిట్టులొచ్చితివి — ఎన్నడు రావమ్మ ॥తందాన తాన॥

వ॥ అని ఇట్లు నాయుడు గారడుగగా తిమ్మమ్మ ఏమనుచున్నాదయ్యా అంటే........

నాదు క్షేమములేమని చెప్పను — నాయన నేనిప్పుడు ॥తందాన తాన॥
మగడు మరణము చెందగ నేను — సహగమనంబునకు
అందుకు తమది సమ్మతి కొరకు — అడుగ వచ్చినాను
సమ్మతినిచ్చి తగిన సహాయము — చేయవలెను వేగ ॥తందాన తాక॥

వ॥ అని ఇట్లు తిమ్మమాంబ అనగా పాళెగారు ఏమని బదులిచ్చినాడయ్యా అంటే.....

అమ్మా. విను తిమ్మమ్మా వినుము — విజయనగర రాజు ॥తందాన తాన॥
క్రూరపద్ధతి సమాగమనమ్మని — రద్దు చేసినారు
శవమును మాత్రము కాల్చుము పూడ్చుము — సహకరించ గలను
రాజ శాసనము శిరోధార్యము — ప్రజల కందరికిని
సత్యవతులని సతులనిమాకు — ఋజువుల ఋనపిదప
చిన్నబిడ్డలు లేని గర్భిణి — కాని సాధ్వులకును
శాసనంబును సడలించుటకు — నాకు హక్కు గలదు ॥తందాన తాన॥

వ॥ అప్పుడు తిమ్మమాంబ నాయునితో ఏమన్నదయ్యాంటే .......

మంచిదె నాయన అట్టులనుకొనబో — నాకు చింతలేదు ॥తందాన తాన॥
బిడ్డలు పోయిరి గర్భిణిగాను — నీకు మాట లేదు
బలవంతముగా నన్ను అగ్నిలో — ఎవరు త్రోయరేమ
నాకు నేనుగా పతితోడిదెనా — లోకమంటి నేను
మీరు సమ్మతి నిచ్చినగాని — ఇవ్వకున్న గాని
తప్పదు నాదు సహగమనమ్మని — తిమ్మమాంబ పలికె
వేదవతిని లాగి ఎవ్వరు — అగ్నిలో వేశారు
కన్యక సీత పతివ్రతని — ఎవరు త్రోసిరగ్ని ॥తందాన తాన॥

వ॥ అని తిమ్మమ్మ తనకు అర్ఘ్య పాద్యములను ఇచ్చిన నీటిని తీసికొని చావిడి ముందర నున్న ఎండిన కాకర చెట్టుపై చల్లగా, అది చిగురించి పూత పిందెలతో కళకళలాడినది. అచటనే పేటగానిచే చంపబడియుండిన రెండు పావురములను తీసుకొని ఎగురవేయగా నవి రివ్వున ఎగిరి పోయినవి. ఈ సంఘటన చూచి నాయుడును, సభికులును సంభ్రమాశ్చర్య మగ్నమానసులై అమ్మగారు కోరినట్లు సహగమనమునకు సహకార మందించుటకు సమ్మతించిరి. తిమ్మమ్మ మరలా ఏమన్నదయ్యాంటే——

స్త్రీల బట్టుక చితిలో వేయుట — పాపకార్యమనియు ॥తందాన తాన॥
రాజు చేసిన శాసనమ్మది — సవ్యమయినదన్నా
నా విషయమ్ము అట్టిదికాదు — నాయన వినవయ్యా
సహగమనమ్ము పాతివ్రతలకె — పరిమిత మయ్యింది
పాలకుడూ మన పితృ సమానుడు — అనియు పెద్దలనిరి
తండ్రికి మారుగ నీవు యుండి — యీ కార్యము జరిపించు
ప్రజలందరికి వార్తను దెల్పుము — వేగమె నాతండ్రి
గూటిబయలుకు ఉత్తరాన — మా స్వంత భూమిలోన
మునివరులెప్పుడొ యాగము చేసిన — స్థలము వున్నదయ్యా
అచ్చట నాకు సహగమనానికి — గుండము త్రవ్వించు
గుండమునందు గంధముచెక్కల — చితినే పేర్పించి
మద్దిచెట్ల స్థంభాలను నాలుగు — దిశలా నాటించు
గుండము పడమర వేదిక గట్టి — పందిరి వేయించు
గుండము చుట్టూ మామిడాకులా — తోరణాలు గట్టి
నేటి ఉదయమే ఊరందరును — మంది మార్బలముతో
పూలు పండ్లుతో సకల జనముతో — రావలె శీఘ్రముగా
సహగమనానికి దీవెనలివ్వ — సాగిరండు మీరు
కార్యక్రమమే యాగము వేగమె — నిర్వహించవలెను
బలవన్మరణము కాదు నాయనా! — నాకది యిప్పుడును
బ్రతుకుటకింక నిచ్ఛ లేదను — భర్త లేని బ్రదుకు
పలుపురి ఎదుటకు వచ్చియున్నాను — పతివ్రతనని చెప్ప
వింత వినోదము నాకు నచ్చదు — నాయుడ నాయన్న
పతియానతి పై నీడు సాయము — నర్థించితినయ్యా
నాకు నేనుగా సహగమనమ్మును — చేయలేక కాదు ॥తందాన తాన॥

ధర్మాచరణమె నాదు ఆశయము – డంభము గాదయ్యా ॥తందాన తాన॥
ధర్మ ప్రచారమె నాదు జీవితము – పరమార్థమ్మయ్యా
అని యిటుజెప్ప తిమ్మమాంబ తా – నప్పుడె లేచింది
తిరుమల నేను వెళ్ళుచుంటినని – ఏనుగు నెక్కింది ॥తందాన తాన॥

వ॥ ఇట్లు తిమ్మమాంబ నాయుని కలలో గన్పించి సహగమనమున కేర్పాట్లు చేయవలసినదని కోరగా నాయుడు వేకువ ఝామున దిగ్గున లేచి మెల్కొన్న వాడై, కలలో కన్పించిన కథ కన్నులకు కట్టినట్లుండగా లేచి చావిడి కచేరి ముందర ఎప్పుడో ఎండిపోయిన కాకర చెట్టును చూడగా అది చిగురించి పూత పిందెలతో వెన్నెల రాత్రిలో కళకళ లాడుచుండెను. అది ఇంద్రజాలమా? లేక ఆ ఇందుముఖి తిమ్మమాంబ మహిమా? అని నాయుడాశ్చర్యము చెందెను. భక్తి జ్ఞాన తత్పరుడయిన నాయుడు విషయము లను తెలసికొనుటకు వెంటనే భటులను గుర్రాలపై గూటిబయలుకు పంపి, సభా సదులరప్పించి చర్చించు చుండెను. కలలో గాంచిన విధముగా తెలతెలవారు చుండగా తిమ్మమాంబ వచ్చునుగదా యనుకొను చుండెను. అంతలో పాళెగారి కుమారునకు విశేషమయిన జ్వరము వచ్చి కలవరించ సాగెను. ఈశ్వరమల ఈశ్వరమ్మను మ్రొక్కండి మంచి కలుగునని బాలుడు తనలో తానేదో గొణుగు చుండెను. అది తిమ్మమాంబ మహత్తేనని, అది యామె పిలుపని, ఆమె ఒక మహత్తర శక్తియని గ్రహించిన పాళెగారు వెంటనే కార్యము జరిపించుటకు సంకల్పించెను. వెనువెంటనే బాలునకూరట గలిగినదాయెను. సభాసదులతో పాటు ఆశ్చర్యము చెందిన నాయుడు తక్షణమే నగారా మ్రోగించి భటులను రప్పించి, తిమ్మమాంబ కలలో చెప్పిన విధముగా గుండము నేర్పాటు చేయుటకు వారికి తగిన ఉత్తర్వులిచ్చి, తానును గూటి బయలుకు ఎట్లా బయలుదేరుచున్నాడయ్యా అంటే .......

కొక్కంటి కోటలో పాళెగారు – కుమార మల్లప్ప ॥తందాన తాన॥
ప్రయాణమగునని పెద్దనగారు – నగార మ్రోగించె
తుత్తుతు తూయని వంకర కొమ్ములు – వెంటనే వూదించె
నగార శబ్దము నగరమంతట – మారుమ్రోగెనయ్యా
కొమ్ముల శబ్దము కోటలుదాటి – కేకలు వేసినవి
అదివిని జనులు వేగిరమ్మగ – పయనమయ్యినారు
పసుపు కుంకుమ పండ్లూ ఫలాలు – బుట్టల పెట్టారు
నూనె పంటలు నేతి కుండలు – తీసికొన్నరపుడు
నగరలోపల పాళెగారు – కుమార మల్లప్ప ॥తందాన తాన॥

మంగళగిరి గోరంచు పంచెను – మొలకు గట్టినాడు ॥తందాన తాన॥
ఛుంగలు విడిచి పట్టుదట్టిని – నడుముకు బిగియించె
కాంతి గల్గిన కవచపు అంగీ – ఒడలికి తొడిగాడు
పసిడి వన్నెల బంగరు శాలును – పైన వేసినాడు
దంతపు పిడి మొలబాకునప్పుడు – దట్టికి చెక్కాడు
పెద్దపురపు పేటంచు రుమాల – శిరమున ధరియించె
పట్టుజరీ పేటంచుల చెల్లా – పైనగప్పినాడు
కొక్కంటివియా కోర చెప్పులు – కాళ్ళకు వేశాడు
చంద్రగిరిది యా పడిగ బెత్తము – చేత బట్టినాడు
చెన్నపట్టణం చలుపదేరాలు – ఒంటెల కెత్తించి
లాయములోని పుట్టపు గుర్రం – తట్టి తెచ్చినారు
వెండికళ్ళెము రికాబు, జీను – వేయ గుర్రమెక్కి
సభికులందరూ గుర్రపు బండ్లలో – బయలు దేరగాను
బత్తెము భరణం రొక్కరోజనం – బండ్లపైన వేసి
పండ్లూ పసుపును నేతి కుండలు – ముత్తైదుల కెత్తి
మంది మార్భళవాయి అందరు – ముందు నడువగాను
దిక్కులెల్ల ప్రజ పిక్కటిల్లగ – చుట్టుపట్ల నుండి
నగారు భేరి ఢంకాలప్పుడు – మారుమ్రోగుచుండ
మేళతాళమ్ము దంగనాదము – ముదము గొల్పుచుండ
నగరు విడిచినా నాయుడుగారు – కోట దాటినారు
పండు పసుపుచు నేతి కుండలు – పల్లె వారలంతా
దారి పొడవునా మోతలెత్తుకొని – వారు వీరు కలిసి
దారి నడచిరి దండి ప్రజలతో – ధరణి అదరునట్లు
అందరు నూటి బయలుకు నాడు – ఎండలోన చేరి
పాతకోటకు తూర్పు దిక్కున – దారి ప్రక్కనున్న
ఎండ దూరని చింతమానది – హాయి గొల్పుచుండ
నాయుడు చూచి నీడకు బొమ్మని – యాజ్ఞలు చేయంగ
దారి దీపెను దళవాయప్పుడు – మాని నీడకేమి
పట్టెమంచము నీడన వేసి – పాన్పులు పరిచాను
అందరు అచ్చట కొల్వు కూటమయి – అలత దీర్చుకొనగ ॥తందాన తాన॥

వ॥ ఆనాటి ఉదయాననే గూటి బయలుకు వచ్చిన భటులు గంగరాజులతో గలిసి తిమ్మమాంబ చెప్పిన విధముగా ఓబులేశుని గుట్ట, ఈశ్వరమల మధ్య ప్రదేశములో గుండమును ద్రవ్వి గుండమునకు నలుదిక్కులా నాలుగు మర్రి స్థంభములను నాటి, వేదిక గట్టి, చుట్టూ మామిడి తోరణాలు గట్టి, గుండములో వేప కట్టెలు, శ్రీగంధపు చెక్కలతో చితినేర్పాటు చేసి సర్వము సిద్దమొనరించి నాయుని రాకకై ఎదురు చూడసాగిరి. ఇక పాళెగారు మంది మార్బలముతో ప్రయాణమై గూటిబయలు చేరు వేళకు మిట్ట-మధ్యాహ్నమాయెను. ఎండకాలముగ నున్నందున గూటి బయలు పాతకోటకు తూర్పున దారిలో నున్న చల్లని చింతచెట్టు క్రింద వున్న చలివెందలలో వున్న నీరు ద్రాగగ, గంగరాజులు అచటికి వచ్చి నాయునికి స్వాగతములు పలికిరి. అందరూ కొంతసేపు విశ్రమించిరి.

ఇక్కడిట్లుండగా, అక్కడ బుక్కపట్నములో అన్న నారాయణుడు సోదరి సహగమనానికి గావలసిన సుమంగళ వస్తువులను ఎట్లా సిద్దము చేసుకొని బయలు దేరుతున్నాడయ్యా అంటే........

—; సహగమనమునకు బయలుదేరి వచ్చు నారాయణుని పుట్టమ్మ ఆక్షేపించుట తిమ్మమ్మను దూషించుట – తిమ్మమ్మ దివ్య జ్ఞానముతో అన్న స్థితిని తెలిసి వగచుట —

ధర్మావరము పట్టువస్త్రముల – పసుపు నద్దినాడు ॥తందాన తాన॥
పంట పసుపును అద్దము దువ్వెన – నేతి కడవలేమి
గాజులు పూలు చెవ్వాకులును – గంధము దీశాడు
వడిబియ్యానికి సన్న బియ్యము – ఐదు సేర్లు దీసె
తియ్య మామిడి, నారింజలను – జామ పండ్లనేమి
అరటి ద్రాక్షలు నిమ్మ పండ్లును - అల్ల నేరడాలు
బుట్టలకేసి భద్రపరచెను – బండ్లు కట్టినాడు
నాగసరములు నగారుకుండలు – తూతూరి జ్యాగ్మటలు
మాప మ్రోగెను బుక్కపట్నము – గ్రామమందు నాడు
బీదలకేమో అన్నదానము – ప్రీతిగ చేశాడు
బంధు మిత్రులను వెంట బెట్టుకొని – పయనమయ్యెనాడు ॥తందాన తాన॥

వ॥ చిన్ననాటి నుండి తిమ్మమ్మతో తమ కయిన ఖర్చుగాక ఆమె చావుకు గూడ తన భర్త మతిమాలి, మితిమీరిన ఖర్చు పెట్టుచుండ చూచిన పుట్టమ్మకు, పుండు మీద కారము చల్లినట్లయ్యెను. పుట్టలో నాగు బుసలు గొట్టినట్లు, కస్సు బుస్సు మంటూ తిమ్మమ్మను నిందిస్తూ పగనితో నిట్లన్న దాయెను.

ముద్దు చెల్లెలు పతి వ్రతయనియు – మురియుచున్న వేమొ? ॥తందాన తాన॥
గుండములోన దుముకుతుందని – గూటిబయలు కేమొ
గుఱ్ఱాల మీద ప్రయాణమయ్యి – గుంజు కుంటవేమొ
చీరా రవికెలు పసుపు కుంకుమలు – తీసుకొన్న వేమొ
ఢూగు ఢూగుమని మద్దెల మేలాల్ – మ్రోగుచున్నవేమొ
అన్న దానమూ విందులు చేసిన – ఎవరి యబ్బ సొమ్ము?
నాదు ఆస్తిని తరగతింటివి – చెల్లెల కొరకేమో
తాతల అస్తిని తరగదీస్తివి – తగుల బెట్టినావు
తిక్కమ్మకు నువ్ తగల బెట్టితివి – కొంపపాడు చేసి
తంటల మారి ఇంట బుట్టెను – తోడ బుట్టుగాదు
మంచి మగనికి మందు బెట్టెను – కడుపు పెరిగి బాగ
పెద్దరోగము తెచ్చి పెట్టెను – పుండ్లు లేచి చచ్చె
గుండ గొయ్యి అది గుండములోన – పడుతుందంటావా?
గుండము బడదు గుంతలో బడదు – గుండ గొయ్యి ముండ
చూడబోయిన వారిని త్రోసి – చూచుచుండు మనెను
నాదు కొంపను చెడు పుట్టినది – నంగనాచి ముండ
తిట్టిన తిట్టు తిట్టక తిట్టె – తిరుమలక్క నేమొ
బండ బూతులు తిట్టినాదిరా – పుట్టము వచ్చిగను
ముఖము ముడుచుకొని చేతులు దిప్పి – మూతులు బొడిచింది
తలను విసరుచూ తల్లడపడుచూ – గడబిడి యరుపులతో
కుండ మీద నొక కుండను వేయుచు – కుక్కల గొట్టుచును
గోల గోలగా వొంగ ఏడ్పులా – చిర చిర చీదుచును
రంకులాడి మా కొంప ముంచెనని – మెటికలు విరుచుచును
గోల పెట్టుచు గుద్దుకొనుచును – నెత్తి మోదుకొనుచూ
చూడు ఎల్లమ్మా చూడు మల్లమ్మాని – చూపి ఏడ్చుకొనుచు
కుయ్యో మొర్రో ఇక నేముంది – కొంప కూలెననుచు
మగని మీదికి రగడకు వచ్చును – గంతులు వేయుచును
బయలు దేరినది మగని కడ్డమై – గంపాగయ్యాలి
పుట్టలోన తా పాము మాదిరి – బుసలు గొట్టుకుంటూ ॥తందాన తాన॥

వ॥ గయ్యాళి గంప పుట్టమ్మ మగనితో రంపులూ రగడలు చేసినది. గయ్యాళి అయిన భార్యకు నారాయణుడు నయాన భయాన ఎంతో నచ్చ జెప్పెను. గానీ మూర్ఖురాలు పుట్టమ్మ మనసు కరగలేదు. కరుడు కట్టిన కఠినాత్మురాలై మగని కష్టముగా నిలబడినది, అతడికి చేయునది లేక యామెను దండించి ప్రక్కకు పడద్రోసి, బంధుమిత్రాదులతో చెల్లికి పుట్టినింటి మర్యాదలను జరుపుటకు పయనమయినవాడయ్యెను, అతనికి ప్రయాణములో గూడ ఎన్నో అడ్డంకులు ఎదురాయెను. ముంగారి కాలమై నందున ఆ ప్రాంతములో పెద్ద వానలు గురియుటచే వంకలూ వాగులూ, వరదలతో కొంత ఆగవలసి వచ్చెను. మద్దిలేరు మహానదియై పారుచున్నందున మరి కొంత ఆలశ్యమాయెను.

ఇట్లుండ గూటి బయలులో తిమ్మమాంబ తన పతి దేవుని శవము నభిషేకించి, తాను స్నాన సంధ్యలు జేసి, సర్వాభరణ భూషితమై, మగనిని అలంకరించి పూల హారములు వేసి పూజించి పల్లకిలో శవమును వుంచుకొని మంగళ వాద్యములతో సహగమనము చేయు స్థలమునకు వచ్చి చితిపై పూలు పరిచి, పూర్ణకలశమునందుంచి, భర్త శవము నందుపమండబెట్టి చేయవలసిన పూజాది కార్యములను పూర్తి చేసి సహగమనమునకు సిద్ధమాయెను .......

దివ్య జ్ఞానముతో అన్న బాధలు, వదిన యాగడములు అతని రాక కాలశ్యమును తెలిసికొన్న తిమ్మమాంబ అన్నీ ఆలోచించి తన వదినలో ఇప్పటికయిన మార్పు తేనెంచి, తన అన్న వస్తే గుండాన పడనివ్వడని, తన మీద మమకారముతో తనతో పాటు అన్నగూడ అగ్నిలో పడతాడని తలచినదై, అన్న రాకకు పూర్వమే తన సహగమనమును పూర్తి చేయుట మంచిదని నిశ్చయించిన దాయెను.

**—: తిమ్మమాంబ చింత చెట్టును శపించుట :—**

వ॥ సహగమన సమయమాసన్న మగుచున్ననూ పాళెగారింకనూ రాక చింతచెట్టు నీడలో నిశ్చింతగా నిద్రించుచున్నాడని తెలిసికొన్న తిమ్మమాంబ, కలత చెందినదై, ఆగ్రహముతో అచటికి కనిపించుచున్న చింత చెట్టును చుర చుర చూచినంతనే .......

చింత చెట్టును చుర చుర చూచుచు – ఆగ్రహించియామె ॥తందాన తాన॥
ఆశ్రయమిచ్చిన చింత చెట్టుసహ – నిలువ నీడలేక
కొమ్మలు రెమ్మలు ఆకులు లేక – కృంగి పోవుగాక ॥తందాన తాన॥

గూబ చెట్టు నా పనులకు నేడు — అడ్డమాయెనేమి? ॥తందాన తాన॥
నీడ నిచ్చినా గుబురు చెట్టు - ఓ గూబ చెట్టుగాను
పందిరి చెట్టు పాడుగానని — పరితాపము చెంద
అనియిటు శాపము చింత మానికి — ఇచ్చెను తిమ్మమ్మా
కోపాగ్నికిని కమిలిపోయెను - చింతాకులు రాలి
శాపముతోన చింతాకంతయు — జల జల రాలింది
రాలిన ఆకులు పాళేగారి — మంచము పై పడగ
ప్రాకిన కొమ్మలు రెమ్మలు లేక — మ్రోడు బారిపోయె
అంత చెట్టునూ నిలువ నీడను — నోచుకొనగ లేక
నిలువ నీడలు లేక ఎండలు — నిగ నిగమని పడియె
నిద్రనున్న ఆ పాళేగారు — దిగ్గున లేచాడు
మంచీ మార్చులమంతయు చూచి — సంభ్రమమందారు
భయ భ్రాంతులై ఆశ్చర్యమ్మును — పొంది నారు వారు
ముడిగిపోయిన చింతమానును — నాయుడు జూచాడు
మనసులోపలా పాళేగారు — మదన పడినడండి
తిమ్మమాంబకు చెప్పిన మాట — మరచి నిద్రబోతి
నన్ను కరుణతో నిద్రలేపుటకు — మానికి యీ గతులు
చెట్టుకు తొలగి నాకు పట్టిన — నాగతులేమగునో
అట్లని తలచి పాళేగారు — తత్తర పడినాడు
ఎవ్వరికిని తాచెప్పక చేయక - గుర్రమెక్కి కుండ
గునక పసువుతో పోవుచుండెనా — గుండము వద్దకును
గొడుగు దీసుకొని ఇద్దరు జట్టీల్ — వెంబడించినారు
వచ్చిన నాయుడు అమ్మను చూచి — వందనాలు చేసి
అదమరచి నిద్రించితి తల్లి — ఆలస్యము జరిగె
అందుకు అన్యధ భావించకుమని — మనవి జేసుకొనగ
తిమ్మమాంబ తన దక్షిణ హస్తము — నెత్తి యభయమిచ్చి
పరవాలేదు ఊరడిల్లుము — కూరుచుండుమనగా
పాళేగారు మంచము మీద - కొలువు దీరినాడు
పాళెగారి సతి మంచము మీద — ప్రక్కన గూర్చుంది
సభాసదులు అందరు వచ్చి — కూరుచున్నారేమి
ప్రజలు అందరూ గుండము చుట్టు — గుములు గూడినారు ॥తందాన తాన॥

## —: తిమ్మమాంబ దాన ధర్మములు జేయుట – చాకలికి నాయుని తలపాగాను దాన మిచ్చుట :—

వ॥ పూర్వము సతీ సహగమనములు యజ్ఞ యాగాది క్రతువులవలె సశాస్త్రీయముగా జరుగుచుండెను. వచ్చిన ప్రజలు క్రిమి కీటకాదులు చేరకుండ గుండము చుట్టు వార నీళ్లు పోసి పసుపు కుంకుమలతో గుండమును పూజించి, తాము దెచ్చిన నూనె కుండలు నేతి దుత్తలు గుండములో వేసి, గాజులు సెవ్వాకులు కొబ్బరి గిన్నెలు పూలు పండ్లు మున్నగు సుగంధ ద్రవ్యములను గుండము నందు వేయుచుండిరి.

శ్రీ గణేశుని నవగ్రహములను – పూజలు జేశారు ॥తందాన తాన॥
నవధాన్యములను గుండము నందున – గంగరాజు పోసె
బ్రాహ్మణులందరు అగ్ని హోత్రుని – జపములు జేశారు
నాయుని సతి తా తిమ్మమాంబకు – గాజులు తొడిగింది
పసుపు కుంకుమా పూలు ముడిచి – నవ వస్త్రములిచ్చింది
పూల మాలలు వేసి యామెను – పూజలు చేసింది
నాయుని సతికి తిమ్మమాంబయు – పట్టుచీరనిచ్చి
పచ్చల పతకము గౌరవంబుగా – ఆమె మెడను వేసే
ముత్తైదువులూ అమ్మగారికి – పడి బియ్యము గట్టి
పసుపు కుంకుమ పూలు పండ్లను – అమ్మగారికివ్వ .
నాయుడు లేచి తిమ్మమాంబతో – ఇట్లనుచున్నాడు
దండమమ్మ పదివేల దండముల్ – తిమ్మమాంబ మీకు
తప్పులన్నియు ఒప్పులుగాను – మన్నన చేయమ్మ
ఏమి కార్యము జరుపవలయునో – చెప్పవమ్మనాకు
క్షణములోపల కార్యములన్ని – చక్కబెట్టగలను
నాయుని మాటలు విన్న అమ్మగా – రేమను చున్నాది
సంతసమందుము సంశయమేలా – తండ్రిగారు మీరు
అన్న రాక మునుపన్ని పనులును – అయిపోవలె సుమ్మీ
అన్న వచ్చినా యగ్నిని నేను – పడగ చూడలేడు
చితిలో పడగా చూచి చూచి తా – నూర కుండ లేడు
అన్న మారుగా నీవు నిలచి ఈ – కార్యము జరిపించు
అందుకె మీరు రావలసినదని – కోరినాను నేను
దాన ధర్మములు జరుగవలెనన – నాయుడె ఇప్పించె ॥తందాన తాన॥

సద్బ్రాహ్మణులకు దశదానములు – నప్పుడె చేయంగ ॥తందాన తాన॥
గోదానములు గోపూజయును – తిమ్మమాంబ చేసె
బీద జనాదుల కందరికప్పుడు – ధన ధాన్యములిచ్చి
తిమ్మమాంబ తనకున్న సమస్తము – పశువులతో కూడ
పేదల కిచ్చి పెంచుకొమ్మని – చల్లగ చెప్పింది
భూములన్ని యా గంగరాజులకె – బహుమతి నిచ్చింది
తోడి కోడలు ఎంగమునెమ్మకు – గుండ్ల దండ నిచ్చె
తనువున గల తన సొమ్ములన్ని – ముత్తైదువులకు ఇచ్చె
మాంగల్యమ్మును స్వర్ణకంకణాల్ – తనకు నుండ నిచ్చి
అంతయు నీగతి దానము చేసి – శాంతి పొందె మిగుల
అన్ని ముగియగా అక్కడ కొక్క – చాకలి వచ్చాడు
తల్లీ నాకు ఏది దానమని – దండము పెట్టాడు
ప్రక్కన చూచిన తిమ్మమాంబకు – మంచము కోడెకినీ
తగిలించిన తలపాగా నప్పుడు – పాశెగారిదేమి
చాకలి వానికి దాన మీయగా – సంతసమందాడు
ఆందుకు నాయుడు సంశయమంధి – అమ్మా తిమ్మమా
రొక్క రోజనాల్ నేను యివ్వనా? – ఏల? తల్లి నీవు
నా తలపాగాను చాకలి కివ్వగ – చిన్నతనము గాదె?
ఏమి కారణము తెలియదు నాకు – తెలియ జెప్పుమమ్మా
సంశయమొందియు నాయుడడుగా – తిమ్మమాంబ దేవి
ఆర్యా అందుకు సంశయపడకుము – కారణమ్ము కలదు
ఆడ బిడ్డనై నందుకు నీదగు – వెంట నంటి నట్టి
అజ్ఞానమును ఎండబెట్టుమని – చాకలిచ్చితిని
కాచుకొన్న నీ కర్మ బంధముల – కాల్చి వేయుటకును
చాకలికున్నా కోరిక మేరకు – దాన మిచ్చినాను
కర్మము లాతడు వుదికి వేయును – కళ్యాణముగల్గు
నాడుపకారము చేసితివయ్యా – ప్రత్యుపకారముగా
చేయగల్గు నీసాయము నేను – చేసినాను యిపుడు
నీ రుమాలు నీ నగరిలోపల – పడకటింటిలోనా
పడమట దిక్కున నున్న గొత్తుకు – తగిలియుండు చూడు
పోయి చూడు నీ నగరుకు వెళ్ళి – పెట్టుకొనుము పాగా ॥తందాన తాన॥

వ॥ అని తిమ్మమాంబ నాయునితో మరియు నిట్లన్నది........

ఈనాడు నీకును అగ్ని గండము – ఉండె నగరిలోన ॥తందాన తాన॥
అడుగు దప్పినా పిడుగు దప్పునని – అందుకె ఇచ్చటకు
కోరికోరి నిన్ పిలువనంపితి – మిత్రులగుటవల్ల
చింత చెట్టుకు చితిని పెట్టియు – నీకు చింత మాన్ప
చెట్టుమీద నీ గండము గుండును – గురిని చేసి వేసి
నీకు మారుగా చెట్టును బలిని – చేసినాను నేడు
నీకు పట్టిన పీడను చెట్టుకు – పీడ బట్టునట్లు
చేసికాల్చితి చెట్టును నేను – చింతమానుమయ్యా
నీకు గల్గినా కర్మజాలము – అగ్ని జ్వాలగాగ
చింతచెట్టును గాల్చినాదయా – చింతవలదురన్నా
శత్రువులున్నరు నిన్ను ఎప్పుడూ – పొంచి వున్నరయ్యా
జాగరూకుడై చేయు పాలన – నూరు ఏండ్లుగాను ॥తందాన తాన॥

వ॥ అని అమ్మగారు నాయుని దీవించినదై మంత్రముగ్ధుడై వినుచున్న నాయుని జూచి తిమ్మమాంబ నిట్లనియె. "అయ్యా భారత యుద్ధములో కర్ణుడు అర్జునునిపై వేసిన నాగాస్త్ర గండమును దప్పించుటకు కృష్ణభగవానుడు రథమును భూమిలోనికి ద్రొక్కగా అర్జునుడు కంఠమునకు గురి చూపబడిన కర్ణుని బాణము అర్జునుని కిరీటమునెత్తుకొని పోయెనని చదివి యుండలేదా?

ఆ విధముగానె నీకును నేడు గండము తప్పింప బడినదని తెలిసికొనుము, అనాలోచితముగా నేదియు చేయలేదని యెరుగుము. నీ రుమాలు నీ నగరిలో నీవు మామూలుగా దగిలించుకొనుటకు వ్రేలాడు చున్నది. పోయి గైకొమ్మని చెప్పినదాయెను

అంతలో వ్యాపారార్థము దేశాటనము చేసుకొంటూ, గొనెద్దుల మీద పట్టు వస్త్రములు, రత్న కంబళములు, పసుపు, పోకలు అమ్ముకొనుచూ, ఎద్దుల వారను గొనెద్దుల వ్యాపారులు ఎద్దుల వారి కోటకు వెళుతూ అచటికి వచ్చి అమ్మగారి నిర్యాణమును చూడవచ్చిరి, వారామెకు బంధువులుగా కొండిరి వారు వృషభలాంఛనులైన గోమాత నందెమ్మ భక్తులు. వారును అమ్మగారికి ప్రియాదరములతో ఆమెకు కానుకగా పట్టు వస్త్రములను పసుపును సమర్పించు కొనిరి. అంత నామె యా పట్టు శాలువలను నాయుని కిప్పగా నతడు పట్టు తలపాగాను ధరించి సంతోషించిన వాడయెను. అమ్మగారికి కృతజ్ఞతలు తెల్పి జీవితాంతము ఆమె మేలు మరువననెను. తన యహంకారము నశించి జ్ఞానోదయమైనదనెను. అమ్మగారందుకు అంతయు సర్వేశ్వరుని సంకల్పమని సెలవిచ్చెను.

అంత అమ్మగారు అచట వున్న ఎద్దులవారిని చూచి వారు తనపై చూపిన ఆదరాభిమానాలకు ఆనందించినదై "ముందు ముందు మీరే యీ గూటి బయలులో నివాసముండి నన్ను కొలుచు చుందురు. మీకు మేలు జరుగును. గంగరాజులు, గంతలెత్తుకొని పోవుదురని తెల్పినది. (అమ్మగారానాడన్నట్లే గంగరాజులు గూటి బయలులో మనజాలక విడిచి వెళ్ళిపోయిరి. తరువాత కాలములో ఎద్దులవారే ఆ యూరిలో నిలిచిపోయిరి. మహాత్ముల సంకల్పాలు కాలక్రమములో సత్యాలై కళ్యాణ కారకాలవుతాయి )

—; తిమ్మమాంబ - ధర్మబోధలు :—

వేదిక నెక్కిన తిమ్మమాంబయా – జనముల కిట్లనియె ॥తందాన తాన॥
సోదరులారా దేశమందున - హతకల్లోలాయె
హిందూ ధర్మము దేవాలయములు – తురకల దాడికిని
నేలపట్టమే అగుచున్నవిరా – తెలుసుకోర భాయి
కులకాంతలను చెరబట్టుచును - ముష్కరులంతటను
సిరిసంపదలను కొల్లగొట్టిరి – ఘరటవర్షమందు
స్వైర విహారము సాగించిరి మన – భారత దేశమున
ధర్మయుద్ధము చేయుటకిప్పుడు - తెలుగువీర లేర!
ధర్మాచరణము చేయగ లెండి – తెలుగుగడ్డ పైన
ధర్మ రక్షణే మన రక్షణయని - మననము చేయండి
ధర్మముతోనే సూర్య చంద్రులు - గతులు దప్పకుండా
నియమిత వేళల తిరుగుచున్నరు - వెలుగు చున్నవారు
నియతి తప్పక విశ్వమంతయు – నడచు చున్నదన్న
సర్వేశ్వరుడీ విశ్వనాటకం – నడుపు చుండెనన్నా
సర్వము నందా సత్యమున్నదీ – సత్యమె బ్రహ్మమురా
సత్యమె శివమూ సత్యమె సుందర – సత్యమె దివ్యత్వం
సత్యము సర్వము కాధారమురా – సర్వకాలమందు
చేయవలసిన పనియే ధర్మం - మానవాళి కెందు
చేయవలసిన పనియే దైవం - విశ్వమానవులకు
తమ తమ పనులను చేయుటె నిజముగ – దైవ పూజరన్నా
పనియే ధర్మం పనియే దైవం – పనులే పూజలురా
పురుషోత్తముడు, పృధ్వీరాజు – ఆదిశంకరులునూ ॥తందాన తాన॥

విద్యారణ్యులు, రాణీరుద్రమా — ధర్మ వీరులంతా ॥తందాన తాన॥
సత్యం వదయని, ధర్మం చరయని — ఆర్ష ధర్మములనూ
ఆచరించిరి చాటిచెప్పిరి — తోటి మానవులకు
నేటిపాలకుల్ రాజులు ప్రజలు — తెలుగు వీరులంతా
నడుము కట్టుకొని జన్మభూమిని — ఉద్ధరించ వలెనూ
లెండు, నడువడు! ఆగక మీరు — ధర్మ రక్షణమున
మాతృ భూమికి ఋణము దీర్చుడు — కర్మ యోగములతో
జీవుల దయతో చూచుచుండుడీ — బుద్ధభూమి యందు
జీవుడె దేవుడు అద్వైతమ్మని — శంకరార్యుడనియె
గోవుల స్త్రీలను వృద్ధులనెపుడూ — రక్షణజేయండి
తల్లిదండ్రులను గురువులనెపుడూ — గౌరవించ వలెను
మంచిని వినుడు మంచిని కనుడు — మంచిని చేయండి
మిమ్ము మీరుగా వుద్ధరించుకొన — సిద్ధముగా లెండు
ఎవరో వచ్చి మనలనెప్పుడూ — బాగు చేయలేరు
ఎవరి కాళ్ళపై వారే నిలువుడు — విశ్రమించకండి
చెఱుకా బెల్లము పెట్టమంటెనూ — పెట్టదు మనకయ్యా
కష్టపడినచో రాళ్ళైవున్నదీ — తెలుసుకోర ధీర
భూమిని దున్నే కర్షక, కార్మిక — సోదరులందరునూ
సిరిసంపదలను మీ చెమటలతో — సృష్టించండయ్యా
శాంతి సుభిక్షము చేయుడి — దేశము సర్వవేళలందు
సర్వమతమ్ముల సామరస్యమును — సాధించుడు మీరు
మానవ సేవయె మాధవ సేవగ — మననము జేయండి
మానవ జన్మము వ్యర్థముగాక — పాటుబడుడు మీరు
మాననీయులై వర్ధిల్లండి — మహిలో మీరంత

## —: తిమ్మమాంబ పూర్వ జన్మ వృత్తాంతము :—

వ॥ అనవుడు త్రికాల వేదియగు తిమ్మమాంబ జనసమూహానుద్దేశించి, నాయనలారా! మా సతీపతుల శరీరములు భస్మీభూతమైన తరువాత గుంటమున జలజలమని ఊరును. మా చితా భస్మమును చిత్రావతిలో గలిపి మల్లప్ప కొండపై చల్లమంటినని మా అన్నతో తెల్పుము. గంగరాజులు పాపాగ్నిలో గలుపగలరు. అల్లే ఏకశిఖర పర్వతముల శిఖరమందును మా చితాభస్మము చల్లవలెనని చెప్పెను. అందుకు వారేగాక అట్లే చేయించగలమనిరి.

అంత తిమ్మమాంబ అయ్యలారా చితిచుట్టూ పాతిన మఱ్ఱి స్థంభములలో ఈశాన్యమూలనున్న స్థంభము నా దివ్యాంశముచే చిగురించి, మహావృక్షమై ముందు ముందు వేలాదిగా ఊడలు, కోటాను కోట్లుగా శాఖలు వేసి వ్యాపించి ఈ ప్రదేశము నంతట ఆవరించును, అని చెప్పెను. అందుకు నాయుడు లేచి "అమ్మా మీరు సహగమనము చేయు స్థలము కొక్కంటి పాళెములో నున్నప్పటికి తలపులపాళెపు సరిహద్దుకు సమీపములో నున్నది. మఱ్ఱిను ఆ ప్రాంతములో వ్యాపించునేమో" అని సందేహపడెను.

అందుకు తిమ్మమాంబ "ఆర్యా! పూర్వమీ ప్రాంతమున మునీశ్వరుల ఆశ్రమముండి తపోభూమిగా పునీతమగుట వలననే నేనిచ్చట చితినేర్పాటు చేయించితిని. అయిననూ నీ కోరిక మేరకు పాళెగాల్ల పాలన ఈ ప్రాంతమున నుండునంతవరకూ మఱ్ఱిమాను తలపుల ప్రాంతమునకు విస్తరించదనెను.

అందుకు నాయుడు "అమ్మా పూర్వమిచ్చట మునులుండిరని తెలుపుచున్నారు, అందువలన మీకు పూర్వజన్మ జ్ఞానము ఉన్నదని తెలిసికొంటిమి. కాన మీ పూర్వ జన్మ వృత్తాంతమును దెలుప వేడుచున్నా" మనెను. అంత నప్పరాత్పరి ఏమను చున్నదయ్యాంటే........

ఆర్యా వినుము అడిగినందుకు – చెప్పవలయు నేను ॥తందాన తాన॥
పూర్వా పూర్వము నందున నేను – స్త్రీనై పుట్టితిని
'కుజనీహాని'యని జననీ జనకులు – పేరు పెట్టినారు
బాల్య వివాహము చేసిరి నాకు – చిన్నవయసు నందే
బాల్యము నందే భర్త పోవగా – సన్యసించినాను
దండకాటవి దిరిగితినప్పుడు – ఇచ్చటున్న మునికి
శిష్యురాలనై పర్ణశాలనే – తపముల చేసితిని
యోగిని యైతివి యోగవిద్యలు – సాధన చేశాను
ఘోరారణ్యము ప్రాంతమియ్యది – కందమూలములను
పండ్లు తేనెలు వెదురు బియ్యము – ఉండె దండిగాను
నెలకు మూడును వానలు నాడు – నేల గురియగాను
నదులు వనాలు నీటి వనరులు – ఉండె నిండుగాను
సాగుచుండె మా తపములు చల్లగ – ఈశ్వరమలయందు
క్రూరుడైన ఓ రాకీనుండు – బోయలు కొందరుతో ॥తందాన తాన॥

మునుల తపస్సుకు భంగము చేయగ – తిరుమల చేరితిమి ॥తందాన తాన॥
తిరుమల దేవుని కొల్చుకొనుచు – గోగర్భము నందుండి
చాల ఏండ్లు నే తపము చేసితి – గురువు సేవ జేసి
కొంతకాలమే నచ్చట నుండగ – యోగి వర్యులపుడు
శ్రీశైలమునకు చేరెదమికనని – శిష్యులతో ననియె
వారు వెళ్ళిరి శ్రీశైలమునకు – నేను మాత్రమపుడూ
వయసు మళ్ళగా మరలా వచ్చితి – భ్రాంతి విడక నిటకు
పర్ణశాలను గట్టుకొంటిని – మర్రి చెట్టు క్రింద
మర్రి చెట్టునే యాశ్రమమ్ముగా – మలచు కొంటినేను
జనులెట ఎవ్వరు మర్రి చెట్టును – గొట్టకుండు నట్లు
రక్షణ చేసితి పర్ణశాలగా – వట వృక్షము నిచట
మరణ కాలమున మర్రిని చూచి – మమత చెందినాను
ఆశ్రమమైన మర్రి చెట్టునా – దేమగునో యనియూ
చింతయు చేసితి మరణించగనూ – చోద్యమాయెనయ్యా
జడభరతుడు తా పెంచినట్టి – యా జింక కడుపు నందె
జింకగపుట్టి మృగములతో తా – కలసి పోయినట్లు
నేనుగూడ మరు జన్మములోన – మర్రిగ జన్మించ
ఇచ్చటనే పెక్కేండ్లు చెట్టుగా – నీడల నిచ్చితిని
దానికి గూడను ఒక్క కారణం – ఉండెనేమొ తొలుత
శాపము లేక వరమో యేమొ – తెలియగ రాదయ్యా
వట వృక్షముగా నుండియు జ్ఞానము – పొంద గలిగినాను
జీవులకెంతో సేవ చేసి వట – జన్మము చాలించ
జన్మ జన్మలకు జీవుల సేవయె – పరమార్థము నాకు
అట్టి తరిని ఈ ప్రాంతమందున – జనుల సంచరించ
కొండల సందున బావులు పండగ – బావులగొందనియూ
దక్షిణంబున దండిగ వెదురు – బియ్యములును దొరికె
పశువుల గూర్చిట వుండుట వలన – గూళ్ళబయలు అయ్యె
[illegible]ంది మామిడి పనసులుండగా – రుచు మామిడు లనిరి
[illegible] వెళ్ళగా [illegible] వనములు – ఇంకిపోయె నిచట
[illegible] శాపమో – చెప్పనేను గాని ॥తందాన తాన॥

వ॥ అంత తిమ్మమాంబ తన పూర్వజన్మ వృత్తాంతమును గూర్చి చెప్పుచూ "కాలక్రమమున ఈజన్మలో పుణ్యాత్ములయిన చన్నక వెంకటప్ప, మంగమాంబ గార్లకు జన్మించినట్లును గత జన్మలో తనకు చిన్ననాటనే గతించిన వ్యక్తియే ఈ జన్మమున గూడ భర్తగా అయ్యేనని తన గురువు మరల మాదవశర్మయను అజ్ఞాత యోగిగా జన్మించి, తిరుమలలో గోగర్భమున తాను, తన అన్న, భర్తతో కలసి తిరుమలకు వెళ్ళినపుడు దర్శనమిచ్చి యాశీర్వదించగా, తనకు పూర్వ జన్మ స్మృతి, దివ్యజ్ఞానము కలిగెననియూ తిమ్మమాంబ సంక్షిప్తముగా తన పూర్వ జన్మ వృత్తాంతమును గూర్చి తెల్పినది. జనులామెను ఏ విధములా కొనియాడిన వారైరి .......

హాస్యం: యల్లన్న: ఒరే పుల్లన్నా నీవు పూర్వ జన్మలో పందికొక్కువయింటావురా, ఎందుకంటే నీకెప్పుడూ పూర్లొవాల్ల సొమ్ము మీదే ఆశగా వుంటుందిరా!

పుల్లన్న: ఒరే యల్లన్నా నువ్వు పూర్వ జన్మలో బల్లిగా వుంటావురా, ఎందుకంటే నువ్వెప్పుడూ పొంచులు వింటావు!

(ఇద్దరూ గట్టిగా) నువ్వు పందికొక్కువు — నువ్వు బల్లివి (నువ్వే. కొక్కు నువ్వే బల్లి యని పోట్లాడుదురు)

## —: తిమ్మమాంబ కాలజ్ఞానమును బోధించుట :—

వ॥ అంత నాయుడు అమ్మగారికి భక్తి ప్రణామములు చేసి "తల్లీ మా పాళెముగా ఈ ప్రాంతమున్నంత వరకూ భావి కాలములో భవదీయ నామముతో వ్యాప్తి చెందబోవు, మరియూను పాళెములున్నంత వరకూ పర ప్రాంతములకు ప్రాకబోదని సెలవిచ్చితిరి. మా పాళెములో మా వంశీయుల పాలన మెంతకాలముండును? జరిగిన పురాణమును తెలిపితిరి. జరుగబోవు విషయములను గూర్చి చెప్పవలసినదిగా వేడెదమన్నవాడాయెను. అంత త్రికాలవేది యగు తిమ్మమాంబ ఏమనుచున్నదంటే........

నాయనలారా సర్వము కాలపు — చక్రమందునెపుడూ ॥తందాన తాన॥
తిరుగు చుండునిది నిత్యము సత్యము — సాగుచుండు నిట్లే
బీజమొక్క చైతన్య శక్తియై — చెట్టగు మానగును
పూయుచున్నదీ కాయుచున్నదీ — పండుచున్నదయ్యా
మార్పు లెప్పుడూ జరుగుచుండును — లోకమందుభాయి
రాజరికమ్ములు, భోగభాగ్యములు — కొంత కాలమేర
పరదేశీయులు వచ్చెదరిచటకు — పాలకులయ్యేరు ॥తందాన తాన॥

స్వారాజ్యమును సాధిస్తారు – నాయకులందరునూ ॥తందాన తాన॥
ప్రజల రాజ్యమే గ్రామ రాజ్యమని – గంతులు వేసెదరు
ధనమే దైవము అంటరు ప్రజలు – దూరమగును దైవం
విజ్ఞానముతో విర్రవీగి – వినాశము దెస్తారు
ఎన్నో మార్పులు చేర్పులు వచ్చి – చేతన గల్గేను
విద్యయగును ఒక వ్యాపారమ్ము – వింతలు వచ్చేను
జనము నిండురా జలము ఎండును – గుర్తుదెలుసుకోర
పాడు శక్తులను ఆపక పోతె – ప్రళయము వచ్చేను
విజయనగరము వినాశమగును – ఓరుగల్లు పోవు
పెనుగొండ, కొక్కంటి కోటలు – కొల్లలు పోతాయి
గంగరాజులు గంతలెత్తుకొని – గమ్మున పోతారు
గొనె ఎద్దులా వారువచ్చి – గునాదులు వేస్తారు
వావి వరసులు చూడరు ప్రజలు – వానరులవుతారు
వివాహాలు రద్దవుతాయి – విధవలు ఏలెదరు
తిరుపల తిరుపతి రాజబాటలు – కలసిపోవునయ్యా
వేల వేల దీపాలు అక్కడా – వెలుగులు చిందేను
సిద్ధపురుషులు వస్తారు – ప్రసిద్ధు లగుదురండి
అడవులె వూర్లు అవుతాయన్నా – అన్నీ పిరియపుగును
కొండలు దున్ని అడవి చెట్లకు – నీళ్ళను పోస్తారు
అంటరాని వారుండరు బాబు – అందరు ఒకటేను
ఓడలు బండ్లూ అవుతాయన్నా – బండ్లు ఓడలగును
జనులు నీళ్ళతో వ్యాపారములు – నిరతము చేస్తారు
బంగారమ్ము బంగారగును – వెండి, కొండ చేరు
ఇత్తడి పుత్తడి అయిపోతుంది – వజ్రము విలువగునూ
మాంత్రిక యుగము పోతుందన్నా – యంత్ర యుగము వచ్చు
నీళ్ళలోనని వెలుగును నూనెను – జనులు గాంచ గలరు
చందమామతో వియ్యమంది – సాముద్రము దోచేను
ఆకాశములో తేలిపోతరు – అందల మెక్కేరు
తోలు బొమ్మలకు ప్రాణములొచ్చి – పాటలు పాడేను
సాగరంబులు పొంగిపోసురన్నా – భూమి మునుగునన్నా
పసిడిగిరిపై హిమంబులోన – కరిగి పోవునన్నా ॥తందాన తాన॥

దేశము కాలము పాత్రల కొద్ది – పాటు పడుమురన్నా ॥తందాన తాన॥
నిత్యమైనది సత్యమైనది – కాలమొక్కటేర
కాలజ్ఞానమె దివ్యజ్ఞానము – జ్ఞానులకుండేను
భక్తులైన వారాత్తులవలెను – వెలిగి పోదురన్నా
సజ్జను లందర సర్వేశ్వరుడు – చల్లగ చూచునురా
సత్యము శివము సుందరమైనది – కాలమేర యన్నా ॥తందాన తాన॥

—: సహగమనము సమాప్తము :—

వ॥ అంత తిమ్మమాంబ సమయము ఆసన్నమగుటచే సభాసదులను సహగమనమునకు సెలవులడిగెను. అంతలో బుక్కపట్నము నుండి వచ్చుచున్న అన్న నారాయణుడు మేకల చెర్వును చేరినట్లు పలకలు కొమ్ముల శబ్దములు వినిపించెను. అపుడు నాయుడమ్మగారిని సమీపించి "తల్లీ తమ సహోదరుడు బంధుమిత్రాదులతో భేరి మృదంగ నాదాలతో వచ్చుచున్నాడని తెలిసినది. కొంత తడవాగుట మంచిదని" విన్నవించెను. అందుకు అమ్మగారు "నాయనా అంతయు దెలియును. ఆలశ్యమగుచో సమయమతిక్రమించును. సూర్యుడు పశ్చిమాద్రిని చేరుచున్నాడు. అంతేగాక మా వదిన మా అన్న నెంతగానో వేధించినది. నన్ను ఎంతగానో దూషించినది. అందుచే నేనామె చీరలు రవికెలు స్వీకరింప దలచుకోలేదు. అన్న వచ్చిన తరువాత అట్లు చేయుట కుదరదు.

అంతేగాదు, మమకారముతో మా అన్న నన్ను సహగమనము చేయనీయడు. అనుకొన్న కార్యమంతయు అస్తవ్యస్తమగును, ఇదిగో ప్రేమ పూర్వకంగా వచ్చిన ప్రజలు, పెద్దవారగు మీరు నాకు సోదరులే – మిమ్మే మా అన్నగా భావిస్తాను. ఇక సెలవిండనగా ఆవాల గోపాలము గొల్లున నేడ్చిరిగాని సెలవు నియ్యలేదు – అంత తిమ్మమాంబ ప్రజానీకము నుద్దేశించి ఏమనుచున్నది .......

దండమయ్య పదివేల దండముల్ – ధరణి ప్రజలకంతా ॥తందాన తాన॥
వందనమ్ములూ పాళెగాడికి – పరమ ఆప్తులకునూ
పుట్టినవారు గిట్టక తప్పదు – చావు సత్యమన్నా
జనన మరణము పగలు రేయిరా – మానవాళికిన్ని
కారేరాజులు రాజ్యము లేలరె – ఏరివారు నేడు
నీటిబుగ్గలు మన జీవితములు – నిలువవు ఎన్నటికి ॥తందాన తాన॥

ధర్మమెప్పుడూ శాశ్వతమయ్యా – తోడువచ్చి గాచు ॥తందాన తాన॥
సైనికునకును యుద్ధము చేసి – కదన రంగమందు
వైరుల చంపుటొ తాను చచ్చుటొ – కాదే ధర్మంబు?
వారి వారివి ధర్మములున్నవి – జీవిత రంగములా
సహగమనమ్మె సతుల ధర్మము –సద్గతి జెందుటకు
అదియే నాకును పరమధర్మము – అన్నలారా నేడు
అలశింపక ఆనతివ్వుడు – అమ్మలక్కలార
అనియిటు తిమ్మమాంబ పలుకగా – ప్రజలందరు నాడు
ఒక్కసారిగా జేజేలంటూ – దీవెన లిచ్చారు
స్వామి సెలవు మా ఆమ్మా సెలవు – తల్లీ సెలవమ్మా
శ్రీనివాసుడు అలివేలమ్మా – అండ దండ నీకు
పార్వతియున్నా పరమేశ్వరుడు – పదిలముగా బ్రోచు
అగ్నిదేవుడు కోటి దేవతల్ – బ్రోతురు నిను తల్లి
కలకాలము నీ కీర్తికాంతులు – వెలుగుచుండు గాత।
ఎల్లకాలము నీవు చల్లగా – వర్థిలు తిమ్మమ్మా ॥తందాన తాన॥

వ॥ అని ప్రజలు జై జేలు పలుకుతూ దీవెనలిచ్చారు. పూలు, అక్షింతలు ఆమె పై జల్లిరి. అటు పిమ్మట తిమ్మమాంబ వేదిక దిగి, తన పెద్దమరిది వెంకటరాయుని తన పతి తల దగ్గర నిప్పంటించమని కోరినది. అంత వెంకటరాయుడు దైవమును ధ్యానించి, కాయగొట్టి కర్పూరమెలిగించి నిప్పంటించెను. అంత తిమ్మమాంబ వినాయకుని, సీతిహోత్రుని ప్రార్థించి తల్లిదండ్రులను తలంచి పతికి నమస్కరించి, సర్వేశ్వరుడగు శ్రీనివాసుని నిశ్చల చిత్తముతో ధ్యానించుచూ ముకుళిత కరకమలయై అగ్ని గుండమునకు ప్రదక్షిణము చేసి, ముందుగా నేయిని, నువ్వులను, అగ్నికి ఆజ్యముగా పోసి, కొబ్బరి కాయలను గొట్టి కర్పూర నీరాజనము వెలిగించి, అగ్ని గుండమును ప్రవేశించినది. అగ్ని జ్వాలలు పై కెగసినవి, మంగళ వాద్య ధ్వనులు మారు మ్రోగినవి. పురోహితులు వేద మంత్రములు - చర్పించిరి. చితిపై కెక్కిన తిమ్మమాంబ, పతి పాదములకు నమస్కరించి, భర్త తలను తన ఒడిలో ఉంచుకొని, ఉత్తరాభిముఖియై, ధ్యాన నిమగ్నయైనది. అగ్నిజ్వాలలలో సతీపతుల శరీరములు కలసిపోయెను. సూర్య భగవానుడు అస్తమించెను. జ్యేష్ఠ శుద్ధ దశమి సోమవారమునాడు సాధ్విమతల్లి సహగమనము చేసి నిర్యాణమందినది. ఇట్లామె మహా ప్రస్థానము సాగినది. అంత పురోహితులు ఇట్లు స్వస్తి వచనములు

ఓం సర్వేషాం – స్వస్తిర్భవతు !
ఓం సర్వేషాం – శాంతిర్భవతు !
ఓం సర్వేషాం – పూర్ణంభవతు !
ఓం శాంతిః శాంతిః శాంతిః !

---

[ సభలోన ఇప్పుడు టెంకాయలు కొట్టి కర్పూరము వెలిగించవలెను ]

—: అన్న నారాయణుడు వచ్చి కన్నీరు మున్నీరుగా విలపించుట :—

మింటికి నెగయు మంటల చూచెను – అంతనె ఆ యన్నా ॥తందాన తాన॥
కొంతదవ్వనె చూచెర అప్పుడు – అగ్ని మంటలన్నా
కార్యమాయెనని కలవరపడుతూ – పరుగిడి వచ్చాడు
బంధుమిత్రులు ఆయగాల్లను – వెంటనంటిరాగ
మారుమ్రోగెను పలుకలు బొమ్మలు – మంగళ వాద్యాలు
గుండము వద్దకు నారాయణుడు – చేరి వేగముగను
చేరినాడు త చేరి చూచెను – తిమ్మమాంబ కొరకు
కాలుచున్న యా చెల్లిని చూచి – ఘోరున ఏడ్చాడు
చీరారవికెలు పసుపుకుంకుమా – చిచ్చున వేశాడు
ఒడి బియ్యమును పూలమాలలు – అందు వేసినాడు
పండ్లు ఫలాలు పిండివంటలు – చిచ్చున పడవేసె
కొబ్బరి నువ్వులు ఉప్పు ఆముదాల్ – అందున పడబోసె
నేతికుండను వూలగంపను – అగ్నిలోన వేసె
తిమ్మమ్మా యని గట్టిగనరచి – వలవల ఏడ్చాడు
చెల్లెలయని తా కూతలు పెట్టెను – దుఃఖపోతదేమి
ఏమి ద్రోహము చేసితినమ్మా – నన్ను మరచి నీవు
వెళ్ళిపోతివి దిక్కులేకను – దీనురాలి వగుచూ
ఆడబిడ్డయని తలచలేదునే – నన్నదమ్ముడనుచు
ఎంతో ఆశతో ఉంటిని తల్లీ – అంతు తెలుపలేను
ఎన్నో నోములు నోచియు కనిరి – తల్లిదండ్రులపుడు
నా ఆశలు, అగ్నిపాలుచేసి – నీ వెళ్ళిపోయినావా?
భ్రాంతిని భస్మము చేసితివమ్మా – ధర్మ మేనా నీకూ ॥తందాన తాన॥

నిన్ను చూచినా కష్టములన్నిటి – మరచి పోవుమంటి ॥తందాన తాన॥
ఎవ్వరితోనిక చెప్పుకొందు – నా బాధలనన్నిటిని
ఇంట బుట్టిన దేవతవమ్మా – మాకు నీవు తల్లీ
దేవత నన్ను దీనునిచేసి – బూడిద పాలాయె
నేను పడ్డ ఈ శ్రమలన్నియునూ – చెల్లీ! యీనాడు
బూడిదపాలు చేసి పోతివా – గుండె రాయి జేసి
అన్నవచ్చిన ఆనందము – నీకేల లేదు తల్లి
అన్న దెచ్చిన మాటలు నీవు – విప్పి చూడవేలా?
తెచ్చిన చీరను కట్టి చూపవే – చిట్టిచెల్లి నీవు
తెచ్చిన రవికెను తొడిగి చూపవే – చెల్లీ తిమ్మమ్మా
పసుపుకుంకుమా పడిబియ్యమునూ – తీసుకొనుము చెల్లీ
పూలు ముడిచి నీ కొప్పున చూపుము – పూల హారమిదిగో
పండ్లు ఫలాలు పిండివంటలు – అవిగో తినవమ్మా
అన్నరాడని ఆశలు విడిచి – అగ్గిని పడినావా
అన్నరాడని వేళ దాటెనని – వేగిర పడినావా?
అన్నను వచ్చితి అన్నీ దెచ్చితి – స్వీకరించవమ్మా
అన్నాయని నీ వాక్కుసారిగా – నన్ను పిలువరాదా?
పలుకవేల నాతల్లీ నీవు – అలిగితివా ఏమి?
తహ తహ లాడును తల్లడిల్లును – వూరడిల్లడయ్యో
వెర్రివానివలె వెర్రిచూపుల – వెల వెల బోతాడు
సారెసారెకు తిమ్మమ్మా యని – కూతలు పెడతాడు
గుండము చుట్టూ తిరిగి ఏడ్చుచు – గుద్దుకుంటడేమి
గుద్దుకుంటను, గుండములోపల – దుముకబోవునంటి
రొమ్ముగాలిన పిల్లిరీతెను – నారాయణుడయ్యయ్యో
తక్కు తమ్ముకుని ఎగురుతాడురా – ఏడ్చుచు హాయన్నా
చెల్లిని దల్చి వెలవెలబోయి – తల్లడ పడతాడు
వంచి దేవతకి చెప్పి చూసెదు – మూర్ఛబోవునంటి
నేనవ చెప్పినా మాటలు వినదు – చెవిటివాని వినదు
చెలిచెల్లెలైపోని తిమ్మడు దేవిని – కలవరిస్తుడేమి?
గోడు గోడున దుఃఖపోతడు – గోడుమానడేమి?
ప్రాణము పట్టుకొని పలుమారు పిలిచిన – పలుకదు తానేమి
చెల్లిని తలచి పిలువబోగాని – ఇటిక చేరుగడేమి
ప్రాణము విడిచిన అగ్ని బడుటకు – సిద్ధమయ్యెనంటి ॥తందాన తాన॥

## —: తిమ్మమాంబ దివ్యదర్శనము – దివ్యోపదేశము :—

వ॥ అంతలో బంగారు కంకణాలు వీణానాదములు జేయగా, సముద్రములో పుట్టిన మహాలక్ష్మిలాగా మండుచున్న గుండమునుండి తన దక్షిణ హస్తమునెత్తి "అన్నా"యని తిమ్మమాంబ పిలువగా నందరు దిగ్భ్రాంతి చెంది, దిక్కులు చూచిరి, ప్రజలు శిలాప్రతిమలవలె చూచుచుండిరి. అగ్ని గుండములో మంటల వెలుగులో తానొక వెలుగై నట్లు దివ్యరూపముతో, అన్నతో నిట్లన్నదాయెను.

"అన్నా దుఃఖించవద్దు – బాధపడవద్దు, నేనెక్కడికి పోలేదు. అనిత్యమయిన ఈ శరీరాన్ని విడిచి శాశ్వతమైన సచ్చిదానంద స్వరూపమై యున్నాను. అన్నా సహగమన సమయము అసన్నమయినందున నీవు రాకమునుపే గుండ ప్రవేశము జేయవలసి వచ్చెను మన్నింపుము. అంతేగాక, బుక్కపట్నములో నీవు బయలుదేరు చుండగా మా వదిన నీతో గలహించి, నన్ను ఆనరాని మాటలన్నది. అందుకావేదన చెందిన నేను ఆమె చీరలు, రవికెలు స్వీకరింపరాదని నిర్ణయించుకొంటిని. ఆమెను ఏవిధముగానైనా సంస్కరించి నీ సంసారమును చక్కదిద్ది నీకు మనశ్శాంతిని గల్గించుటకే నేనిట్లు చేసితిని. అందుకు నీకు, అవంతయూ కొరత యుండదు. ఇదిగో నేనీనాడు చితిలో దుముకుటకు ముందు ధరించిన వస్త్రములు నీవు ముందు తెచ్చి ఇచ్చిన నూతన వస్త్రములే. నీవు తెచ్చి ఇచ్చిన పసుపు కుంకుమలనే పెట్టు కొంటిని, అందుకు నీవు బాధ చెందకుము, అన్నా నన్నాశీర్వదించు, వందనాలని" ఓదార్చెను.

అన్నా! ఇంకొక మాట "నీవు తెచ్చి గుండములో వేసిన ఈ వస్తువులన్నియు బుక్కపట్నములో మన మిద్దిఇంటిలో యథాస్థానములో ఉండును, నీవు వెళ్ళి అన్నిటిని వదిన కప్పగించు. అందువలన ఆమెలో మార్పు రాగలదు, మీ సంసారము ఇకనుండి సామరస్యముగా సాగును, సుఖ సంతోషాలతో వర్ధిల్లుదురు, శ్రీనివాసుడు మిమ్ము చల్లగా చూచును" అని........

మా సతిపతి దేహములగ్నియందునా – దగ్ధము గాగానే ॥తందాన తాన॥
గుండమునందు జలము పొంగును – అగ్ని ఆరునన్నా
నేను పెట్టిన పందిరి నెప్పుడు – తీసివేయవద్దు
గుండము మాత్రము పూడ్చివేయుము – విడిచి పెట్టవద్దు
వదినను నీవు కొట్టకు తిట్టకు – వస్తువులన్నిటిని
ముందరబెట్టి తప్పచెప్పు – నేననిన మాట చెప్పు ॥తందాన తాన॥

నేను పెట్టిన పందిరి గుంజలు – నాలుగింటిలోన ॥తందాన తాన॥
దేప మూలన నాటిన స్థంబము – పచ్చగ చిగురించు
విస్తరించిన కొమ్మలతో అది – పెద్దమానె అగును
మానికి వూడలు, వూడల కొమ్మలు – కొల్లగాను బుట్టి
దినదినమునకు ఏడు ఏడుకూ – వృద్ధిపొందునన్నా
మానే నేను అనుకొనుమన్న – మానని తలచకుమూ
ఈ మానినియే అ మానవి – నీ వెంచుము మాయన్నా
చెల్లెలు మానవి మదిని దలమము – వచ్చుచుండుమన్నా
వచ్చి పిలువుము పలికెదనేను – ముందరన్నగుపడను
నీయడగల నా భాతృ భక్తికి – నిజముగు గుర్తన్నా
వందనాలివే పోయెదనన్నా – సుఖముగ వర్థిల్లు
అనుచు అన్నకు చెప్పి తిమ్మమ – మాయమయ్యేనంత
అమ్మ చెప్పిన మాట మేరకు – అపుడె చూడరయ్యా
భార్యా భర్తల పుణ్య దేహములు – భస్మము కాగానే
గుండమునందు అగ్ని జ్వాలలు – అణిగి పోయినాయె
గుండములోన గుబగుబమాని – నీల్లు వూరి పొంగె
గుండమునందు అగ్ని దేవుడు – చల్లగ శాంతించె
చితా భస్మము తీసుకొనిరయా – నదుల యందు గలుప
నారాయణుడు దోసిట పట్టిని – గుండమందు వేయ
జనులు అందరు గుండము పూడ్చి – వేదిక గట్టారు
వేదిక మీద బృందావనమును – గట్టి పూజచేయ
రాతిబండలు తెచ్చి చిన్నది – గుడిని గట్టినారు
గుడికి లోపల రాతి బొమ్మలు – పెట్టి పూజచేసి
నారికేళముల్ ఫ్రజలు గొట్టి – నీరాజన మిచ్చారు ॥తందాన తాన॥

—: నాయుడు నారాయణునోదార్చుట – తిమ్మమాంబను ప్రస్తుతించుట :—

చింతయుచున్న నారాయణునితో – నాయుడు అన్నాడు ॥తందాన తాన॥
నాయన విను నారాయణ వినరా – తమ్ముడ వినవయ్యా
చింతిల్లకుమా తిమ్మమాంబకై – దేవత మనకామె
ఒక మహాపావని తిమ్మమాంబ – మీ యింట పుట్టినదిరా
వందను పలుకుమా పాపమమాయెను – ఆమె ఎన్నవలన ॥తందాన తాన॥

కారణజన్మగ జన్మించెను - మన ప్రాంతమందు ఆమె ॥తందాన తాన॥
నీకు మారుగ అన్నను నేనై - కార్యము జరిపాను
బంధము గలిపె తిమ్మమాంబ - మన కన్నదమ్ములుగనూ
నీకేకాదు నాకును సోదరి - ఆమె నిక్కవముగ
అందరి సోదరి అందరి బిడ్డ - దేవతరా ఆమె
మాననీయమై పూజలందుకొని - దేవతయైనాది
పాళెములోన పావని యుండుట - గర్వపడుదు నేను
సీతా సుమతికి సాటియైనది - తిమ్మమాంబ దేవి
వీరనారి నా పాళెమునుండుట - వీరావేశముతో
విర్రవీగితిని సంతసమాయెను - వినరా మాయన్నా
ఆంధ్రభూమియూ భారతావని - పావన మయ్యింది
భారత దేశపు ముద్దు బిడ్డమన - తిమ్మమాంబ దేవి
జయజయము శ్రీ భారతమాత - జయము గొనుము తల్లి ॥తంధాన తాన॥

వ॥ అంత కొంత స్వస్థత జెందిన నారాయణుడు, తనకు మారుగ అన్నగా వుండి అన్ని కార్యములు జరిపించినందుకు నాయునికి కృతజ్ఞతలు దెల్పి, తన చెల్లి తనకొక పెద్దన్నను చూపించి వెళ్ళెననెను. నాయుని బుక్కపట్నమునకు ఆహ్వానించెను, నాయుడు అందుకు సంతసించి తాను బుక్కపట్నము వస్తానని అక్కడ మల్లప్ప కొండలలో వేటాడ కుతూహలముగా యున్నను తిమ్మమాంబ ధర్మబోధలతో తానికనుండి వేటలు, ఆటలు మానివేసి శేషజీవితమును ధర్మ కార్యాలకే వినియోగించెదనని తిమ్మమ్మ గుండము నెదుట ప్రతిన జేసెను. నాయుడంత, తిమ్మమాంబ తనకు ఆదర్శప్రాయుడైన తమ్ముని జూపించి వెళ్ళినదని, యీ బంధములు దైవ సంకల్పములని, నారాయణుడు గూటి బయలుకు వచ్చినపుడల్లా కొక్కంటికి తప్పక రావలెననెను. ఇట్లు పరస్పరము ఇద్దరూ అభినందించుకొని ఆలింగనము చేసుకొనిరి. అంత నాయుడు తన నిజనివాసమునకు చేరబోయిన వాడాయెను.

—:తిమ్మమాంబ జీవితము సర్వ మతసమ్మతము :—

వ॥ ఆనాటి ప్రజానీకమంతా తిమ్మమాంబను గూర్చి ఏమనుకొంటున్నారంటే........

సర్వ మత సమ్మతము తిమ్మమా - జీవితంబు నెపుడూ ॥తందాన తాన॥
మనుగడలోన మరణములోన - మాననీయురాలు
సీతా సుమతికి వారసురాలని - కొందరు అన్నారు ॥తందాన తాన॥

కలియుగమందున మరల పుట్టిన — సుమతి యామెయనిరి ॥తందాన తాన॥
అంతటి మానిని పుట్టలేదని — పెద్దలు అన్నారు
అనితర సాధ్యము ఆమె శక్తియని — ఆది శక్తి యనిరి
అంబయామె జగదంబ యన్నరు — జగతిలోననాడు
ఎవరికి తోచిన రీతివారును — కొనియాడంగాను
జీవితాంతము మర్రిమానుగ — పూజలు నందినది
మహిమలు జూపి సర్వ జనులను — చల్లగ బ్రోచింది
సర్వమత సమాదరణీయము — తిమ్మమాంబ మర్రి
చల్లని వెన్నెల వెల్లివిరియును — అందరికామర్రి ॥తందాన తాన॥

—: పుట్టమ్మ పశ్చాత్తాపము చెందుట - తిమ్మమ్మను పూజించుట :—

వ॥ ఇట్లుండ అక్కడ బుక్కపట్నములో తిమ్మమ్మను నీచంగా మాట్లాడిన దుష్ఫలితంగా పుట్టమ్మకు నోరు పడిపోయెను. వాంతి భేదులతో జ్వరము వచ్చెను. తన భర్త వెళ్ళిన రెండవనాటి సాయంత్రమే తమ యింటి నుండి తిమ్మమ్మ సహగమనమునకు తీసుకు వెళ్ళిన వస్తువులన్ని యథాస్థానము చేరుచుండగా తన కన్నులను తానే నమ్మలేక పోయినది, కంగారు పడిపోయెను. ఇదేమన్నా కలా? కనికట్టు విద్యా? అని కలవరపడసాగెను. దీనితో నోరు పడిపోవుటతో పాటు మతిభ్రమ గలిగెను.

బంధుమిత్రాదులతో బుక్కపట్నమునకు మరలివెళ్ళిన నారాయణుడు చెల్లెలి మాటలు అక్షరాలా నిజమై అన్ని వస్తువులు యథాస్థానము నందుండగా, చెల్లిమాట మేరకు వానినొక్కొక్కటే తీసి భార్యకు ఒప్పజెప్పినాడు, పశ్చాత్తాపము చెందిన పుట్టమ్మ చచ్చిన పాముని ఇంకా చంపవద్దని సైగలు చేయుచూ పుట్టమ్మ భర్తకాళ్ళపై బడి ఏడ్వగా అప్పుడు మరల మాటలు వచ్చినవి. పడిపోయిన నోరు తిమ్మమాంబ ప్రసాదముతో మరల మామూలైనది. ఈ మార్పులను చూచిన నారాయణునికి తూర్పున పుట్టు పొద్దు పడమర పుట్టినట్లైనది. పుట్టమ్మ పూర్తిగా మారిపోయినది. తన తప్పులు మన్నించమని భర్తకాళ్ళు పట్టుకొని, పశ్చాత్తాపముతో మరి మరి వేడుకొన్నదాయెను.

అంత ఆ మరునాడే పుట్టమ్మ, తిరిగి మరల ఇంటికి చేరిన చీరలు రవికెలను పసుపు కుంకుమలు తీసికొని భర్త నారాయణునితో కలిసి, మంగళ వాద్యములు మ్రోగగా గూటిబయలుకు బయలుదేరి తను తెచ్చిన చీరలు రవికెలు మరదలికి మారు రూపుగా వున్న మర్రి కొమ్మకు గట్టి పసుపు కుంకుమలు పూసి పూజించినది, పాలు

పొంగించి పొంగలి చేసి నై వేద్యమిచ్చినది. మర్రికొమ్మనే మరదలి కొమ్మగా దలచి తనను మన్నింపుమని మర్రికొమ్మకు సాగిలబడి మ్రొక్కుకొన్నది. తిమ్మమాంబ అనుగ్రహించి తన దివ్య సంకల్పముతో సహగమన సమయములో తాను పెట్టుకొని యుండిన బంగారు కంకణములను, తాటంకములను తట్టలోనికి వచ్చునట్లు చేసినది. అప్పుడు పుట్టమ్మ వానివి సంతోషముగా కళ్ళకద్దుకొని మహాప్రసాదమని స్వీకరించినది. అటుపై కొన్నాళ్ళకు పుట్టమ్మ కడుపు పండి, పిల్లలు కలుగగా వారికి తిమ్మమ్మ పేరే పెట్టుకొన్నది. పుట్టమ్మ నారాయణులిరువురు తిమ్మమ్మను సేవించుకొనుచు పిల్లాపాపలతో కలిసి చల్లగా జీవించిరి. నారాయణుడు చెల్లిని చూడవలెనని బుద్ధి పుట్టినదే తడవుగా తిమ్మమ్మ మర్రిమానికడకు వచ్చి మాను రూపములో ఉన్న ఆ మానినితో మాట్లాడుచూ జీవితాంతము తిమ్మమాంబను కొలుచుకొన్న వాడాయెను.

## —: తిమ్మమాంబ మహిమలు - నాయుని ధర్మ సంస్థాపనము :—

వ॥ నాయుడు నారాయణునకు ధైర్యము జెప్పినను, తిమ్మమాంబ నిర్యాణము అతనికెంతో దుఃఖము కలిగించినది. అయినను వీరుడుగాన తన దుఃఖమును తనలోనే అణచుకొనెను. తుదకు సభాసదులతో కలిసి కొండంత బాధతో కొక్కంటికోటకు చేరెను.

పాశెములోనొక తేజోమూర్తి — అస్తమించెననియు ॥తందాన తాన॥
స్ఫూర్తిదాయకము ఆమె జీవితము - తరతరాలకున్నూ
అరనిజ్యోతి నక్షత్రమువలె — వెలుగు నాకసమున
నగరిని చేరిన నాయుడుగారు - పడకటింట చూచె
పెద్దలందరు పాళేగారి - వెనుకనె ఉన్నారు
అద్భుతమయ్యది ఆశ్చర్యంబు — అదియే రుమాలు
మంచముకోడుకు తగిలించినదీ — అట్లనె వున్నాది
రాలిన చింత ఆకు కొంతయు — అచ్చటచ్చటుంది
జారిన కుచ్చు జారినట్టుగా — పాగాకుండినది
చిలుక కొయ్యకు వేలాడుచును — చక్కగ యున్నదిర
సభాసదులు అచ్చెరువంది — చూచుచున్నవారు
నాయుడు తీసెను తిప్పి తిప్పి — తాచూచెను తలపాగ
తిమ్మమాంబ తన చేత తీసికొని — వాకలి కిచ్చింది
తన రుమాలును వాకలివాడు — సంకలోన పెట్టె ॥తందాన తాన॥

ఏవిధముగనది, నగరికి వచ్చెను – నడుచుకొంటుననియు ॥తందాన తాన॥
అంతా దేవత తిమ్మమాంబ – మహాత్యమన్నారు
తర్కము మాని నాయుడంత – తలపాగా ధరియించె
తిమ్మమ హస్తము తాకిన పాగా – పావన మయ్యింది
తాల్చినంతనే "ధర్మం ధర్మం" – ప్రతిధ్వనించింది
అమ్మగారి యా ధర్మ బోధలు – గుండెలలో నిండి
ధర్మబద్ధుడై నడుచుకొమ్మని – ఉద్బోధించాయి
ధర్మ దేవతయె తిమ్మమాంబగా – దీప్తిగాంచినాది
మాటి మాటికి ధర్మతేజము – మనసున స్ఫురియించె
చెవిరో ఇల్లును కట్టినట్లుగా – చెవులకు వినబడియె
మదిలో హృదిలో మారుమ్రోగెను – ధర్మస్థాపనమ్ము
నాయుడు ధర్మ వీరుడయ్యెరా – నాటినుండి యిలలో ॥తందాన తాన॥

వ॥ ఈ విధంగా తలపాగా ధరియించిన నాయునికి తనకేదో నూతనోత్తేజము గల్గినట్లాయెను. అగ్నిగుండములో గన్పించిన తిమ్మమాంబ తేజోరూపము తన కన్నులకు గట్టినట్లయ్యెను. జీవితాలు అశాశ్వతాలు, ధర్మకార్యాలు చేయమని తిమ్మమాంబ ప్రబోధాలు ఎడతెగకుండా తన యెదలో ప్రతిధ్వనించినట్లాయెను. మరునాటి ఉదయాననే స్నానసంధ్యలు జేసి శ్రీశైల మల్లన్నను వేడుకొని నాయుడు సభానదనమునకు వెళ్ళిన వాడాయెను.

కొలువు కూటము జేరిన నాయుడు – సభికుల జూచాడు ॥తందాన తాన॥
ధర్మ దీక్షతో కర్మదీక్షతో – ధర్మ వీరుడయ్యె
ప్రజాసేవయే పరమార్థముగా – ప్రకటించాడయ్యా
పథకములెన్నో రూపుదిద్దెను – ప్రజలముందు నాడు
ప్రజోపయోగ ప్రణాళికలతొ – ప్రభుత నెరపినాడు
వనములు ఎన్నో వేయబడినవి – వర్షాకాలమునే
వనములు పెంచి వనరులు చూపి – ప్రజలనేలినాడు
చెఱువులు కుంటలు బావులు కాల్వలు – త్రవ్వినట్లు, చేసె
నాయుని చెఱువులు, నడికి కాల్వలు – కుంటలు గట్టించె
దేవాలయములు సత్రంబులనూ – చక్కగ గట్టించె
శిథిలించిన నరసింహ గోపురము – దిద్ది తీర్చినాడు
ఖాద్రి లక్ష్మి నరసింహునికి – పూజలు చేసాడు ॥తందాన తాన॥

మల్లియకొండ మల్లికార్జుని – మ్రొక్కులు జెల్లించె ॥తందాన తాన॥
ప్రతియేడాది గూటిబయలుకు – వెళ్ళి, నాయుడేమి
తిమ్మమాంబకు పొంగలి పెట్టి – పూజలు చేయించె
సర్వ జనులను సహభాషనగా – సేవలు జేశాడు
నాటినుండియు నాయుడుగారు – అశోకుడయ్యాడు
పాళెములోన వేటలనన్ని – నిషేధించినాడు
మూగజీవులను చంపవలదని – బోధలు చేశాడు
ప్రజా క్షేమమే తన క్షేమముగా – పరితపించినాడు
సిరిసంపదలా ప్రజలు దేలగా – తృప్తి చెందినాడు
రామరాజ్యమే తన ధ్యేయంబని – ప్రకటించాడయ్యా
విక్రమార్కుడై విజయ సింహుడై – వర్ధిల్లాడయ్యా ॥తందాన తాన॥

## — తిమ్మమాంబయే తిమ్మమ్మ మర్రిమాను :—

పూర్వ జన్మలో తిమ్మమాంబ – ఒకక్షీరమర్రిమానుగాను ॥తందాన తాన॥
జన్మించినదీ జీవుల సేవలు – చేసెనండి నాడు
ఆపదలెన్నో అగచాట్లెన్నో – ఆమె జీవితమున
గుండెరాయిగా అనుభవించెను – అమ్మా తిమ్మమ్మా
ఆడదిగాను పుట్టుటకంటె – అమ్మా తిమ్మమ్మా
అడవిలోన ఒక మానుగ పుట్టుటె – మేలని తలచినదో?
మనిషికంటెను మానే మేలని – మనసున తలచినదో?
తాను నాటినా మర్రికొమ్మ తన – యంశముగా పెరిగి
తనయశస్సుకు మర్రిమాను ఒక – ఆలయమయ్యిందీ
తరతరాలుగా వ్యాప్తిచెంది – వనదేవతగానయ్యె
తిమ్మమాంబకు మారు రూపమె – మర్రిమానుగాగ
తిమ్మమ మర్రిమాను రూపులో – తిమ్మమాంబ యుంది
తెలిసిన వారికి మర్రిమానెరా – తిమ్మమాంబ దేవి
ఇంతింతై తానంతంతై కడు – వ్యాప్తి చెందెనండి
వామన రూపము విశ్వరూపమై – వృద్ధి చెందినట్లు ॥తందాన తాన॥

## —: విశ్వమహావృక్షము - తిమ్మమ్మ మర్రిమాను :—

అదిగో చూడుము అద్భుతమైనది - అంత మర్రిమాను ॥తందాన తాన॥
ఏడు ఏడు పదునాల్గు లోకముల — లేదు అంత మర్రి
విస్తరించినా వేరు నెచ్చటా — ఇంత మర్రిమాను
సాగు చేయుచున పంటపొలముల — పాదుకొన్నదండి
అల్లిబిల్లిగా నల్లుకొన్న - వనదేవత ఆ మర్రిను
ఆకసంబునూ దాకును మర్రి - కోటి కొమ్మలెన్నో
కోటి వూడల కల్ప వల్లిరా - తిమ్మమాంబ మర్రి
ఈశ్వరామల కొండల నడుమా — పచ్చని కొండాయె
పసిడి కొండగా మర్రిమాను యై - తిమ్మమాంబ వెలసె
ఆరెకరమ్ముల విస్తరించె — యీ నందన వనమండి ॥తందాన తాన॥

వ॥ ఈ విధంగా భక్తుల కోర్కెలీడేర్చు కల్ప వృక్షముగా తిమ్మమ్మ మర్రిమాను శతాబ్దములుగా విస్తరించి ప్రసిద్ధమైనది. తిమ్మమాంబ ప్రాచీన సతీమతల్లులగు సీత, సావిత్రి, సుమతి. అనసూయాది పతివ్రతామ తల్లుల స్థాయికి చెందిన భారతనారీమణి, సుమతీ, అనసూయాదుల పురాణకథలే మిగిలినవికాని వారి గుర్తులు మనకీనాడు లేవు. కాని తిమ్మమాంబకు ప్రతిరూపముగా నాటికి నేటికి ఏనాటికి సాక్షాత్కరిస్తున్నది మన తిమ్మమ్మ మర్రిమాను. అందుచే తిమ్మమ్మ చరిత్ర ఏనాటికైన విలక్షణమైనది. విశిష్టమయినది. తిమ్మమాంబయే నేడు తిమ్మమ్మ మర్రిమానుగా మనకు ప్రత్యక్ష మగుచున్నది. ప్రపంచములోనె అతిపెద్ద మర్రిమానుగా గిన్నిస్ బుక్ అఫ్ వర్ల్డు రికార్డ్సులో నమోదై ప్రపంచ ప్రసిద్ధి గాంచినది. ఈనాడు తిమ్మమ్మ మర్రిమాను భారత దేశములోనె గాదు ప్రపంచములోనె ప్రసిద్ధమైనది. పూర్వము నుండి తిమ్మమ్మ మర్రిమానుకు అపాయము కల్గించిన ఎందరో జనులు ఆపదలపాలైనారు. అందువలన తిమ్మమ్మ మర్రిమానును పూజ్య భావముతో సంరక్షించవలసిన బాధ్యత మనందరిది — ప్రజలందరిదని మనవి జేయడమైనది.

## —: స్వస్తి వాచనము ( గేయము ) :—

సూర్యుడుజ్వలముగా – వెలగునందాక!
వెన్నెల చల్లగా – వెలయునందాక!
సశ్యములు పచ్చగా – పండునందాక!
తిమ్మమాంబ చరిత్ర – వర్ధిల్లుగాత!
జయము గల్గును – అమ్మ చరిత్రమానుకును,
శుభమస్తు శ్రీరస్తు – తిమ్మమాంబకును!

—: : శుభం భూయాత్ : :—

## —: రచయిత పరిచయము – కథాపఠన ఫలము :—

వినరా భారత వీర కుమార – విజయము మనదేర ॥తందాన తాన॥
పండ్ల తోటలు పెంచుమురన్నా – పంట ఫలాలు పంచుము చిన్న
శ్రీనివాసుని కరుణ చేతను – రచన చేసినాను
ధరణిలోన శ్రీ నందిరెడ్డి నిజ – భక్తుల దాసుడను
తప్పులున్న నను మన్నన చేసి – దయను చూడరయ్యా
ఒప్పులున్నచో భళిరా యనుచు – దీవెన లీరయ్యా
బుధ జనులందరికివియే – నా దగు వందనమ్ములెపుడూ
ఎద్దులవారి వంశము మాది – వృషభ లాంచనులము
గంగిరెడ్డి లక్ష్మమ్మ పూజ్యులు – తల్లి దండ్రులయ్యా
విద్యాబుద్ధులు ఉగ్గుపాలతో – నేర్పినాడు తండ్రి
ఇహపరములను సాధించుటకు – హితము నిచ్చెనేమి
తాత వేమన, అవ్వ గురమ్మా – ప్రీతిని నను పెంచ
అప్ప వెంకట నారాయణుడు – నెనరుతోడ చూచె
వెంకటరమణమ చిన్నమ్మయిన – పెద్దబుద్ధి గలది
అక్క మాదేవి లక్ష్మినరసమ్మ – మక్కువతో చూచు
బంధుమిత్రులు ప్రేమ మీరగా – నన్ను చూచినారు
వారి కందరి కివియె నాదగు – వందనమ్ములండి
భూమిని దున్ని బ్రతికే వారము – రైతుబిడ్డ నేను ॥తందాన తాన॥


కడప జిల్లాలో తాసిల్దారుగ – ఏల గలిగినాను ॥తందాన తాన॥
డిప్యూటి కలెక్టరు కాగలిగాను – తిమ్మమాంబ దయను
నారాయణుని కరుణయేగాని – ఘనత నాది గాదు
అక్షర చిత్రము నాయీ కథలు – అన్నగారలారా
జనుల కందిన బాషలోననే – రచనలు జేశాను
జీవనాడులగు జాతీయాలతొ – జీవము పోశాను
బుర్ర కథకును హరికథకున్ను – అంకెను వేశాను
జగధాత్రి తిమ్మమా దివ్య చరితము – గానము జేశాను
తిమ్మమాంబ కథ చదివిన వారికి – విన్నవారలకును
శ్రీగిరి మల్లన దేవి భ్రామరి – చిరాయువులనిచ్చు
శ్రీనివాసుడు సిరిసంపదలా – నిచ్చుగాత నెపుడు
మంగళంబు జయ మంగళమిదిగో – మంగళ మందరికి ॥తందావ తాన॥


♦ ఓం మంగళం – మహత్ ♦

TIRUPATI
50884



[ టెంకాయలు గొట్టి కర్పూరము వెలిగించి మంగళ హారతి ఇవ్వవలెను ]





ద్దుల నందిరెడ్డి, బి.ఎ., ఎల్ ఎల్ బి,
ప్యూటీ కలెక్టరు, రెవెన్యూ డిపార్టుమెంటు.
: ఎద్దుల లక్ష్మమ్మ, గంగిరెడ్డిగారు.
: గూటిబయలు గ్రామం, కదిరి తాలూకా, అనంతపురం జిల్లా
: విశ్వశాంతి శతకము, సర్వేశ్వర శత గీతావళి, నీటిపూలు
తిమ్మమాంబ సంపూర్ణ చరిత్ర, ఆంధ్ర, ఆంగ్లాలలో
వ్యాసాలు, కొన్ని ముద్రితాలు

అభిరుచులు : ప్రకృతి–ఆరాధన, సంగీతము –సాహిత్యము,
ఆశయాలు : మానవసేవ మూలముగా మాధవసేవ,
సత్యం, శివం, సుందరం.